...పుత్ర కవీశ్వరులు"

చందోలు మహర్షులు

రచన :
మేళ్ళచెర్వు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి
సంస్కృతాధ్యాపకుడు, గోరంట్ల వెంకన్న సంస్కృత కళాశాల,
తిమ్మసముద్రం.

ప్రకాశకులు :
సాధన గ్రంథ మండలి, తెనాలి.

కాపీరైటు]

[వెల రూ. 35 - 00

[illegible] 08-02-2016
రాత్రి 8.30

"పితాపుత్ర కవీశ్వరులు" [illegible] 10-[illegible]

చందోలు మహర్షులు

రచన :

మేళ్ళచెర్వు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి
సంస్కృతాధ్యాపకుడు, గోరంట్ల వెంకన్న సంస్కృత కళాశాల,
తిమ్మసముద్రం.

ప్రకాశకులు :
సాధన గ్రంథ మండలి, తెనాలి.

కాపీరైటు] [వెల రూ. 35 - 00

సర్వస్వామ్యములు:
సాధన గ్రంథ మండలికి

మొదటి ముద్రణ : 2005
కాపీలు : 1000

ద్వితీయ ముద్రణ
పార్థివ శంకర జయంతి

ముద్రణ :
కమల ఆర్ట్ ప్రింటర్స్, తెనాలి.
ఫోన్ : 225072, 202972 & 355572

-ఓం-

మండలి మాట

ఏ సిద్ధాంతమయినా గంభీరంగా ఉంటుంది. ఆదర్శంగా ఉంటుంది. ఉదాహరణ లేనిదే అర్థంకాదు. ఆచరణ లేనిదే అనుభవంలోకిరాదు. సిద్ధాంతాలు చెప్పటానికి చాలమంది ఉంటారు. ఆచరణలో ఆదర్శంగా నిలిచేవారి సంఖ్యం అల్పం. వేదాలు ఆగమాలు తంత్రాలు - వీటిలో సిద్ధాంతాలు మార్గాలు చాలా ఉన్నాయి. ఆచరించేవారు, ఆచరించి లక్ష్యాన్ని సాధించినవారు భారత రామాయణ కాలాల్లో ఉన్నారు. కాని నాటి ఉదాహరణలు ఈనాడు అంతగా ప్రభావం చూపవు. ఆనాటి రాఘవునిలాగా నిన్న మొన్నటి దాకా మన మధ్య నడచిన రాఘవులే మన **"చందోలు శాస్త్రి గారు"** అని ప్రసిద్ధులయిన **బ్రఃశ్రీ వేఃశ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారు.** వీరు కలియుగ బ్రహ్మర్షులు. వీరి తండ్రి గారున్ను అంతే. ఈ పితాపుత్ర కవులు వ్యాసశుకుల వంటి వారు. వీరు మనకు నేటి ఉదాహరణ. వీరి చరిత్రం సులభశైలిలో **"ఆత్యజ్యోతి"** (చీరాల) అను మాసపత్రికలో ధారావాహికంగా వస్తున్నది. పుస్తకరూపంలో ప్రచురించితే బాగుంటుందని **సాధన గ్రంథమండలి** భావించింది. రచయిత నుంచి ఆత్మజ్యోతి నిర్వాహకుల నుంచి అంగీకారం లభించింది. వారందరికి మండలి తరపున కృతజ్ఞతలు. దీవెనలు. ఈ మహర్షుల జీవితగాథ మండలి మిత్రులకు మధురానుభూతులను ఇస్తుందని ఆశిస్తున్నాము.

ఇట్లు
సాధన గ్రంథ మండలి,
తెనాలి.

"పితాపుత్ర కవీశ్వరులు"

చందోలు మహర్షులు

రచన:-

మేళ్ళచెర్వు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి

సంస్కృతాధ్యాపకుడు, గోరంట్ల వెంకన్న సంస్కృత కళాశాల,
తిమ్మసముద్రం

"పితాపుత్ర కవీశ్వరులు"

చందోలు మహర్షులు-1

శ్లో॥ శ్రీదేవీ మానసానంద - హేతవే ధర్మ సేతవే ।
గురవే శిష్యలోకస్య - నమోవాకం ప్రశాస్మహే ॥ (శ్రీగురుచరితం నుండి)

రచన:-

మేళ్ళచెర్వు వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి

సంస్కృతాధ్యాపకుడు, గోరంట్ల వెంకన్న సంస్కృత కళాశాల, తిమ్మసముద్రం

* * *

చందోలుకు నా తొలియాత్ర........ అపుడు నాకు సుమారు 9 ఏండ్ల వయస్సు. మేము తెనాలిలో ఉండేవాళ్ళము. మా నాయనగారు శ్రీ మేళ్ళచెర్వు జగన్నాథశాస్త్రిగారు పౌరాణికులు. నేను మా నాయన వద్దనే కుమార సంభవ కావ్యం చదువుకొంటున్నాను. నాకు ఎక్కువగా "గోలీల ఆటమీద" మనసు ఉండేది. కాసేపు చదువుకోవడం ఆ తరువాత గోలీలు. ఇది నా దినచర్య. ఒకరోజు మధ్యాహ్నం మా నాయనగారు తమ గురువుగారు బ్ర॥వే॥ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రులవారి దర్శనానికి చందోలు బయలుదేరారు. తోడుగా నన్ను గూడా తీసికొని పోయారు. అదే మొదటిసారి నేను చందోలు వెళ్ళడం. అంతా క్రొత్తగా ఉంది. రోడ్డు మీద బస్సుదిగగానే ఇంటి ఎదురుగా ఆవుల కొట్టం. దాని వెనుకగా బావి. దాని ప్రక్కన సున్నం గానుగ వేసే "బండ చక్రము" ప్రక్కనే బొక్కెన. అక్కడనే కాళ్ళు కడుక్కొన్నాము. ముందుకు సాగాము. ఎదురుగా రెండిళ్ళ మధ్య సందు. సందులో చివఱగా పెద్ద రావిచెట్టు వేపచెట్టు. వాటిని అల్లుకొని

ఉన్న మాలతీ తీగె. ఆ వృద్ధ వృక్షాల దర్శనం ముందుగా చేసికొన్నాము. అరుంధతీ వశిష్ఠుల వంటి గురుదంపతులకు ఆ వృక్షాలు ప్రతీకగా ఉన్నాయి. వాటికి అల్లికొన్న మాలతీ పుష్ప సౌరభము గురుదంపతుల దౌహిత్రునకు ప్రతీక ఏమో! ఇవన్నీ తర్వాత ఊహలు. తరువాత రోజులలో ఆ వృక్షదంపతుల చుట్టు దత్తాత్రేయ, సుబ్రహ్మణ్య, అర్ధనారీశ్వర, రామచంద్ర ప్రతిష్ఠలు జరిపించారు గురువు గారు. వాటిలో అశ్వత్థ (రావి) వృక్షములో సాలగ్రామబాణ లింగాలను గురువుగారే అంతః ప్రతిష్ఠ చేశారు. ఇవిగాక, ఎవరైనా కాశీయాత్ర చేసినవారు బహూకరించే గంగ చెంబులను తెచ్చి ఆ నీళ్ళు ఇంటి ముందటి బావిలో క్రుమ్మరించేవారు. ఆవిధంగా అది ఒక కాశికా క్షేత్రము. ఆ క్షేత్రానికి విశాలాక్షి "శ్రీదేవమ్మగారు" ఆమె త్రికాలాలకు మాకు 'అన్నపూర్ణా' దేవి. గురువుగారే 'విశ్వేశ్వర శ్రీమన్మహాదేవులు. ఈ కాశి నుండి ఏ వ్యాసుని వెళ్ళ గొట్ట లేదు. అదే దీని మహిమ. ఇక అసలు విషయానికి వద్దాము.

ఆ వృద్ధ వృక్ష దంపతుల దగ్గరగా మేడ మీద వేసిన బోరింగు పంపు గొట్టము ఊర్ధ్వముఖంగా ఉంది. దానికి ప్రక్కనే ఆ అపరకైలాసానికి మెట్లున్నవి. మేడ మీద చెక్కతో చేసిన 'వాలు కుర్చీ' ఉంది. దానిలో ఆసీనులయి విద్యార్థులకు కావ్య పాఠం చెప్తున్న శ్రీ గురువుగారిని చూచి నమస్కరించాము. కాని నాకు మనస్సు భయంతో నిండిపోయింది. ఏమంటే వారు చాల విలక్షణంగా ఉన్నారు. మధ్యాహ్నం అయినా చెక్కుచెదరని తెల్లని విభూతి రేఖలు. వాటి మధ్యన పెద్ద పెద్ద కుంకుమ బొట్లు రెండు. శాక్త వర్చస్సుతో వెలుగు తున్న ముఖం. ఆ విభూతి రేఖలు 'శివునకు' సంకేతమయితే మధ్యలో 'కుంకుమరేఖ'గౌరికి చిహ్నము. వారి ముఖం మీద ఉమామహేశ్వరులు లేదా కామేశ్వరీ కామేశ్వరులు బాలాత్రిపుర సుందరితో కలిసి సంకేతరూపంగా కొలువుదీరినట్లున్నది. దీనినే శ్రీగురుచరితంలో 'కవి'

యద్ఘృష్టకుంకుమసమాగమమాత్రసాధ్యం
అర్ధాంగజాని పరమేశ్వరరూపధేయమ్।
సర్వజ్ఞ మంచితకలం కరుణాప్రవాహి
తద్భావ్యతే గురులలాటసుధాంశుబింబం॥

అని వర్ణించాడు. ఇందులో 'అంచితకలం' అనే పదం 'క్లీం' బీజానికి సంకేతము. శ్రీంబీజానికి సూచకము. 'సర్వజ్ఞం' శివునకు ద్యోతకము. సరే,

మేము నమస్కరించి వారి ఎదుట కూర్చొన్నాము. ఏవో భారత భాగవతాలు రామాయణాలు విద్యార్థుల పాఠాలు కలిసి వారి నాదంలో రాసలీలలు జరుపుతున్నవి. నాకు అర్థం అయీ కాకుండా ఉన్న స్థితి. అప్పుడు గురువుగారి దౌహిత్రుడు శ్రీ చెరువు సత్యనారాయణశాస్త్రిగారు, రూపరేఖలో మామిడిచిగురు లాంటివాడు, ఉత్సాహంలో కోడెదూడ లాంటివాడు, చదువులో బాలసరస్వతి వంటివాడు – తరువాత నా జీవితంలో కవితా వృక్షానికి అంకురార్పణచేసిన కృషీవలుడు – 16 ఏండ్లవాడు నన్ను తీసికొనిపోయి ఇసుక తిన్నెలమీద కాసేపు ఆడించాడు. మెల్లగా సూర్యాస్తమయం అయింది. సంధ్యావందనం అగ్నికార్యం చేసికొన్నాం. నాకు ఇప్పటికీ పరధ్యాస ఎక్కువ. అగ్నికార్యం చేస్తూ పరాకులో అగ్నివేప్ప గోలీకాయ సంధించినట్లు వేలు ఎక్కుపెట్టాను. ఇదంతా గురువుగారి ప్రక్కనే. వారు నావైపు చూడనే చూచారు.

"ఏరా! అగ్నిహోత్రుడ్ని గోలీకాయతో కొట్తావా?" అన్నారు. అసలే గంభీర రూపం. ఆపై ఖంగుమనే కంఠస్వరం. దాంట్లో గద్దింపు. ఇంకేముంది. పిడుగు మీద పడినట్లు అదిరి పడ్డాను. ఎలాగో అగ్నికార్యం అయింది. తరువాత భోజనాలు పూర్తి అయినాయి. నిద్రకు మేడ క్రిందిభాగములో పడుకొన్నాము. మేడపైన గురువుగారి నివాసము. మేడ క్రింద వారి తమ్ముడు శ్రీబాలకోటేశ్వరశాస్త్రిగారి నివాసము.

తెల్లవారుజామున గురువుగారు ప్రాణాయామం చేసికొంటారు. యోగం అనంతరము వారు వేద, పురాణ, శాస్త్ర, కావ్య, ఆంధ్రకావ్యాలలోని ఆధ్యాత్మిక పద్యాలతో ప్రార్థన చేస్తారు. ఆ ప్రార్థన మాత్రము బ్రాహ్మీముహూర్తంలో అందఱికి మేలుకొలుపు. వారి గంభీర కంఠము నుండి జాలువారి చల్లని పైరగాలుల తరంగాలతో సయ్యాటలాడుతూ వచ్చిన ఆ ప్రార్థనాగీతాలు అలలు అలలుగా మా చెవులకు సోకినాయి. విద్యార్థులు చదువులకు లేచారు. మేము గూడా లేచి ప్రయాణానికి సిద్ధమయినాము. నాడు వారు చదివిన పద్యాలలో 'ఆనాడు విన్నదిగా' నాకు గుర్తున్న పద్యము "శ్రీకాళహస్తీశ్వర శతకము" లోనిది. కవి తియ్యని పల్కుల ధూర్జటి.

ఏ వేదంబు పఠించె లూత భుజగం బే శాస్త్రముం జూచె దా
నే విద్యాభ్యసనం బొనర్చె కరి చెంచే మంత్ర మూహించె బో,
ధావిర్భావ నిదానముల్చదువులయ్యా! కావు త్వత్పాదసం
సేవాసక్తియ కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా॥

ఇదీ గురువుగారితో నా తొలి పరిచయము.

"అగ్నే నయ, సుపథా రాయే అస్మాన్"

నా శిష్యత్వము:– మా నాయనగారు నన్ను తెనాలి సంస్కృత కళాశాలలో తెలుగు ఎంట్రన్సులో చేర్చారు. నా వయస్సు సుమారు 9–10 మధ్య. అక్కడ చదువు నా తలకు ఎక్కలేదు. వయస్సు తక్కువ, సహజప్రజ్ఞ తక్కువ. దాంతో ఉన్న చదువు గూడా మఱుగున పడింది. గోలికాయలు మాత్రం బాగా అర్థమవుతున్నాయి.

మా నాన్న గురువుగారిని ఆశ్రయించారు. వారు నన్ను తమవద్ద చేర్చికొన్నారు. నా 10వ ఏట చేరిన నేను 16 ఏండ్ల వయసు దాకా అంటే సుమారు 6–7 ఏండ్లు సాహిత్య వ్యాకరణాలను సాధ్యమయినంత అధ్యయనం చేశాను.

నా అర్హత:– అందువలననే వీరిని గూర్చి యీ వ్యాసం వ్రాసే అర్హత వచ్చింది నాకు. నిజానికి ఇంతకు ముందే శ్రీ చెర్వు సత్యనారాయణశాస్త్రిగారు గ్రాంథికశైలిలో యీ చరిత్రను గ్రంథస్థం చేశారు. దీనిలో భాగమైన ఒక కథను 60 ఏండ్ల క్రితమే గురువుగారి శిష్యులయిన శ్రీ గట్టి లక్ష్మీనరసింహ శాస్త్రిగారు **"అగ్ని పరీక్ష"** అనేపేరుతో తెలుగు గద్యకావ్యంగా వ్రాశారు. ఈ కథ **"శ్రీగురుచరితం"** అనే సంస్కృత కావ్యంగా గూడా తరువాత ప్రచురణ అయ్యింది. వీటి అన్నిటి సహాయంతో నా అనుభవాలను జోడించి శ్రీ రావి మోహనరావుగారి ప్రేరణ మేఱకు **"ఆత్మజ్యోతి"** పాఠకులకు ఈ వ్యాసం సమర్పిస్తున్నాను. దీని కొఱకు పత్రికాశైలిని స్వీకరించాను. గురువులు నన్ను క్షమించెదరు గాక!

...ప్రారంభము ::

ఒకనాడు చరిత్ర ప్రసిద్ధమయిన చందోలు నగరం మఱల ప్రసిద్ధికి రావటానికి కారణం **"చందోలు శాస్త్రులవారే"**. "చందోలు శాస్త్రులవారు" అనే ఈ పేరు మొదట శ్రీ తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రుల వారిది. వీరు మా గురువుగారు శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రిగారికి తండ్రిగారు. మా గురువుగారికి తమ తండ్రిగారిపై అమితమయిన గౌరవము. రాముడు సీతను ఎందుకు అభిమానించాడంటే ఆమె దశరథుని అనుమతితో తనకు భార్య అయింది కనుక – అని రామాయణము. **"దారాః పితృకృతా ఇతి"**.

మా గురువుగారు కూడా అట్టి **"రాఘవులే"**. వారి పేరున్నూ అదే. ఏ సందర్భము వచ్చినా తన తండ్రిగారిని గూర్చి వారు భక్తిగా ఏదో ఒకటి చెప్తూ ఉండేవారు. అందువలన ఈ వ్యాసములో ముందుగా శ్రీ తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రిగార్ని గూర్చి ముచ్చటిస్తాను.

శ్రీ వేంకటప్పయ్యశాస్త్రిగారు తిరుపతి వేంకటకవుల కాలంలోని వారు. వారు కవులయి ఋషులయితే వీరు ఋషులయి కవులయినవారు. ఆ రోజులలో అప్రతిహతమైన పాండిత్యంతో అఖండమైన ఆధ్యాత్మికశక్తితో చుట్టుప్రక్కల వారికి ఆరాధ్యదైవంగా ఉండేవారు. వారివలననే చందోలుకు పేరు వచ్చింది. "చందోలు" తోనే వారి పేరు మొదలయింది. వారి పుత్రుల ద్వారా ఆ కీర్తి నేటికీ సాగుతున్నది.

నివురుగప్పిన నిప్పు:– శ్రీ వేంకటప్పయ్యశాస్త్రిగారికి తమ '22'వ ఏటి వరకు చదువు ధ్యాస లేదు. ఆధ్యాత్మికత గూడా అంతగా లేదు. 'పేకాట' ఎక్కువగా ఆడేవారు. చందోలులోనే దేవీ ఉపాసకులు శ్రీ కొలచన యజ్ఞనారాయణశాస్త్రులుగారు ఉండేవారు. నివురుగప్పిన నిప్పులాగా ఉన్న వీరిని గమనించి వారు చేరదీసారు. పంచాక్షరి ఉపదేశించారు. ఆ మంత్రోచ్చారణచేస్తూ రోజూ తుమ్మిపూలు కోసి తన శివపూజకు తెచ్చియిమ్మని

కోరారు. అవిధంగా శ్రీ వేంకటప్పయ్య శాస్త్రి గారు గురుశుశ్రూష చేశారు. తరువాత తమవద్ద ఉన్న మంత్రశాస్త్ర గ్రంథాలకు వీరిచేత 'నకలు' వ్రాయించారు. అవిధంగా పరోక్షంగా ఆ ఉపాసకులు శ్రీ వేంకటప్పయ్య శాస్త్రిగారికి పూర్వజన్మ విద్యలను అనుసంధానం చేశారు. '**జ్వలతి చలితేంధనోగ్నిః**' – అని కాళిదాసు చెప్పినట్లే నిప్పు మీద అంతవఱకు కప్పి ఉన్న 'నివురు' తొలగింది. వీరికి శ్రీవిద్యోపదేశం కూడా చేయాలని ఆ ఉపాసకుడు సంకల్పించాడు. కాని పరాశక్తి స్వయంగా అనుగ్రహిస్తానని చెప్పటం వలన ఆ ప్రయత్నాన్ని విరమించుకొన్నారు. **ముండకోపనిషత్తులో** ఒక మంత్రం ప్రకారము "దైవ స్వరూపము ఇతరుల ప్రవచనం వల్లగాని, చదువువల్ల గాని లభించదు. దైవం ఎవరిని వరించాలనుకుంటుందో వారే దానిని పొందగలుగుతారు.

> **నాయమాత్మా ప్రవచనేన లభ్య–న మేధయా న బహునా శ్రుతేన**
> **యమేవైష వృణుతే తేన లభ్య–శ్తస్యైష ఆత్మా వివృణుతే తనూం స్వామ్॥**

కనుక వారియందు అనుగ్రహం కల ఆ దేవి తనే స్వయంగా వారిని వరించింది. దేవికి ఇంకొకరి అవసరం ఏమున్నది. ఇంతలో వేంకటప్పయ్యశాస్త్రిగార్కి హనుమాయమ్మగారితో వివాహం అయినది. అప్పుడు వీరికి చదువుకోవాలనే కోరిక కలిగింది. **"వివాహో విద్యానాశాయ"** అంటారు. కాని వీరి విషయంలో **"వివాహో విద్యాలాభాయ"** అయింది.

'పొన్నూరు' లో శ్రీ పాతూరి కోటయ్యశాస్త్రిగారి వద్ద రఘువంశము చతుర్థసర్గ మొదలు పెట్టి. 2, 3 నెలల్లో నేర్చిన పాండిత్యంలో తమ గురువుగారికి బదులుగా (గురువుగారికి మైలరావటం వలన) కాశీఖండం పురాణం చెప్పి శ్రోతలను మెప్పించారు. "కాశీఖండమయః పిండమ్" అని ప్రసిద్ధి. అంతటి ఉక్కుముక్కను అవలీలగా పురాణంగా చెప్పటం చూచి వారి గురువుగారే ఆశ్చర్యంలో మునిగారు. వారికి అర్థమయింది. ఇతనికి తాను చదువు చెప్పలేదని, కేవలం అతనిలోనే ఉన్న చదువును వెలికితీసానని.

పార్వతీదేవి విద్యాభ్యాసం ఇలాగే సాగినట్లు కాళిదాసు కుమార సంభవంలో చెప్పాడు.

> **తాం హంసమాలాః శరదీవ గంగాం,**
> **మహౌషధీం నక్తమివాత్మభాసః**

అంటే శరదృతువు వచ్చేటప్పటికి హంసలు ఎక్కడెక్కడి నుంచో గంగానది వద్దకు సహజంగా స్వయంగా వస్తాయి. మయూరశిఖి లాంటి ఓషధీ లతలకు కాంతులు పగలు కనబడవు. కాని రాత్రి అయ్యేటప్పటికి ఆవిర్భవిస్తాయి. అలానే పార్వతీదేవికి కౌమార వయస్సులో తన పూర్వజన్మ విద్యలు అన్ని వచ్చినాయిట. అలానే శ్రీవేంకటప్పయ్యశాస్త్రిగారికి మనోమయ కోశంలో ఉన్న పూర్వవిద్యలన్ని సహజంగా స్ఫురించినాయి. అపుడే ఆ గురువుమీద "గురుస్తుతి" అని సంస్కృత శతకం గూడా ఆశువుగా రచించారు.

అందువలన గురువుగారు వీరికి సిద్ధాంతకౌముదిని ఉపదేశించి "నాయనా! నీవు మహా పురుషుడివి. సంస్కారం కోసం సాందీపని వద్దకు కృష్ణుడు వచ్చినట్లు నీవు నా దగ్గరకు వచ్చావు. నా బోధన అవసరం లేదు. సర్వశాస్త్రాలు నీకు సమన్వయం అవుతాయి. స్వయంగా చదువుకో" అని ఆశీర్వదించి కాశీయాత్రకు వెళ్ళారు.

ఇక, తర్కశాస్త్రం చదవాలనే కోరికతో కళ్లేపల్లి వాస్తవ్యులైన అద్దేపల్లి సోమనాథశాస్త్రుల వారి వద్దకు వెళ్ళారు శ్రీ తాడేపల్లివారు. 45 రోజుల చదువుతో గురువును మెప్పించారు. నీ ప్రజ్ఞకు తర్కశాస్త్రం స్వయంగా లభ్యం అవుతుందని గురువు దీవించి పంపారు.

కోట నరసింహశాస్త్రిగారి వద్ద శంకర భాష్యం చదివారు. అదీ ఇంతే. ఈ గురువుగారి మాటల్లో "నాయనా! శంకరానుగ్రహం నాకన్న నీయందే ఎక్కువగా కనబడుతున్నది. ఈ భాష్యం నీవే చదువుకో! సంప్రదాయ విశేషాలు కావాలంటే నేను నీకు గురు చేసాను" అని ...

మొత్తం మీద కావ్యశాస్త్ర పఠనం మొత్తం 11 మాసాలు మాత్రమే. మూడు కావ్యాలు అఱు శాస్త్రాలుగా సాగిన యీ చదువు వారిని అసమాన విద్వాంసునిగా చేసింది.

చెఱువులో పూడిక తీస్తే నీళ్ళు అచ్చటనే ఊరివస్తాయి. మబ్బులు తొలగిపోతే సూర్యుడు కిరణాలు వెదజల్లుతాడు. పూర్వజన్మప్రారబ్ధం 22 ఏండ్లు అడ్డుపడింది. ఆ అంధకారాన్ని గురువు తొలగించాడు. ఇక కాంతులీనే ఆ బుద్ధిశక్తి ముందఱ ఏ శాస్త్రం నిలుస్తుంది? అన్ని దాసోహం అన్నవి. ఆగమాలు ఆమ్నాయాలు అన్నీ స్వయంగా వారిని స్వీకరించినాయి.

బ్రహ్మశ్రీ ముళ్ళపూడి నారాయణశాస్త్రిగారు, ప్రతాప హనుమచ్ఛాస్త్రిగారు వంటి పండిత దిగ్గజాలను తయారుచేసిన ప్రజ్ఞాశక్తి ఆ 11 నెలల్లో తయారయినదే.

ఇక కవితాశక్తి గూర్చి చెప్పాలంటే, అదీ స్వయంగా ఆవిర్భవించిందే. అయితే తురగా వెంకటరాజు గారితో కలిసి చేసిన కవితా పరిశ్రమవలన తన కవిత్వము బాగా మెఱుగయినట్లు సాక్షాత్తు శ్రీ వేంకటప్పయ్యశాస్త్రిగారే సెలవిచ్చారు. దీంతో అలవడినదే తెలుగుభాషా పరిజ్ఞానము. అది ఒక అనంత వాహిని. దానిలో ఎన్నో గ్రంథాలు వచ్చినాయి. నిజానికి సంస్కృత కవితకన్న తెలుగు కవిత్వమే వీరు ఎక్కువగా రచించారు. ఈ తెలుగు పాండిత్యానికి ప్రఖ్యాత శిష్యులయినవారిలో తెనుగులెంక శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారొకరు.

గురుస్మృతి సంచికలో చౌదరిగారే వ్రాసిన పద్యం ఇందుకు సాక్ష్యము.

> **అర్ధమరేయిదాక పొలమారసి క్రోసులు రెండు దూసి, యే**
> **నొద్దిక నొద్దకుంజన, గురూత్తముడీ కరుణాసరిద్విభుం।**
> **దద్దిర! నిద్దురన్ వదలి యయ్యయి పాఠములుగ్గడించె నీ**
> **పెద్దతనంబు సొంపు కనిపింపద లాతులయందొకింతయున్॥**

ఉండవి. పగటిపూట చదువు సాగదు. అందువలన రాత్రికి ... కాలం పనులు ము... విద్యాశిబిచక్రవర్తి శ్రీ వెంకటప్పయ్యశాస్త్రిగారు అప్పుడే లేచి శ్రీ చౌదరిగా... చదువు చెప్పేవారట!

కేవలము పాండిత్యము, కవిత్వమే కాక, వారిది విద్యాతప... విద్యాతపస్సే కాదు శ్రీ విద్యాతపస్సు కూడా అందులోనే మిళి... చెట్టపట్టాలు వేసుకొని నడిచే ఈ తపస్సులను వారి శిష్యవరేణ్యుడు శ్రీ ముళ్ళపూడి నారాయణశాస్త్రిగారు చక్కగా శ్లోకబద్ధం చేశారు.

"త్రీణ్యేవ యస్య ధన్యస్య కవితాధ్యాపనం తపః
కాలయాపనసూత్రాణి గురవేఽస్మై కృతాంజలిః॥"

అర్థం ఏమంటే, తమ గురువుగారికి 'కవిత్వము, అధ్యాపన, తపస్సు' ఇవే కాలక్షేప సాధనాలు అట! దీంతోబాటు ఇంకొక తప... కూడా చెప్పాల్సింది ఉంది. అది **"అన్నదానము"**. శిష్యులకు ఉచితంగా అన్నవస్త్రాలను ఇచ్చి అవసరమయినచో ఉపనయన వివాహాలను కూ... చేయించేవారట. దీంతోపాటు మరొక తపస్సు కూడా ఉన్నది. అదే పుస్త... **దానము**. తాము రచించిన పుస్తకాలను అచ్చు వేయించి ఉచితంగా పంచటం.

అయితే వీరు మహాధనవంతులుగాబోలు అని పాఠకు... భ్రమపడవచ్చును. అంతటి ధనవంతులు కారు. బ్రాహ్మణునకు శా... ప్రకారము యజన యాజన అధ్యయన అధ్యాపన దాన ప్రతిగ్రహము... అనే ఆరు కర్మలకు అధికారం ఉన్నది. అందులో ప్రతిగ్రహం ఒకటి. అ... "చందా". అందువలన "సొంతపొలము" – మెచ్చియిచ్చిన వారి నుం... వచ్చే చందాలు–" వీటితో విద్యాదానం, అన్నదానం, పుస్తకదానం, కవిత... ఇవన్నీ జరుగుతుండేవి. ఇదంతా ఒక తపస్య. ఒక వరివస్య. ఋషు...

ఆదర్శం. మునుల జీవనం. కృతయుగధర్మానికి కలియుగ ప్రయోగశాల వారి జీవితం, వారి ఆశ్రమం.

అన్నదానము కేవలం ఒక ధర్మకార్యం మాత్రమే కాదు. ఒక తపస్సు, ఒక ఆధ్యాత్మిక సాధన. రమణ మహర్షి ఆశ్రమంలోనూ అన్నదానం విరివిగా సాగేది. జిల్లెళ్ళమూడి అమ్మగారి మాతృత్వ తపస్సే అన్నదానము. ఇది ఎంతటి తపస్సో తైత్తిరీయోపనిషత్తులో స్పష్టంగా ఉన్నది.

అన్నం పరబ్రహ్మ స్వరూపము. భోక్త గూడ బ్రహ్మ స్వరూపుడే. ఇదంతయు ఆత్మ స్వరూపమే.

"అన్నం బ్రహ్మేతి వ్యజానాత్ అహమన్నం అహమన్నం అన్నాదోహ మన్నాదః అన్నాత్పురుషః స వా ఏష పురుషోఽన్నరసమయః"

ఈ విధమయిన అన్న సంతర్పణ ఒక బ్రహ్మసత్రమని తైత్తిరీయం చెప్తున్నది.

"అన్నమన్నే ప్రతిష్ఠితం ప్రాణో వా అన్నం।
స య ఏతదన్న మన్నే ప్రతిష్ఠితం వేద ప్రతితిష్ఠతి॥

అంటే బ్రహ్మస్వరూపమయిన అన్నము బ్రహ్మస్వరూపమయిన అన్నాదునిలో ఐక్యం చెందటం అంటే జీవాత్మ పరమాత్మలో ఐక్యం చెందటమే. అదే సత్యం కనుక ఇలా భావించి గ్రహించి ఆచరించేవారికి ప్రతిష్ఠ అనగా 'సత్యత్వం' కలుగుతుందని తైత్తిరీయ సూక్తి. అయితే "వేద" అన్నది ఉపనిషత్తు. తెలిసి భావించి ఆచరించాలి. అట్లా జ్ఞానంతో వీరు చేసే అన్న సంతర్పణ విద్యాసంతర్పణ కవితా సంతర్పణ ఆధ్యాత్మిక వరివస్యలు రాజయోగ సాధనలే అనటంలో సందేహం లేదు.

ఈ తపస్సులకు శాశ్వత కుటీరం ఒకటి కావలసి వచ్చింది. చందోలు ఊరిబయట స్థలం కొని అందులో ఒక దాబా వేశారు. దీని పేరే **"శంకర విద్యాశాల"**. ఆ ప్రాంతం విద్యానగరంగా మారింది. 40 మంది శిష్యులు నిరంతరం ఉండేవారు. వీరుగాక అతిథులు అభ్యాగతులు గూడా. "స కంచన వసతౌ ప్రత్యాచక్షీత" అని గదా తైత్తిరీయ సూక్తి.

బ్రాహ్మీ ముహూర్తంలో విద్యార్థుల అధ్యయన ఘోష పరిసరాలకు "సుప్రభాతమే". రాత్రిపూట జోలపాట గూడా అదే. వెంకటప్పయ్యశాస్త్రిగారి సంకల్పబలమో, హస్తవాసి లేదా చేతిచలవోగాని ప్రస్తుతం ఇంతటి కష్ట రోజుల్లో గూడా, వారి పౌత్రులు **శ్రీ తాడేపల్లి లక్ష్మీధరసోమయాజులుగారు** గూడా సుమారు 50 మంది పిల్లలకు **వేదపాఠశాల** నడుపుతున్నారు. అన్నవస్త్రాలు పూర్తిగా ఉచితము. వసతి గూడా అంతే. సొంతధాన్యంతో చందాలతో తమ పెద్దల అడుగుజాడలలో నడుస్తున్నారు, నడుపుతున్నారు.

ఇక వెంకటప్పయ్యశాస్త్రిగారి ఆధ్యాత్మిక శక్తిని గూర్చి ముచ్చటిస్తే గాని వారి పుత్రులయిన శ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రులవారి తత్త్వము విశదం కాదు. వ్యాసుని గూర్చి తెలిస్తేనే శుకుని స్థితి సరిగా అర్థమవుతుంది. వెంకటప్పయ్యశాస్త్రిగారి పాండిత్యమెంత ఉన్నతమో వారి ధార్మికత్వము అంత విశాలము. ఈ రెంటితో తులతూగేది వారి 'ఆధ్యాత్మిక శక్తి'. ఆలంకారికులు ఒప్పుకుంటే ఈ మూడింటి మధ్య 'ఉపమేయోపమాలంకారం' ఉన్నదని చెప్పవచ్చు. శిష్యులకు వీరు శివస్వరూపమే. వీరు శివశక్తి పూజాధురంధరులు. "పాణిలింగార్చన" గూడా చేసేవారు. ఆకారము ప్రత్యక్ష మహేశ్వరులే. వీరి శిష్యులు చల్లా పిచ్చయ్యశాస్త్రిగారు వీరి నిర్యాణ సమయంలో వ్రాసిన పద్యంలో

మొగమున బ్రహ్మవర్చస మమోఘము ఫాలతలస్థ కుంకుమ
ద్విగుణితమై యెసంగ గళదేశమునందు శివాక్షమాల పే
ర్మిగనిగలీన శంకరుని లీల చరించుచు దేశ ముద్ధరిం
చు గురువరా! మముం దమము సోకున వైచి చనంగ బాడియే!

అని, తమ గురువును శంకరావతారంగా దర్శించారు. ఋషిత్వం కవిత్వం రెండునూ కలగలసిన మహాత్ములు వీరు. **"నానృషిః కురుతే కావ్యం"**

అని కదా! ఈ ఋషి కవులకు ఏబాధ వచ్చినను – మనుష్యులకు కాదు – దేవతలకే మనవి చేసికొంటారు. అదీ కవిత్వంలోనే. అట్లా వ్రాసినవే **బాలకోటీశ్వరశతకం, హేమదుర్గాంబికా శతకము** మొదలైనవి. తమ బాధలన్నియు శివశక్తులకే మనవి చేసికొన్నారు. వారే తీర్చారు గూడా! దేవి నాదమయి. కావ్యకళ. పదస్వరూప. రసజ్ఞ భగవంతుని 'కవీనాం కవి' గా చేసినదామె. ప్రపంచ కావ్యం ఆమె. కావ్యనాయకునిగా కామేశ్వరుని చేసిందామె. అందువలన తన రసజ్ఞతో అనగా నాలుకతో నాదముతో పదములతో కవితతో ఆమెను ఆరాధించటం ఈ విధాన రహస్యం. "స్త్రోత్రాదీ సర్వా గిరః" కదా! వీరు మాటలను స్తోత్రాలుగా చేసి మరీ ఆ జగన్మాతను అర్చిస్తారు.

వీరి మహిమలు:-

వీరి వద్ద చదివినవారు ఎవరయినా సరే, వీరివలనే చాల తక్కువ సమయంలో మహా విద్వాంసులయ్యేవారు. శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారే ఉదాహరణ. ఆయన వీరి వద్ద చదివిన సమయం చాల తక్కువ. ఉపదేశ ప్రభావం అది. శ్రీ చౌదరిగారే "ఆత్మకథ" లో గురుస్తుతి చేస్తూ,

"ఏకశ్లోకరహస్య బోధనముచే నెవ్వారు శిష్యున్ సుధీ
లోకాగ్రేసరు జేయు నవ్విబుధు గొల్తున్ వేంకటప్పార్యు, స
త్ప్రోక్త శ్లోక మయూఖరాజవిలసితున్ రామగాథామృతా
ఖ్యాక గ్రంథ మతల్లికాజనకు మద్వైద్యాణ భాషాగురున్॥" అన్నారు.

ఒక సందర్భంలో చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు (తిరుపతి వెంకట కవులు) "నా వాకిట్లో ఎవడయినా ఆరు నెలలుంటే చాలు నేను చదువు చెప్పకపోయినా – వానికి కవిత్వం వస్తుంది" అన్నారు. అప్పుడు వెంకటప్పయ్యశాస్త్రిగారు "నేను ఒక్కసారి విద్యార్థి వంక తేరిపార చూస్తేచాలు కవిత్వము పొంగి వస్తుంది" అన్నారుట. మరీ పైన చెప్పిన "చౌదరిగారి" అనుభవం అదే గదా! ఒక్క శ్లోకాన్ని వివరించి చెప్పితేనే చాలు విన్నవాడికి

మహాపాండిత్యం వస్తుందన్న మాట నిజమే కదా! అసలు ఛందోలులో చదివిన వారంతా అంతో యింతో కవులే. ప్రతిక్రొత్త విద్యార్థి 'ఛందోల' లో నవరాత్రులలో విజయదశమినాడు కవిత్వము చెప్పి తీరాలని నియమం ఉంది. అందువలననే నేను గూడా కాలక్రమంలో కవిత్వం వ్రాయటం జరిగింది. ఆనాటి విత్తనము ఇప్పటికిన్ని రెమ్మలు వేస్తున్నది. అదంతా ఆ మహర్షి సంకల్పశక్తి.

వీరికి కడుపులో 'శూల' రోగం ఉండేది. పరిణామశూల. తెల్లవారుజామున శూలతో "అమ్మా! అమ్మా!" అని మూలుగుతున్నారు. అంతలో ఒక స్వరం వినబడింది. "ఏ అమ్మను పిలుస్తున్నావు?" అని. "నిన్నేనమ్మా! అని వీరి సమాధానము. "మఱి తగ్గించమంటావా?" అని అమ్మ ప్రశ్న. "లేదమ్మా! ప్రారబ్ధం అనుభవించి మోక్షమే పొందాలని నా సంకల్పం – అని వీరి సమాధానము. అంతటితో సంభాషణ ముగిసింది. ఈ విషయం వ్రాస్తూ శ్రీ గురుచరితంలో రచయిత

"అంబేతి శూలపరిపీడిత కుక్షిదేశః
ఆర్తః స్మరన్నపి పరాం జనకశ్చ తస్య!
శ్రుత్వాంబికా వచన మీప్సితదాన సిద్ధం
శూలిత్వమేవ వరరాజతయా స వవ్రే॥"

అని చమత్కరించారు. శూలి అంటే శూల గలవాడు అని ఒక అర్థం. శూలం గలవాడు= శివుడు అని మఱొక అర్థం. 'శూలి' గా ఉన్న వెంకటప్పయ్యశాస్త్రిగారు "శూలి" గానే ఉండటాన్ని వరంగా కోరారు. అంటే శూలను అనుభవించి శివసాయుజ్యము పొందాలని కోరారని చమత్కారము. బృహదారణ్యకంలో ఒక మంత్రము ఉన్నది.

"ఏతదేవ పరమం తపో యత్ వ్యాహిత స్తప్యతి"

వ్యాధితో ఉండి తపస్సు చేయటమే గొప్ప తపస్సు. అటువంటి తపస్సు ఇది. 'అమ్మా!' అనే పిలుపు ఆ తపస్సుకు ఆధారమయిన "మంత్రం"

అనాలి. అంతేతప్ప అది మూలుగు కాదు. వ్యాధ్యాత్మికతతో ఆధ్యాత్మికతను పెనవేసిన సందర్భం ఇది.

దేవతలు స్వయంగా పలకరించే ఉపాసనాబలం, వరం ఇస్తామన్నా వద్దనే వైరాగ్యం ప్రారబ్ధఫలం అనుభవిస్తూ చేసే తపస్సు, వాక్కుతో పరాశక్తినే కీర్తించే అగ్నిష్టోమ కర్మ – ఇవి వీరి గుణాలు మహిమలు – "కోన్వస్మిన్ సాంప్రతం లోకే?"

వీరి యింట ఒకసారి దేవీనవరాత్ర పూజలు జరుగుతున్నవి. రాత్రి పూజలు భోజనాలు అయిన తర్వాత అందరు అదమఱచి ఆరుబయట నిద్రపోతున్నారు. అతిథులు అభ్యాగతులు, భక్తులు శిష్యులు స్త్రీ పురుషులు – ఒక ప్రక్క పూజాసామగ్రి సంభారాలు కొల్లగా ఉన్నాయి. ఈ స్థలం మీద దొంగల కన్నుబడింది. అర్ధరాత్రి వచ్చారు. కాని లోపలికిరావటం వారి వల్ల కాలేదు. ఎటు ప్రయత్నించినా ఒక "కాలసర్పం" పడగెత్తి బుస్సుమంటున్నది. వారికి ధైర్యం చాలలేదు కాని ఆశ చావలేదు. మాటిమాటికి దడిదాటే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అంతే! ఒక్కసారిగా సరిహద్దు వెంబడి ఆమూలనుంచి యీ మూలకు ఒక పెద్ద మెఱుపు మెఱిసింది. ఆ మెఱుపులో ఒక స్త్రీమూర్తి ప్రత్యక్షమయింది. ఒక చేతిలో కత్తి. మఱొక చేతిలో బరిశ ఉన్నవి. వాళ్ళ కళ్ళు చెదరినాయి. గుండెలు జారినవి. భయపడి పారిపోయారు. మఱునాడు శాస్త్రిగారి వద్దకు వచ్చి తమ పొరపాటు గ్రహపాటు అంతా చెప్పుకొని "అభయం" తీసికొని వెళ్ళారు. ఈ విషయం వ్రాస్తూ శ్రీగురుచరితంలో రచయిత,

"గురుకృతనవరాత్రోత్సవ సందర్శకభక్తరక్షితే యత్ర
కాలీ కరవాలకరా యామిక మూర్తిః మలిమ్లుచాన్ జఘ్నే॥" అని

"కాళికాదేవి వారింటికి కావలి పిల్ల" అని చమత్కరించాడు.

తమాషా ఏమిటంటే భగవంతుడు భక్తుల కన్న ముందుగా వారిని

బాధించే వారికే కనబడతాడు. త్యాగరాజస్వామివారిని దోచుకొనటానికి వచ్చిన దొంగలకు రామలక్ష్మణులు కనబడ్డారు. "అలకలల్లల్లాడ – " అని గానం చేసిన త్యాగరాజుకు కనబడలేదు. అలాగే రామదాసుని బంధించిన 'తానీషా' కు 'రామోజీ, లక్ష్మోజీ' దర్శనం అయినది. అలాగే ఇక్కడ దొంగలకు కాళీదర్శనం అయింది. అందుకే భవభూతి **"సత్సంగతాని నిధనాన్యపి తారయంతి"** అంటాడు. అలానే "భారవి".

"సమున్నయన్ భూతి మనార్య సంగమాత్
వరం విరోధోఽ పి సమం మహాత్మభిః॥" అన్నాడు. అంటే దురాత్ములతో స్నేహం కన్నా మహాత్ములతో విరోధమయినా సరే! ప్రయోజనదాయకం అని.

గుంటూరు వద్ద 'కాకాని' లో మల్లికార్జునస్వామివారి దేవాలయం అప్పట్లో కళా విహీనంగా ఉండేది. సత్రం గూడా అదే స్థితిలో ఉండేది. ఆ దేవాలయ ధర్మకర్తలు శ్రీ కొల్లిపర రామకోటయ్యగారు, కవితా సుబ్రహ్మణ్యం గారు శ్రీ వెంకటప్పయ్యశాస్త్రిగారి వద్దకు వచ్చి దేవాలయ పరిస్థితికి పరిష్కారం కోరారు. వీరు అచ్చట కొంతకాలం భ్రమరాంబా మల్లీశ్వరుల సమక్షంలో నివసించి మంత్రపురశ్చరణ చేసి ఆ తపస్సును ధారాదత్తం చేశారు. నాటి నుంచి ఆ దేవాలయం 'సిరి' అందుకొన్నది. ఆ సందర్భముగా వీరు 'శ్రీ కాకాని మల్లీశ్వర మాహాత్మ్యము' అనే తెలుగు ప్రబంధం రచించి ఆ స్వామికే అంకితమిచ్చారు. ఆ కావ్యానికి ఈ కవిబ్రహ్మర్షికి ఆ రోజు "పల్లకీ"లో ఊరేగింపు జరిగింది.

ఇలా చెప్పుకుంటూపోతే చాలా సంఘటనలు వస్తాయి. మా గురువుగారు తమ పాఠప్రవచనాల్లో, సమావేశాల్లో తమ తండ్రిగారి చరిత్ర ఘట్టాలను చాలా భక్తిభావంతో తన్మయులైపోతూ చెప్తుండేవారు. గుర్తున్న మేఱకు ఈ విషయాలు ముచ్చటించటం జరిగింది.

ఈ పితాపుత్రకవుల జీవితంలో చివరిది, ముఖ్యంగా చెప్పుకోదగినది "శ్రీరామ కథామృతము". ఇది తెలుగులో విస్తృతమయిన రామాయణానువాదము. దీని తరువాత వచ్చింది 'విశ్వనాథ' వారి రామాయణ కల్పవృక్షము. నన్నయ తిక్కనల కవితావేశము తనలో కలిగించదంటాడు 'విశ్వనాథ'. కాని శ్రీరామకథామృతములో శ్రీ వెంకటప్పయ్యశాస్త్రిగారిని 'పోతన, వాల్మీకి' ఆవేశించారని చెప్పవచ్చు. దీని ఉత్తరకాండలో కొంత పూరించినవారు వీరి తనయులు శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రిగారిని ఆ సమయంలో శ్రీ వెంకటప్పయ్య శాస్త్రిగారే ఆవేశించియుంటారేమో! మఱి యీ కవిత్వంలో 'ఋషిత్వం' ప్రస్ఫుటం అవుతుంది.

వాల్మీకి రామాయణం 24 వేల శ్లోకాలు. ప్రతి వేయి శ్లోకాలకు గాయత్రీ మంత్రాక్షర సంపుటితో ప్రారంభము. అదే పద్ధతిలో శ్రీరామకథామృతం 24 వేల గద్యపద్యాలతో నిండుగా అవతరించింది. వాల్మీకాన్ని వామనావతారంతో పోలిస్తే దీన్ని త్రివిక్రమ స్వరూపంతో పోల్చ వలసి ఉంటుంది. ఏమంటే,

రామాయణంలో "32" అక్షరాల అనుష్టుప్ శ్లోకాలు ఎక్కువ. "శ్రీరామకథామృతం" లో గద్యములు సీసం వంటి పెద్ద పద్యాలు కలిపి చూస్తే అసలు రామాయణానికి ఎన్నిరెట్లో పెరిగిపోయింది. ఈ విషయంలో పోతనగారి భాగవతం దీనికి పోలిక. అంతేగాక, రామతాపిని, అధ్యాత్మరామాయణం మొదలగు ఇతర రామగ్రంథాల సారాంశాలు ఇందులో కలిసినవి. పైగా శివుడు పార్వతికి చెప్పినట్లుగా ఈ రామాయణం వ్రాశారు. రామాయణం పూర్తి అయ్యేసరికి సంబోధనరూపంలో గౌరీ సహస్రనామాలే అవతరించినవి. ఈ రామకథామృతంలో దేవతామాలికావర్ణన చేసిన సీసపద్యం (2 వది) ఒక మాలామంత్రం వంటిదని శ్రీ అద్దేపల్లి సోమనాథశాస్త్రులవారు (వెంకటప్పయ్యశాస్త్రిగారి గురువుగారు) అన్నట్లు మా గురువుగారు నాతో స్వయంగా చెప్పారు. నేను వేసవి శెలవులలో వారివద్ద

తెలుగుభాషా పుష్టి కోసం శ్రీరామకథామృతంలో బాలకాండను పారంగా చదివాను. ఆ సందర్భంలో పై ప్రస్తావన జరిగింది.

ఈ గ్రంథాన్ని శ్రీ వెంకటప్పయ్యశాస్త్రిగారు 1920 ప్రాంతంలో ప్రారంభించారు. ఉత్తరకాండలో కొన్ని పద్యాలు శేషించినవి. వారు వ్యాధిగ్రస్తులై కైలాస వాసులయినారు. తరువాత పద్యాలను మా గురువులు శ్రీ రాఘవ నారాయణశాస్త్రులవారు పూరించి ప్రచురించారు. ఈ గ్రంథం మీద శ్రీ తూములూరి దక్షిణామూర్తిశాస్త్రి పరిశోధన చేసి డాక్టరేట్‌ను స్వీకరించారు.

"జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః"

- - -

"పితాపుత్ర కవీశ్వరులు"

చందోలు మహర్షులు-2

బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రులవారు

* * *

ఈ తరంలో ఇంకా జీవించియున్న మావంటి వారికి గురుదేవులు, స్ఫూర్తిప్రదాతలు, ఆర్తిహరులు, కీర్తిమంతులు కీర్తిశేషులు అయిన బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవ నారాయణశాస్త్రుల వారు శ్రీ వెంకటప్పయ్యశాస్త్రులవారికి ప్రథమ పుత్రులు పుత్ర ప్రథములు.

"పుత్రం భజస్వాత్మగుణానురూపం" అన్నట్లు వెంకటప్పయ్య శాస్త్రుల వారు తమ వరాల పంటగా కన్న పుత్రరత్నమే వీరు. తండ్రికి తగ్గవారు. తండ్రిని మించినవారు. తండ్రిని మెచ్చినవారు. తండ్రికి నచ్చినవారు. తండ్రిని అనుసరించినవారు. తండ్రి అనుసరించినవారు. తండ్రిగారి ముని జీవితాన్ని ఆర్షకావ్యాన్ని పూరించినవారు. చందాదారులకిచ్చిన 'పితృ వాక్యాలను, పరిపాలించిన అభినవ రాఘవులు. అసలు నారాయణులు వెరసి రాఘవ నారాయణులు. మానవీయమయిన రాఘవతత్త్వం అమానవీయమయిన నారాయణతత్త్వం రెండునూ మూర్తీభవించి క్రీభవించినదే మా యీ "గురుతత్త్వము".

సకలాగమామ్నాయ శరధియైన శిరస్సు-అఖిలసద్గుణధామమౌ మనస్సు
బ్రాహ్మణత్వమునకే భాష్యమౌ వర్చస్సు-వేదధామంబైన "ధీ, సహస్సు"
బాలాంబ నళచేతి పందు చేయు తపస్సు-శిష్యధ్యజమ్మైన శ్రీయశస్సు
ఆర్ష వాఙ్మయసారమైన దివ్యవచస్సు-అఖిలహితప్రియంబౌ వయస్సు

...కారణంబు
"చందవోల్గురు మహస్సు"
అరసి నన్ను భరించు దయాసరస్సు-దానికిత్తు మనస్సుతో "నా, నమస్సు"
- భావనా బృందావనము

అటు ఋషిత్వం ఇటు కవిత్వం, అటు పాండిత్య శౌర్యం ఇటు తపోధైర్యం, జీవిత గాంభీర్యం, వ్యవహార శౌండీర్యం కలబోసిన విగ్రహం మా కందతికి విగ్రహము తాల్చిన పరదేవతానుగ్రహము.

వారి యౌవనదశ నాకు పరిచయము లేదు. 60 ఏండ్ల వయస్సులో శాంతాగ్నివలె ఉన్న వారి వద్దకు చదువుకు చేరిన వాడిని నేను. స్వయం తెలిసింది చాలా తక్కువ. అయినా

"విబుధజనుల వలన విన్నంత కన్నంత
తెలియవచ్చినంత తేటపఱతు"

మౌనముద్రాపూరితమయిన అఖండ సంకల్పశక్తితో నిరంతర ని... అయిన ఆ పరాశక్తి సకలచరాచర సృష్టినే కాదు అందులోని అణువు సైతము ఎంత సున్నితంగా నిశితంగా అవలీలగా సలీలగా నడుపుతుందో ఈ కథచూస్తే స్పష్టమవుతుంది.

"ఆబాలగోపవిదితా సర్వానుల్లంఘ్యశాసనా" కదా! గురువుగారి జీవిత శిల్పాన్ని తెఱచాటు నుండి మలచిన ఆ సూత్రధారి ఆ ప్రపంచస్థపతి యొక్క శిల్ప కళాకణికలను మనం వీరి చరిత్ర నుంచి సంగ్రహింపవచ్చును. ప్రత్యక్ష పరోక్ష పద్ధతులలో ఆ అపరోక్ష బ్రహ్మ విద్య తన పుత్రశిఖామణిని ఉలిపోట్లతో నులిపాట్లతో మెఱుగులుదిద్ది పరబ్రహ్మాంక సీమకు చేర్చిన వైనం ఇందులో గమనించవచ్చు. ఆ "పరోక్ష ఉలి" ని గమనిస్తూ ఈ కథలో దిగితే "ప్రపంచాన్ని నడిపించేశక్తి" తీఱు తెన్నులు మన మనస్సుతో దాగుడుమూతలాడుతుంటవి. ఇక కథలోనికి వెళ్దాం.

వీరు లోకదృష్ట్యా అందఱు చదివే ఇంగ్లీషు చదువుల్లోకి పోలేదు. అనేకమంది పండితులను తయారుచేసి దేశానికి సారస్వత మణిహారాన్ని అందించిన తన తండ్రివద్దనే వారు సంస్కృత విద్యను అభ్యసించారు. అదే తన అభీష్టం అని తండ్రినే ఒప్పించారు. తద్వారా తండ్రికి ధైర్యం కల్పించారు. నాటి నుంచి సాహిత్య పఠనం ప్రారంభ మయింది. ఒక తపస్విలాగా విద్యాభ్యాసం చేశారు. వేషం గూడా అంతే! మెడలో రుద్రాక్ష మాలికలు నుదుట భస్మత్రిపుండ్ర రేఖలు, అగ్నికార్యం. ఇంతా చేసి వయస్సు సుమారు 10 ఏండ్లు. అపరమహేశ్వరులు, బాలసుబ్రహ్మణ్య స్వరూపులు, నాగ హారాలే తక్కువ. లోకం దృష్టిలో ఒక బాల బైరాగి, ఒక బాడిద బుస్సన్న.

అదృష్టమయినా దురదృష్టమయినా మనను వెదక్కుంటూ వస్తుంది. వీరికి ఓనమాలు చెప్పిన మాచిరాజు దండయ్య పంతులుగారి అల్లుడు గొప్పమంత్రవేత్త. ఈయన పేరు "కేదారలింగం" గారు. తాడికొండ నివాసి అయిన గొప్ప ఉపాసకుడు. ఈయన వెంకటప్పయ్య శాస్త్రిగారి అనుమతి తీసికొని (మా) గురువుగారికి "బాలామంత్రోపదేశం" చేశారు. 12వ ఏట మొదలైన ఈ మంత్ర పురశ్చరణ 16వ సంవత్సరందాకా పూర్ణబ్రహ్మచర్యవ్రతముతో సాగింది. బాలాంబిక వారికి "వాత్సల్య వర్షిణి" అయింది.

బ్రహ్మచర్యవ్రతం అంటే కేవలం పెండ్లి చేసికోకపోవటం కాదు. అద్దము, దువ్వెన, తాంబూలము, జుట్టుదువ్వటం, అలంకారాలు - ఏవీ ఉండరాదు. స్నానం, జపం, అగ్నికార్యం, నేలపై పరుండటం, రాత్రి మాత్రమే నిద్ర - మొదలైన కఠిన దీక్షలు చేపట్టినపుడే "బ్రహ్మచర్యవ్రతం" అంటారు. ఈ దీక్ష ఆ తపస్సు - వీటి ఫలితంగా అమోఘమయిన వాక్‌శక్తి గూడా అబ్బింది. ఏమంటే అది జరిగేది. చల్లని నీళ్ళు 'వెచ్చగా ఉన్నవి' అంటే

వేడిగా తగిలేవి. వేడి నీటిని 'చల్లనివి' అంటే చల్లబడేవి. వాక్కు అగ్నిరూపమని వేదం చెపుతుంది. **'అగ్నిః వాక్ భూత్వా ముఖం ప్రావిశత్"** అంటే 'అగ్ని' వాగ్రూపాన్ని ధరించి పురుషుని ముఖంలో ప్రవేశించిందట. శక్తి అందువలన నేమో? వారి మాటకు నీళ్ళు చల్లబడటం, వెచ్చబడటం జరిగింది.

పురశ్చరణశక్తితో ఉపాస్యదేవత అయిన బాలాత్రిపురసుందరిని తన "చిన్నమ్మ" గా చేసికొన్నారు. దేనికయినా **"ఆమే గతి"** అన్న ప్రపత్తి ఏర్పడింది. రోగం వచ్చినా మందులు వాడే పనిలేదు. ఆదాయం కోసం ఎవరినీ ప్రాధేయపడే పనిలేదు. అసలు పెళ్లే అక్కరలేదనే ఆధ్యాత్మిక తీవ్రత వచ్చింది. తపస్సుతో జీవితపరమార్థం సాధించాలనే తపన పెరిగింది. దీనినే "శుభేచ్ఛ" అంటారు.

"జ్ఞానభూమిః శుభేచ్ఛాఖ్యా ప్రథమా సముదాహృతా" అని మహోపనిషత్తు.

శుభేచ్ఛ అనేది జ్ఞాన భూమిక. దీనికి నిర్వచనం గూడా మహోపనిషత్తే చెప్పింది.

"వైరాగ్య పూర్వ మిచ్ఛేతి శుభేచ్ఛేత్యుచ్యతే జనైః" ఈ శుభేచ్ఛ శ్రీ చక్రేశ్వరికి నచ్చలేదు. ఆమె శుభేచ్ఛ వేరుగా ఉన్నది. ఈ భక్తబాలుడిని గృహస్థుగా చూడదలచింది. ఆమె కాదంటే, ఆమెను కాదంటే, మోక్షం లభించదు గదా!

"యేన మార్గేణ గంతవ్యం బ్రహ్మస్థానం నిరామయం,
ముఖేనాచ్ఛాద్య తద్వారం ప్రసుప్తా పరమేశ్వరీ"

– ధ్యానబిందూపనిషత్తు

'మోక్షద్వారము తల్పాదీయగదె రాముండా! జగజ్జననీ!' అని ముఖుగా పాప యారాధ్యులవారు దేవీభాగవత ప్రారంభంలో దేవిని కోరటానికి కూడా కారణం ఇదే.

ఒకరాత్రి వీరికి బాలాంబిక కలలో కనబడింది. ఒక 'పటం' చూపించింది. 'ఏదీ ఇటు తే" అని అడిగారు గురువుగారు. "నీకివ్వటానికే తెచ్చాను" అని దేవి ఆ పటాన్ని వారికి ఇచ్చింది. 'ఇవ్వటానికే' అంటే అదొక శ్లేష చమత్కారం. 'పటం' ఇవ్వటానికి? పిల్లను ఇవ్వటానికి? రెండు అర్థాలు సరిపోతాయి. సరిపోయినాయి గూడా! 'పటం' ఇస్తూ ఆమె అన్నది "అబ్బాయీ ఈ ప్రత్యక్ష సన్యాసం వద్దు. నీకు మహైశ్వర్యం ఇస్తాను. పెళ్ళి చేసికో! **త్యాగం అభ్యసించు**" అని చెప్పింది.

దేవి ఇచ్చిన ఉపదేశం ప్రసాదించిన అభయం **"యోగక్షేమం వహామ్యహం"** అన్న గీతావాక్యసారం గదా! పటం చేతికి తీసికొన్నారు. ఆ పటంలో ఒక కన్య ఫొటో కనబడింది. చిత్రమేమంటే ఆ కన్యయే తరువాత వారికి 'అర్ధాంగి' అయింది. పెళ్ళినాడు "తెఱసెల్లా" తొలగించిన తరువాత భార్యను తొలిసారి చూచినపుడు అచ్చంగా ఈ ఫొటోలో ముఖమే ఆ కన్య ముఖం. జగన్మాత అనుగ్రహం అర్థమయింది. ఆమె తనకు స్వప్నంలో "పెళ్ళిచూపులు" ఏర్పాటు చేసింది. ఈ వధూవరులను కుదిర్చిన పెళ్ళిళ్ల పేరమ్మ ఎవరు? వారి చిన్నమ్మ. చిన్నమ్మ ఎవరు? ఇంకెవరు? బాలాత్రిపురసుందరి.

ఇదే గాదు. వా జీవితంలో "బాలాంబిక" అనేకసార్లు అనుగ్రహ వర్షాలు కురిసింది. వారి మాటలలో చెప్పాలంటే "పూర్వజన్మ సంబంధమో, ఇప్పటి గురుదేవుల అనుగ్రహమో, ఆ తల్లి మాత్రము ఈ జన్మమున సుఖదుఃఖముల యందెల్లపుడు పిలిచిన పలుకుచున్నట్లు నా అనుభవము" అని. (– శ్రీరామకథామృత కవికుమార జీవిత – పీఠిక నుండి.)

బాలాత్రిపురసుందరి బ్రహ్మాండ పురాణం ప్రకారం శ్రీ లలితాత్రిపురసుందరీదేవి కూతురుగా తెలుస్తున్నది. మంత్రశాస్త్ర ప్రకారం పంచదశీ విద్యలోని కూటత్రయ సార రూపమయిన షడక్షర మంత్రరూపమే బాల. బీజత్రయా వృత్తి రూపమయిన బాలాదేవి ఒక ఆవృత్తిలో భోగప్రద, ప్రత్యావృత్తిలో మోక్షప్రద. వెఱసి ఈ షడక్షరమంత్రము భోగమోక్షప్రదమయిన త్రికూట సారము. అందువలన గురుపు గారు ఈమెను "చిన్నమ్మ" అని పిలుస్తారు. "బాల" అంటే "చిన్నమ్మ" అనే గదా అర్థం. మాచిరాజు శేషమ్మగారు అని ఒక పుణ్యస్త్రీ ఉంది. ఆమెను గురువుగారు పిన్నీ అని పిలుస్తారు. అందువలన బాలాంబిక అంటే "పిన్నమ్మ" కలలో కనబడేటపుడు మాచిరాజు శేషమ్మగారి రూపంలో కనబడేది. ఏ రూపమయినా ఆమెదే కదా! అయితే భౌతిక "పిన్ని" రూపంలో ఆధ్యాత్మిక "పిన్ని" కనబడుతున్నది.

ఇంతకుముందు మనం అనుకొన్నట్లు గురువుగారికి 'చిన్నమ్మ' పై నమ్మకం నిశ్చలం. ఒకసారి వారికి కాలికి దెబ్బతగిలింది. బాగా వాచింది. ఏదో పిండికట్టు కట్టుకోమని తండ్రిగారు స్నేహితులు చెప్పారు. వీరు వినలేదు. మనకు వచ్చిన కష్టాలు తీర్చ లేకపోతే దేవతలెందుకు? ఈ రాత్రికి ఈ బాధ తగ్గకపోతే "జందెం" తెంచేసి సన్యాసం పుచ్చుకొంటానన్నారు. మాటంటే మాటే. రేపు నిజంగా అంత పనీ చేస్తారు. ఆ సంగతి 'చిన్నమ్మ' కూ తెలుసు. ఆ రాత్రి 'చిన్నమ్మ' కలలో పిన్నిగారి రూపంలో కనబడి కాలికి కట్టు కట్టుతున్నది. "ఇదేమిటి? పిన్నీ నీ కెందుకీ శ్రమ? అని గురువుగారు అన్నారు." ఆమె అంది, నాయనా! ఏం చేస్తాను నీవు వైద్యం చేసికోనంటివి? సన్యాసం పుచ్చుకొంటానంటివి? మతి నాకు ఎలా తప్పుతుంది? అని. తరువాత మెలకువ వచ్చింది. ఆశ్చర్యం! కాలినొప్పి లేదు.

వీరి సన్యాసానికి మఱో ఎదురు దెబ్బ తగిలింది. ఒకరోజున తన తల్లి "హనుమాయమ్మ" గారి వద్దకు వెళ్ళి "నేను సన్యసిస్తాను. అనుమతి

ఇవ్వవలసినది" అని అడిగారు. ఆమె చాల దుఃఖపడింది. తండ్రిగారు వీరి సంకల్పాన్ని సరిగా అర్థం చేసికోలేదు. ఏదో ఆవేశం అనుకొన్నారు. తృణీకరించారు. కొంతకాలం గడచింది. ఒకరోజు తండ్రిగారు ఏదో పనిమీద ఊరిబయటకు వెళ్ళారు. అక్కడ తాటిబొందలు, పొదలనడుమ నిశ్చలంగా ధ్యానంలో కూర్చున్న యీ కుమారుడు కనిపించాడు. ఈ పొదలలో ఏమి చేస్తున్నాడా? అని ఆశ్చర్యపడ్డారు. దగ్గఱకు వెళ్లి చూశారు. కుమారుడు నిర్వికల్ప సమాధిలో ఉన్నాడు. పరిసరాల ధ్యాస లేదు. అపుడు అర్థమయింది. పుత్రుని కోరిక ఎంత నిజమయినదో, దానికెంత పునాది ఉన్నదో.

ఇక తరువాత రోజునుంచి ఆ తండ్రి ఆ కొడుకుకు గృహస్థాశ్రమం ఎంత అవసరమో శాస్త్రాల సాక్షిగా వేదాల సాక్షిగా గృహ్యసూత్రాల సాక్షిగా నూరిపోయటం మొదలు పెట్టారు. ఈ విధంగా వారి మనస్సును తండ్రిగారు గృహస్థాశ్రమం వైపు మళ్లించారు. స్వప్నంలో ఫొటో ఇచ్చి నీకివ్వటానికే తెచ్చాను. అని నర్మ గర్భంగా హెచ్చరించిన పరోక్ష ప్రియదేవత "చిన్నమ్మ" మాటకు తండ్రి ఉపదేశ పరంపర తోడయింది. దీనికి తోడు మా అందఱికి వారి దగ్గఱ చదువుకొనే 'అదృష్టం' గూడా ఒక చేయి వేసి ఉంటుంది. మొత్తం మీద పెళ్ళికి పూర్వరంగం సిద్ధమయింది. దీనికి మఱో సంఘటన గూడా తోడయింది.

శ్రీ వెంకటప్పయ్యశాస్త్రిగారికి తన కుమారుడు సామాన్య జీవుడు కాదని అర్థమయింది. ఈ కుమారుని వృత్తాంతం సాంతం తెలిసికోవాలని ఆశ కలిగింది. గుంటూరులో ఉన్న గోవిందరాజుల శ్యామలాంబ అనే దివ్యజ్ఞానయోగిని వద్దకు వెళ్ళి అడిగారు. ఆమె ధ్యానంలో గమనించింది. సూర్య బింబము నుంచి ఒక మహాపురుషుడు శ్రీ వెంకటప్పయ్యశాస్త్రిగారి నోటిలోకి ప్రవేశించినట్లు దర్శనం అయింది. దానినిబట్టి ఎవరో మహాపురుషుడు నీ పుత్రుడుగా జన్మించాడని ఆమె తేల్చి చెప్పింది.

వెంకటప్పయ్యశాస్త్రిగారు ఇంటికి వచ్చి యీ విషయం అందరికి చెప్పారు. అపుడు శ్రీరాఘవ నారాయణశాస్త్రిగార్కి తమ వృత్తాంతం తనే తెలిసికొనాలని తపన పుట్టింది. సాధనం వారి చేతిలోనే ఉంది గదా! అదే సవికల్పక సమాధి. స్వప్నతుల్యమయిన దివ్య దృష్టి సమాధి. ఒకనాటి రాత్రి శ్రీ శాస్త్రిగారు సమాధిలోకి వెళ్ళారు. అందులో "చిన్నమ్మ" దర్శనం అయింది. "నీవెవరో చెప్తాను. రారా..." అని చేయిపట్టికొని వారిని తీసికొని బయలుదేతినది. రెండు దివ్యశరీరాలు ఊర్ధ్వలోకాలకు బయలుదేరినాయి. గాలిలో తేలుతూ వెళ్తున్నాయి. అనేకలోకాలు నక్షత్రాల మధ్య "సినిమాల్లో నారదునిలాగా" వెళ్తున్న అనుభూతి కలుగుతున్నది. సమస్తలోకాలు 'సుషుమ్నానాడి' లో ఉంటాయని యోగశాస్త్రం. "సుషుమ్నాంతర్గతం విశ్వం తస్మిన్ సర్వం ప్రతిష్ఠితమ్" అని యోగశిఖోపనిషత్తు.

అలా వెళ్లి వెళ్లి ఆ శరీరాలు శ్రీ చక్రవ్యూహంలోనికి ప్రవేశించినాయి. దాన్లో మూడు ఆవరణలు దాటినవి. నాల్గవ ఆవరణం వచ్చింది. చిన్నమ్మ చెప్పింది "అబ్బాయి! నీ విక్కడి వాడవు" అని. ఆ ఆవరణలోనికి ప్రవేశించగనే తనరూపం మారినట్లు తెలిసింది. తానొక సిద్ధపురుషుడుగా తనకు తనే కనబడడం జరిగింది. స్వప్నంలో ఇలాంటి విచిత్రాలు సహజమే. స్వప్నంకన్న శక్తిమంతమయిన సమాధిలో కనబడితే ఆశ్చర్యం ఏముంది? అది మాయా విలాసము. ఇది మహామాయా విలాసం. శ్రీచక్ర చతుర్థావరణంలో సభ్యుడయిన ఈ మహా పురుషుని గురించి శ్రీగురుచరిత కవి వ్రాసిన యీ శ్లోకం ఆ గురుతత్త్వానికి నిలువెత్తు దర్పణం.

ఆత్మారోపిత చక్రదైవతమనుం యం శ్రీగురుం మాదృశాః
నత్వా తత్పరదేవతాస్యకమలాత్ సాక్షాదివ స్వాశిషః।
గృహ్ణం త్యేష యశోమయో బుధ వరః శ్రీచక్ర శృంగాంతరే
ధ్యాతవ్యోస్తి నమోస్తు తచ్చరణయోః శ్వేతారుణాంభోజయోః॥

– మంత్రపుష్ప సర్గ నుంచి

సరే! ఆ ఆవరణలో నిలబడియున్న వీరికి ఎదురుగా శ్రీచక్రేశ్వరి, శ్రీమహారాజ్ఞి, అయిన పరాభట్టారిక దర్శనమిచ్చింది. ఆమె వీరికి కొంచెం దూరంలో ఉన్న '3' యువతులను చూపి వారిని తన వద్దకు తెమ్మంది. వీరు అందులో ఒకామెను భుజం మీదకు ఎత్తికొని మిగిలిన ఇద్దఱిని వెంటబెట్టికొని అమ్మవారివద్దకు తెచ్చారు. దేవి దరహాసం చేసింది. "ఓరీ! నీ మనస్సు చలించింది. నీవు భూలోకంలో జన్మించు. నీ భుజంపైన వచ్చిన సుందరి నీకు భార్య అవుతుంది" అని అదృశ్యమయింది. అంతటితో "స్వప్న సమాధి" నుండి మెలకువ వచ్చింది. ఆశ్చర్యకర విషయం ఏమంటే తాను భుజం మీద మోసిన సుందరి ముఖం, చిన్నమ్మ కలలో చూపించిన ఫొటోలో ముఖం రెండూ ఒక్కటే.

తానెవరో తన కర్తవ్యమేమిటో అర్థమయింది. సర్వానుల్లంఘ్యశాసన ఆమె. నిజాజ్ఞారూప నిగమ ఆమె. పాణిగ్రహణం తప్పదు. గృహస్థాశ్రమం తప్పదు. వెంటనే మోక్షం పొందాలనుకొన్న ధ్రువుడు, ప్రహ్లాదుడు ఏమయినారు. నారాయణ సంకల్పంతో వారు వివాహ పట్టాభిషేకాలు చేసికొన్నారు. నారాయణీ సంకల్పంతో వీరికిన్ని అవి తప్పలేదు. ఇటువంటి కారణాలతో వారి 19వ ఏట శ్రీశ్రీదేవమ్మగారితో వివాహం జరిగింది. అఖండ శ్రీదేవతోపాసకులయిన అద్దేపల్లి సోమనాథశాస్త్రిగారి అన్న కూతురు ఈమె. పైగా ఈ సోమనాథశాస్త్రిగారు వెంకటప్పయ్యశాస్త్రి గారికి గురువు గారని గూడ ఇంతకు ముందే చెప్పికొన్నాము.

లోకవ్యాసంగాలు:-

ఋష్యశృంగుని వంటి యీ బ్రహ్మచారికి పాణిగ్రహణం అయింది. బాల్య వివాహాలు కనుక భార్యకాపురానికి రావటానికి సమయం పట్టుతుంది. సరే! ఎటూ "సన్యాసం అబద్ధం- సంసారం నిబద్ధం" అయింది. కనుక సంసారం, సంపాదన ఇవన్నీ జగడాలంతో నలుగురితో పాటు

శాస్త్రపాండిత్యము గూడా అవసరం అవుతుంది. అందుకొఱకు తాడికొండలో ఉన్న శ్రీ ముదిగొండ నాగలింగశాస్త్రిగారిని సమీపించారు. అచ్చట తన తండ్రిగారివలెనే కొద్ది నెలల్లో వ్యాకరణశాస్త్రం చదివారు. వేదాంతశాస్త్రంలో విశేష శ్రమ చేశారు. నాగలింగశాస్త్రిగారు శైవులు ఆరాధ్యబ్రాహ్మణులు. వీరేమో అద్వైతులు, స్మార్త బ్రాహ్మణులు. అయినా వారికి వీరియందు గొప్ప వాత్సల్యం గౌరవం ఉండేవి. తమ అదృష్టం కొద్ది ఈ శిష్యుడు దొరికాడని వారి భావన. అందుకని వారు వీరికి వేదాంతశాస్త్రం చెప్తూ శంకరభాష్యానికితోడుగా ప్రక్కన వ్యాసపీఠాల మీద రామానుజభాష్యం, మాధ్వభాష్యం, నీలకంఠ(శైవ) భాష్యం గూడా అమర్చి ప్రతి సూత్రానికి ఈ నాల్గుభాష్యాలను విమర్శిస్తూ వివేచిస్తూ పాఠం చెప్పేవారు. 'హనుమ' వంటి శిష్యుడు, 'సూర్యుని' వంటి గురువు. నాలుగు భాష్యాలేమి? నలభై భాష్యాలయినా అవలీలగా అధ్యయనం చేయవచ్చు. ఈ విద్యాభ్యాసకాలంలో గురువుగారితోబాటు సభలకు వెళ్తుండేవారు శ్రీరాఘవ నారాయణశాస్త్రిగారు. వీరు అందులో అష్టావధాన శతావధానాలు చేసేవారు. అందుకు వచ్చిన సన్మాన ద్రవ్యము గురుదక్షిణగా గురువుగారికి సమర్పించేవారు.

దేవి అనుగ్రహాలు:- ఈ విధంగా విద్యాభ్యాసం జరిగే రోజుల్లోనే ఒకసారి 'చందలూరు' అమ్మవారి దర్శనానికి వెళ్లారు. గృహస్థాశ్రమ నిర్వహణకు ఐశ్వర్యం అవసరం కదా! అమ్మవారు ఐశ్వర్యం ఇస్తానన్నది. కాని మన ప్రయత్నం కావాలి కదా! కనీసం చేయి చాపాలి కదా! కనుక మనస్సులో ఐశ్వర్య వాంఛతో చందలూరు గణాచారిని ప్రశ్న అడగాలని కోరిక. ఆ రోజుల్లో 'చందలూరు అమ్మవారు' జగత్ప్రసిద్ధి. గణాచారి లక్ష్మీనారాయణగారు ప్రశ్నలు, పరిహారాలు చెప్పేవారు. అవి ఖచ్చితంగా జరిగేవి. వీరు మడి కట్టుకొని ఎదురుగా కూర్చొన్నారు. ఎదురుగా ప్రశ్నలు చెప్పుతున్న లక్ష్మీనారాయణగారు వీరి వైపు చూచి "ఏమిరా! నీకు ఐశ్వర్యం కావలసి వచ్చిందా?" అని గద్దించారు అమ్మవారి పూనకంలో. వీరు అన్నారు

"ఎందుకు కోరగూడదు? ధర్మసాధనకు గృహస్థాశ్రమం అందుకు ధనం అవసరమేకదా!" – అని. అంతటితో ఊరుకోక "నేను నిన్ను అడగలేదు కదా!" అని రెట్టించారు. లక్ష్మీనారాయణ గారిని ఆవేశించియున్న చందలూరు జగజ్జనని ఈ చందోలు జగద్గురువుతో ఐశ్వర్యం కోరవద్దు. అన్నవస్త్రాలకు లోపం లేకుండగా జరుగుతుంది. నీవు ఈ సమీప పర్వతంలో ఒకనాడు తపస్సు చేసిన యోగివి. యోగభ్రష్టతవలన ఈ జన్మ వచ్చింది. నిన్ను నేను స్వయంగా అనుగ్రహిస్తాను అని చెప్పింది. వీరు అన్నారు "నీవు చెప్పేది నమ్మటం ఎట్లా?" అని. అపుడు వెనుక వీరికి వచ్చిన స్వప్నాలను గుర్తుగా చెప్పి సందేహం పోగొట్టారు గణాచారి గారు. ఈ ఘట్టంతో వీరికి సంపాదనేచ్ఛపోయింది.

చందలూరు మహాలక్ష్మి గణాచారి ద్వారా చెప్పిన మాటల అంతర్యం ఏమంటే 'ధనం' మనిషికి శాశ్వతతృప్తినియ్యదు. పైగా వెంపరలాట పెరుగుతుంది. వాంఛ వెంబడి వాంఛ శర పరంపరగా వస్తూనే ఉంటాయి. కనుక ధనవాంఛను మొదట్లోనే తుంచేసింది అమ్మవారు. కఠోపనిషత్తులో నచికేతుడు అంటాడు "**న విత్తేన తర్పణీయో మనుష్యః**" అని అలాగే, అన్నపూర్ణోపనిషత్తు, వాంఛ తామరతంపరవంటిదని, దాన్ని మొదట్లోనే తుంచాలని నొక్కి చెప్పింది.

"వాంఛాక్షణే తు యాఽ తుష్టిః తత్ర వాంఛైవ కారణమ్।
తుష్టి స్త్వతుష్టి పర్యంతా తస్మాద్వాంఛాం పరిత్యజ॥"

అంటే వాంఛ పుట్టిన క్షణంలో మనలో ఒక అసంతృప్తి ఉంటుంది. దానికి కారణం ఈ "వాంఛ". తృప్తి "అసంతృప్తి", వఱకు ఉంటుంది. కనుక 'వాంఛను వదలితే అసంతృప్తి పుట్టదు. అప్పుడు ఉండేది 'తృప్తి' మాత్రమే. ఆ ఉపనిషత్తే

"ఆశా యాతు నిరాశత్వం అభావం యాతు భావనా,
అమనస్త్వం మనో యాతు తవాసంగేన జీవతః"

అన్నది. అసంగముగా బ్రతకదలచిన ఆధ్యాత్మిక పురుషుడు "ఆశకు నిరాశ కల్గించాలి. భావనలను అభావంగా మార్చాలి. మనస్సుకు మనస్సు లేకుండా చేయాలి" అని చెప్పింది. ఇదే చందలూరు తల్లి తన చందోలు సుతునకు ఇచ్చిన సందేశము. **అవ్యాజకరుణామూర్తి, అజ్ఞానధ్వాంత దీపిక,** గదా! దేవి.

అలాగే వీరికి 'జనవశీకరణం' చేయాలనే కోరిక కలిగింది మఱొకసారి. 'మయూరశిఖి' అనే ఓషధి అందుకు పనికివస్తుంది. అది గ్రహణ సమయంలో రాత్రి పూట నెమలిరంగులతో వెలుగుతుంది. అదే దాని గుర్తు. దానిని గ్రహణ సమయంలో స్వీకరించి ధరిస్తే జనవశీకరణం జరుగుతుంది. గురువుగారికి సాహసమే ఊపిరి, నిర్భయులు. గ్రహణ సమయం వచ్చింది. పగటిపూట తాడికొండవద్ద ఉన్న 'లాముకొండ' మీద మయూరశిఖిని గుర్తించి వచ్చారు. అర్థరాత్రి గ్రహణసమయానికి ఒంటరిగా కొండమీదకు వెళ్ళారు. గ్రహణంలో పూర్తిగా చంద్రబింబం కనబడకుండా పోయింది. ఆ చీకట్లో "మయూరశిఖి" వన్నెలీనుతున్నది. మంత్రపూర్వకంగా దాన్ని స్వీకరించటానికి వీరు ముందుకు సాగారు. ఎవరో ఒక మఱుగుజ్జు లాంటి వ్యక్తి ఒక బొమ్మలాంటి వ్యక్తి, ఓషధికి అడ్డంగా వచ్చాడు. వాడికి 3 తలలు ఉన్నాయి. ఈ ఓషధి నాదన్నాడు. తీసికోవటానికి వీల్లేదన్నాడు.

"తృష్ణయా బధ్యతే జంతుః సింహః శృంఖలయా యథా" అన్నది మహోపనిషత్తు. ఎంతటి సింహమయినా గొలుసుకు కట్టుపడుతుంది. అలాగే జీవుడు "ఆశ" కు బద్ధుడవుతాడు. అసాధారణ జీవులకు భగవంతుడే అడ్డుపడి మార్గదర్శనం చేస్తాడు. సరే! ఇదొక **కిరాతార్జునీయం** అయింది. ఆ ఓషధిని సంగ్రహించాలని వీరు ఎంత ప్రయత్నించినా ఆ బొమ్మ వ్యక్తి అడ్డుపడుతున్నాడు. ఆ వ్యక్తిని ఎత్తి అవతల పడేసి ఓషధిని గ్రహణం విడిచే

లోపల సంగ్రహించాలని వీరి పట్టుదల. గమనించాడు బొమ్మ వ్యక్తి. "అబ్బాయీ! నీకు ఈ ఓషధి అనవసరం. నీవు కోరే ఆ వశీకరణ శక్తి నీ ముఖానికి సహజంగానే ఉంది. నీకు దేవతలు గూడా వశమే!" అన్నాడు. అప్పటికి గ్రహణం తొలగింది. వెన్నెల వచ్చింది. మయూరశిఖి నిద్రించింది. మూడు తలకాయల బొమ్మ అదృశ్యమయింది. అపుడు గుర్తు వచ్చింది గురువు గారికి "మయూరశిఖి" కి దత్తాత్రేయుడు అధిపతి అని. ఈ సంఘటన చూస్తే 'కౌషీతకం' లోని కొన్ని వాక్యాలు గుర్తురాక మానవు.

ఏషహ్యేవైనం సాధుకర్మ కారయతి-తం యమున్నినీషత ఏష ఏవైన
మసాధుకర్మ కారయతి తం య -మేభ్యో లోకేభ్య ఉనునీషతే
ఏష లోకపాలః ఏష లోకాధిపతిః ఏష సర్వేశ్వరః స ఏష ఆత్మా అని.

అంటే పరమాత్మ ఎవరిని బాగుచేయదలచాడో వానిచేత అందుకు అనుకూలమయిన కర్మలు చేయిస్తాడు. ఎవరిని పతనం చేయదలచాడో వానిచేత అపవిత్ర కర్మలు చేయిస్తాడు అని. అందుకే 'కౌషీతకం' లో ఒక ముని పరమాత్మను కోరతాడు

"త్వ మేవ మే వృణీష్వ యం త్వం మనుష్యాయ హితతమం మన్యసే" అంటాడు. అంటే, ఒక మనిషికి ఏది హితమో అది నీవే నాచేత చేయించు అని అర్థము. దీన్లో అంతర్లీనంగా ఒక ప్రపత్తి ఒక శరణాగతి ఉన్నది. ఒక అసంగయోగం ఉన్నది. ఒక కర్మ సన్యాసం ఉన్నది. ఇలా ఆత్మ సమర్పణ చేసినవానికి కృష్ణపరమాత్మ **"యోగక్షేమం వహామ్యహం"** అన్నాడు. ఇట్టివానికే **"దదామి బుద్ధియోగం"** అని గూడా అన్నాడు. గురువు గారు ప్రపన్నులు కనుకనే వారి ఐహికవాంఛలకు దేవతలే స్వయంగా ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేసి సరిఅయిన దారిలో పెట్టున్నారు. **"శాధి మాం త్వం ప్రపన్నం"** అన్న అర్జునుని కశ్మల మనస్సును కృష్ణపరమాత్మ 'అర్యజుష్టము" గా మార్చిన సన్నివేశంలోని ఉద్దేశం అదే గదా!

ఈ మయూరశిఖి వృత్తాంతంతో జగద్వశీకరణవాంఛ నశించింది. తాడికొండలోనే మఱొక సంఘటన.

ఊరిబయట చెఱువుంది. ఎక్కడ నుంచి వచ్చాడో ఒక యోగి - ఆ చెఱువు ఒడ్డున కృష్ణాజినం పఱచికొని - తపస్సు మొదలు పెట్టాడు. ఆజానుబాహువు. స్ఫురద్రూపి. ఆయన విషయం ఊరంతా ఉప్పు అందుకొన్నది. గ్రామస్థులు అంతా చూచిపోతున్నారు. ఆయన ఎవరితోను మాటలాడలేదు. గురువుగారి గురువు గారయిన శ్రీముదిగొండ నాగలింగశాస్త్రి గారు గూడ యోగిని దర్శించి వచ్చారు. ఆ యోగి వారికీ పలకలేదు. వారు ఇంటికి వచ్చి తన శిష్యుడయిన మా గురువుగారితో "శాస్త్రీ! నీవు గూడా చూచిరా! నీతో అయినా మాట్లాడుతారేమో! అని అన్నారు. సరేనని సాయం సంధ్యావందనానికి వీరు చెఱువు వద్దకు వెళ్ళారు. యోగి వీరిరాకను గమనించాడు. వెంటనే తన కృష్ణాజినము తీసిచంకన పెట్టికొని వీరివైపు వచ్చారు. నేను నీ కోసమే వచ్చానన్నాడు. ఆశ్చర్యపడటం వీరివంతయింది. తనను కలిసేందుకు ఒక మహాయోగి రావటం ఏమిటి?

అడిగారు "నా కోసం రావటం ఏమిటి? మీకు నాకు ఏ పరిచయమూ లేదే" అని. యోగి అన్నాడు "నీకు నేను తెలియదు. కాని నాకు నీవు గుర్తే. పూర్వజన్మలో మనం ఇద్దఱం ఒక కొండమీద తపస్సు చేశాం. ప్రారబ్ధవశాత్తు నీవు యోగభ్రష్టుడవై ఇలా జన్మించావు అన్నారు.

ఇదంతా కృష్ణుడు భగవద్గీతలో అర్జునునితో అన్న మాటలకు సమానంగా తోచటం లేదా! **"బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున"** అర్జునా! నీకు, నాకు అనేక జన్మలు నడిచినవి. కాని అవి నీకు తెలియవు. నాకు తెలుసు. అని అర్థము.

తరువాత గురువుగారు యోగిని అడిగారు "ఇప్పుడు ఎందుకు ఇలా వచ్చినట్లు" అని. ఆయన అన్నాడు "నీకొక్క సంగతి చెప్పాలని వచ్చాను.

"సంసారము దుఃఖమయము. సుఖం కావాలనుకొన్నవాడు సంసారమునకు పోరాదు. ప్రారబ్ధమువలన సంసారము అనివార్యమయినచో సుఖదుఃఖములను సమానముగా భావింపుము. సంసారమయినా సన్యాసమయినా అపుడు ఒక్కటే. నిర్లిప్తత అలవఱచుకో" అని ఉపనిషద్వాక్యాన్ని ఉపదేశించారు.

ఈ మాటలు వింటే కొన్ని ఉపనిషత్తుల వాక్యాలు మన మనస్సులో గూడా మెదలుతాయి.

"నాత్యర్థం సుఖదుఃఖాభ్యాం శరీర ముపతాపయేత్"

- సన్యాసోపనిషత్తు - 4

అంటే సుఖదుఃఖాలతో అతిగా శరీరాన్ని తపింపజేయవద్దు అని. మఱి సుఖదుఃఖాలు తగులుకుంటాయి గదా! శరీరతాపం లేకుండా ఎలా ఉంటుంది? అని ప్రశ్న ఉంటుంది నిజమే. కాని 'అతిగా' తపింపజేయరాదు. దానికి ఉపాయమేమిటి? దానికి గూడా సమాధానం ఉంది.

ద్వే బీజే చిత్తవృక్షస్య వృత్తి ప్రతతిధారిణః
ఏకం ప్రాణపరిస్పందః ద్వితీయం దృఢభావనా॥

- ముక్తికోపనిషత్తు-2.48

మనస్సు అనే చెట్టుకు '2' విత్తనాలున్నవి. (1) ప్రాణసంచారము, (2) దృఢభావన

ఇందులో ప్రాణ సంచారాన్ని నియంత్రించి మనస్సును ఆపటం వృత్తిరహితం చేయటం యోగ పద్ధతి. దృఢభావనను ఆపి మనస్సును లయంచేయటం సాంఖ్యపద్ధతి. ఏదో ఒక పద్ధతిలో "మనస్సును" ఎదుగనీయకుండా ఆపినచో సుఖదుఃఖాలు మనలను బాధించవు. అందులో

అంతరాస్థాం పరిత్యజ్య భావశ్రీం భావనామయీమ్।
యోఽ సి సోఽ సి జగత్యస్మిన్ లీలయా విహరానఘ॥

– కఠరుద్రోపనిషత్తు.

భావనారూపమయిన ఐహిక శ్రద్ధను మానివేసి యీ ప్రపంచములో "As it is where it is" అన్నట్లుగా ఉన్నవాడవున్నట్లుగా లీలగా విహరించమని అభిప్రాయము. ఈ విషయాన్నే

రాగద్వేషభయాదీనాం అనురూపం చరన్నపి।
యోఽ న్తః వ్యోమవదత్యచ్ఛ స్స జీవన్ముక్త ఉచ్యతే॥ అని

"వరాహోపనిషత్" వివరించింది.

ఆకాశంలో మేఘాలుంటాయి. సూర్యుడుంటాడు. నక్షత్రాలుంటాయి. అయినా 'ఆకాశం' వీనితో అంటుకోదు. అలా యోగి, రాగద్వేషాలున్నా వాటికి అంటుకోకుండా అదే నిర్లిప్తంగా ఉండాలి. ఇదే గురువుగారికి యోగి ఉపదేశం "అయ్యా! నాకోసం వచ్చామన్నారు గదా! నన్ను మీతో తీసికొని పొండి" అని వీరు వెంటపడ్డారు. "నీ ప్రారబ్ధం నీవుగాక ఎవరు అనుభవిస్తారు? కొంతకాలము తప్పదని బయలుదేరాడు యోగి. మళ్లీ ఇంకొక మాట అన్నాడు. "50 సం॥ల తర్వాత మరల నీకు కనబడ్తాను". ఆ యోగి మాటలు నిజమయినవి. 50 సం॥ల తర్వాత ఒకరోజు గదిలో యోగాభ్యాసం చేస్తున్న గురువుగారి శరీరం గాలిలోకి తేలింది. పైకప్పుకు తగిలి మళ్ళీ క్రిందకు వస్తున్నది. నేలతాకితే తల పగులుతుంది. కాని – అంతలో తలకు నేలకు మధ్య ఒక "దోసిలి" ప్రత్యక్షమయింది. ఆదోసిలి ఎవరిదో కాదు ఆ యోగిదే. గురువుగారు మామూలు స్థితికి వచ్చిన తర్వాత ఆ యోగి అదృశ్యమయినాడు.

ఇలా అడుగడుగునా తన భక్తుని దిద్ది, దిద్దించిన ఆ దేవి మహిమలు ముందు ముందు, వారి జీవితంలో ఎలా కనబడినాయో మరల వారి జీవితంలోకి వెళ్ళిచూద్దాం!

తాడికొండలో చదువు మధ్యలోనే ఆపివేయవలసివచ్చింది. ఉచితంగా 40 మంది విద్యార్థులను సరసాన్నాలతో విద్యాదానంతో సమారాధించిన చందోలులోని పాఠశాలవలన ఉన్న 'ఆస్తి' హరించింది. అప్పులు అయినవి. పూటగడవటం కష్టమయినది. తండ్రికి చేదోడు వాదోడుగా ఉండవలసి వచ్చినది. అందువలన చదువు ఆపి చందోలులోనే కాలక్షేపం చేయదలచారు.

కొంతకాలానికి వ్యాధిగ్రస్తులై తండ్రిగారు గతించారు. వారి రామకథామృత గ్రంథం 'బాలకాండ' వరకే అచ్చు అయింది. మిగిలిన కాండలు అచ్చు వేయాలి. చందాదారులు ఇచ్చిన చందాలు బాలకాండకే సరిపోయినవి. మొత్తం రామాయణం ఇస్తామని చందాదారు లకు తండ్రిగారు ఇచ్చిన మాట అసత్యం అయిపోతుంది. పైగా మరణ శయ్యమీద నున్న తండ్రిగారి చివరి కోరిక "తను చందాదారులకు ఇచ్చిన మాట అబద్ధం కాకుండా చూడమని". తాము పితృవాక్యపరిపాలన చేస్తామని తండ్రికి మాట ఇచ్చి ఉన్నారు. కాని తినటానికి తిండి లేదు. పైపెచ్చు అప్పులు. ఇదిగాక **"గండస్యోపరి పిటకా సంవృత్తా"** అన్నట్లు ఈ పితృవాక్య పరిపాలనం– ఎలా? సన్యాసం స్వీకరిద్దామనుకొన్న వ్యక్తికి ఇంత భయంకర సంసారం అప్పగించింది జగన్మాత!. ఇంతకూ ఆమె చెప్పిందేమిటి? "ఐశ్వర్యం ఇస్తానని పెళ్ళిచేసికో మన్నది. అన్నవస్త్రాలకు లోటుండదు సంపాదనేచ్చ మానుకో అన్నది" ఇపుడామె ఎక్కడ ఉన్నది? ఏమి చేస్తున్నది? ఆ చిన్నమ్మ ఏది? ఈ 'పెద్దమ్మ' తో ఎలా బ్రతకాలి? జనమే వశమవుతారన్న దత్తదేవుని మాట ఏమయినది? అంతా అగమ్యగోచరం.

ఈ స్థితిలో వారి మనస్సులో "జగన్మాత" మెరిసింది. అవును! ఆమెనే అడగాలి! అంతే! ఎటూ ఇంట్లో బియ్యం లేవు. ఉపవాసాలు. ఆ ఉపవాసాలను తపస్సుగా మార్చారు. దరిద్రాన్ని దీక్షగా మలచారు. 'వ్యాధిని' తపస్సుగా మలచుకోమన్నది బృహదారణ్యకం. "ఆధి" ని గూడా వీరు తపస్సుగా చేసిచూపారు. **శ్రీమత్సింహాసనేశ్వరీదేవి** సింహాసనం వద్దనే

ఉపవసించారు. జపించారు. అభిషేకం చేశారు. పూజ చేశారు. 'నీరే' నైవేద్యం పెట్టారు. రోజుకు 27 పర్యాయాలు సహస్రనామ పూజ. ఇలా 3 రోజులు హఠయోగం. దేవి వాగ్దాన భంగం చేస్తే ఎలా? అన్న పట్టుదల. ఈ విషయాన్నే శ్రీగురుచరితంలో కవి

ప్రతిశ్రుతవతీ శ్రియం పరిణయం చ మేకారయః
కుటుంబపరిపంథినీం కదు దరిద్రతాం ప్రాహిణోః॥
'అసత్య మథినాయికా' కథమిదం ద్వయం యుజ్యతే
న సహ్య మితి యత్ర మే గురు రసాధయద్దేవతామ్॥ అని వర్ణించాడు.

ఆ నవరాత్రదేవి ఈ త్రిరాత్ర వ్రతములో చివరి రోజున కలలో సాక్షాత్కరించింది. చిన్న బాలికలా గల్లు గల్లున అందెల రవళితో వచ్చిన ఆ నాదమయి "ఒరే! ముష్టి పెట్తాను పట్టు" అని పిడికిటితో బంగారు వడ్లగింజలు వారి పైపంచెలో భిక్షపెట్టింది. ఆ బియ్యం గింజలు తళుక్కున మెరిసినవి. తరువాత ఆమె అన్నది. "రేపు ఉదయం నీకోసం ఒక బండి వస్తుంది. కాదనకుండా ఆ బండిలో వెళ్ళు" అని. గురువుగారికి మెలకువవచ్చింది. తన పరిస్థితిని బట్టి వచ్చిన స్వప్నమేమో అని ఉపేక్షించారు. కాని స్వప్నాన్ని నిజంచేస్తూ మరునాటి ప్రొద్దున "ఖాజీపాలెం" రాజులు పంపిన బండి వచ్చింది. సీతారామరాజు అనే ధనికుడు ఆ బండిని పంపాడు. **'కల'** గుర్తు వచ్చింది. **"షోడశీకల"** గూడా గుర్తువచ్చింది. ఆమె ఆదేశం ప్రకారం బండిలో వెళ్ళారు. ఖాజీపాలెంలో బండి దిగారు. 200 మంది రాజులు ఎదురు వచ్చారు. బండి నుండి వసతి గృహందాకా పరుపులు పరిచారు. వాటి మీద నడిపించారు.

ఆహా! అప్పటివరకు తిండి లేదు. పిలిస్తే పలికేవారులేరు. ఆ 4వ రోజున రాచమర్యాదలు. రాజరాజేశ్వరి రాజులతో చేయిస్తున్న మర్యాదలు. **భక్తానుగ్రహదాయిని** శ్రీమత్సింహాసనేశ్వరి తన భక్తునకు నరహృదయ

సింహాసనేశ్వరుణ్ణిగా అభిషేకించిన రోజు అది. రాఘవుడు నిజంగా 'నారాయణుడైన రోజు అది'. **శాశ్వతీ, శాశ్వతైశ్వర్యా** అయిన దేవి శాశ్వత సంపదనిచ్చిన రోజు అది. జనవశీకరణం మొదలయిన రోజు అది.

కొంతకాలం తమకు పురాణం చెప్పమని రాజులు కోరారు. వీరు అంగీకరించారు. ఆరోజు పురాణం అయింది. స్వహస్తపాకంతో భోజనం చేశారు. మరల బండి మీద ఇంటికి వచ్చారు. తలుపు నెట్టారు. కాని తలుపు జరగలేదు. అక్కడ 'ధాన్యం' ఉన్నదని ప్రక్క తలుపు నుంచి రమ్మని తల్లి హనుమాయమ్మగారు చెప్పారు. ధాన్యమెక్కడిదన్నారు వీరు. నీవు ఖాజీపాలెం నుంచి పంపిన ధాన్యం అక్కడ పోయించాను అన్నది ఆమె. ఆశ్చర్యపడ్డారు. నేను పంపటమేమిటి అని. తరువాత తెలిసింది ఖాజీపాలెం రాజులు పుట్టెడు ధాన్యం వారికి బహుమతిగా పంపినట్లు. అంటే గుప్తదానం చేశారన్నమాట! పరోక్ష ప్రియ అయిన దేవి పరోక్ష పద్ధతిలోనే ఫలించిందన్నమాట. ఒక్క మెతుకుతో కృష్ణపరమాత్మ లోకాన్ని తృప్తి పరిచాడని కథ. ఒక్క పిడికిటితో పెట్టిన యీ "స్వప్నస్వర్ణముష్టి" వారి 98 ఏండ్ల జీవితానికి అతిథులకు అభ్యాగతులకు ఉత్సవాలకు, వివాహాది కార్యక్రమాలకు, యజ్ఞాలకు, చివరగా మా వంటి ఆశ్రమ శుకపికములకు నేటికి అక్కడ నివసించిన కుటుంబీకులకు, వారు నడిపే వేదపాఠశాలకు గూడా సరిపడా తిండి పెట్టిన, పెట్తున్న అజాతశత్రుని అక్షయపాత్ర. అందుకే శ్రీగురుచరిత కవి "మంత్రపుష్పసర్గలో"

అచ్ఛిన్న సంభృత చిదగ్ని రజయ్యబుద్ధిః
అక్షయ్య ముష్టి మనుభూయ జగజ్జనన్యాః
అస్మాదృశా నపుష దంశితతత్ప్రసాదైః
ఆచార్య ఏష కరుణా వరుణాలయశ్రీః॥ అని స్తుతించాడు.

అన్నరాశిగా మారిన యీ "స్వర్ణముష్టి" నే "అన్నం బ్రహ్మేత్యు పాసీత" అని ఉపాసన చేసినట్లు భావింపదగును. ఆ అన్న...

కొద్ది కణాలు అందుకొన్న ద్విజకిశోరాన్ని కనుక నేను ఇది వ్రాసే అర్హత పొందాను.

గురువుగారితో బాటు "గురుపత్ని" గూర్చి ఇచ్చట ముచ్చటించాల్సిన సందర్భం ఉన్నది. నిగూఢమహిమాన్వితురాలయిన 'మగనిచాటు మగువ' యీమె. **'మగని దాచి వ్యవహరించు మగువకు'** ఈమె గూడా మగనితో సమానమయిన భక్తురాలే. దేవిని స్తుతిస్తూ ఈమె వ్రాసిన పాటలు గూడా 2 భాగాలుగా ముద్రితమయినవి.

'శ్రీదేవీ సంకీర్తనావళి' అని ఆ గ్రంథనామము. లోగడ చెప్పికొన్న స్వప్నకథ ప్రకారము ఈమె గూడా శ్రీచక్ర వ్యూహంలోని చతుర్థావరణంలోనున్న సిద్ధశక్తియే కదా! జగదంబ అనుగ్రహం ఈమెయందు ప్రసరించిననూ తటస్థము. అందువలననే గదా! గురువుగారి సంన్యాస యోగాన్ని నివారించి "జగన్మాత" ఈమెకోసం వారిని వరునిగా తెచ్చింది. సేవాభావంలో అద్వితీయురాలయిన ఈమె నాకు మశూచిక వ్యాధి సోకినపుడు గురుకులంలో స్వయంగా 'ఉపచర్య' చేశారు. అందుకే శ్రీగురుచరితకవి తన కావ్యంలో

"వాత్సల్య శీతలకరేణ సుధామయేన
పథ్యౌషధాంజనవిధిం స్వయమేవ కృత్వా
సా మాం చకార పృథుకం లఘు నిర్విషూచిం
పిత్రోః పరోక్ష మపరోక్ష గుణ ప్రకర్షా"

అటువంటి యీమెగారి విషయంలో "పరాశక్తి" స్పందించిన విషయం చూద్దాం.

ఒకసారి గురువుగారు పత్నీ సమేతంగా తెనాలిలో ఉన్నారు. కొన్ని కుటుంబ పరిస్థితులకు విరక్తి చెంది సన్యాసం స్వీకరిదామని యిలు వదలి

వెళ్ళిపోయారు. శ్రీదేవమ్మగారు వారికి ఎదురు చెప్పలేక పోయారు. కూతురు నెలలు నిండిన గర్భవతి ఆమెను విడిచి తాను వారి వెంట వెళ్ళిపోవటం సాధ్యంకాదు. దేవీ పీఠము ముందు మోకరిల్లి తన పరిస్థితిని విన్నవించింది. ఆ రాత్రికి గుంటూరుచేరి అక్కడ బసచేసిన గురువుగారికి "చిన్నమ్మ" కలలో కనబడి చెవి పట్టుకొని లాగి "ఎక్కడికిరా పోయేది? ఇంటికి పో" అని మందలించింది. మఱునాడు శాస్త్రిగారు ఇంటికి వచ్చారు.

మఱి గురుపత్ని సామాన్యురాలా! గురువుగారి అన్ని తపస్సులతో బాటు 'అన్నతర్పణ' తపస్సులో గూడా పాల్లు పోకుండా పాల్గొన్న సహధర్మచారిణి గదా! నిత్యం మూడు పూటలా విద్యార్థులకు వేడివేడి భోజనం వడ్డించిన విశాలాక్షి గదా! మధ్యాహ్నం గురు మహేశ్వరునకు అతిథ్య భిక్ష పెట్టే 'అన్నపూర్ణ' కదా! అందువలన గదా! మావంటివారు విద్యాగ్రహణం చేయగల్గింది. అందుకే శ్రీగురుచరితంలో కవి తన కృతజ్ఞత ఇలా వ్యక్తపఱచాడు.

విద్యాతృష్ణజి యా శిశౌ మయి సదా వాత్సల్య పూర్ణేక్షణా
యస్యా అంచితహస్త సంగమవశాత్ తుచ్ఛం చ రుచ్యాయతే,
ఆచార్యోపి యయా దయా విభవయా భూయః పవిత్రీకృతః
శ్రీదేవీ జయతా ద్రుచిష్యసకలాహారేషు శాకంభరీ॥

ఇక మఱల గురువుగారి విషయానికి వద్దాం

వారు శ్రీరామ క⁚ మృతం ఉత్తరకాండ శేషాన్ని పూరిస్తున్నారు. ఒకరోజు కవిత్వం సాగలేదు. కాని 100 పద్యాలు వ్రాసి అచ్చుకు పంపాలి. వీలయినంత త్వరగా పితృవాక్యం నెరవేర్చాలి. మనస్సులో ఆరాటం. ఎవరయినా ఆటగాడు సరిగా ఆడలేకపోతే "ఫామ్"లో లేడంటారు. అదే పరిస్థితి కవులకున్ను వసుంది. అందువలన పద్యం సాగలేదీ ...

ఆందోళనతో నిద్రపోయారు. కలలో తమ యింటి అరుగుమీద ఒక "బీబీ" (బూబమ్మ) కూర్చొని ఉన్నది. ఆమె దగ్గర ఒక గడ్డపు మనిషి పాలు త్రాగుతున్నాడు. వీరు అక్కడే నిలిచి వింతగా చూస్తున్నారుట. "చూస్తావేమి? కావలసివస్తే నీవు గూడా త్రాగు" అని 'బీబీ' అన్నది. వీరు గూడా త్రాగారుట. కాని గుక్కెడు గూడా రాలేదట. ఆమాటే ఆమెతో అన్నారు. ఆమె "నీ కందపద్యానికి అవిచాలులే పో" అని అదృశ్యమయినది. మెలకువ వచ్చింది. వెంటనే మనస్సులో కంద పద్యం తట్టింది.

"భర్మమయరమ్యహర్మ్యము లర్మిలిప్రియురాలిగూడి...." అను పద్యం పూర్తి అయింది. తరువాత ధార ఆగింది లేదు. దేవి తాను 'కావ్యకలా' అని ఋజువుచేసికొన్నది. ఆ సందర్భమును వర్ణిస్తూ గురువుగారు చేసిన ప్రార్థనా పద్యం ఇదుగో!

ఎగబడి త్రాగు కావలసెనేనని త్రాగుచు పాలు లేవు పూ
ర్తిగ నొక గ్రుక్కకేనవిన ప్రీతిమెయిం గని, కందపద్దె, మ,
ల్లగ నవి చాలు పొమ్మని అలక్షితయై స్వకవిత్వధార, సా
ధ్విగ బెనుపొందజేసిన సతిన్ యవనిన్ దలతున్ తదాప్తికిన్॥

అగ్ని పరీక్ష:-

గురువుగారి జీవితంలో అతిముఖ్యమైన ఘట్టం ఇది. భౌతికంగాను ఆధ్యాత్మికంగాను అంతరార్థం ఉన్న పరీక్షా సన్నివేశం ఇది. వారిమధ్య వయస్సులో జరిగినది. ఈ ఘట్టం మొత్తాన్ని 'అగ్నిపరీక్ష' అనేపేరుతో వారి శిష్యులు శ్రీ గట్టి లక్ష్మీనరసింహశాస్త్రిగారు చక్కని తెనుగులో గ్రాంధిక గద్య ప్రబంధంగా రచించి ప్రచురించారు. 50 ఏండ్లకు పూర్వమే యీ పని జరిగింది. ఈ గ్రంథం ఆధారంగా గురువుగారి మఱొక శిష్యుడు "శ్రీగురుచరితం" అనే పేరుతో సంస్కృత శ్లోక కావ్యంగా యోగజ్ఞాన

పరమయిన అంతరార్థాలలో వ్రాసి ప్రచురించటం జరిగింది. వీటి అన్నింటి సారాంశంగా ఈ కథను ఇచ్చట ముచ్చటిస్తాను.

ఇది భగవతి తన భక్తుని పరీక్షించిన ఘట్టం. అయితే 'పరీక్ష' అనేపదం వాడవచ్చునా? వస్తుతత్త్వం తెలియనివారు తెలిసికోవటానికి చేసేది పరీక్ష. అంబికకు భక్తతత్త్వం తెలియదా! సర్వజ్ఞ కదా!. కనుక 'పరీక్ష' అనరాదేమో? 'శోధన' అనవచ్చును. అంటే శుద్ధి చేయటం. భక్తునిలో దాగిఉన్న రాగద్వేషాలను రెచ్చగొట్టి కడిగివేసి భక్త మనస్సును నిస్సంకల్పంగా చేయటం కదా! జరుగుతున్నది అదే కనుక 'శోధన' అనటం వాస్తవం. అయితే భక్తుని దృష్ట్యా అది 'భక్తునికి' ఆత్మపరీక్ష. తానెంతవఱకు జితేంద్రియుడు పాపరహితుడు, తన చిత్తశుద్ధి ఎంత? అన్నది తనే తెలిసికోవటానికిది అదను. కనుక దీనిని పరీక్ష అనవచ్చును.

మలినంగా ఉన్న ఒక గ్లాసును చింతపండు ఇసుక బూడిద వేసి తోముతాం. అలానే 'మనస్సు' అనే గ్లాసుకు ముందు రాగపరివారం తగిలించటం, అదే చింతపండు, తరువాత రాగ పరివారానికి విరుద్ధంగా అనేక కష్టాలు కల్పించటం, ఇదే ఇసుకతో ఘర్షణ, దీనితో ప్రపంచం మీద, బ్రతుకుమీద, శూన్యతాభావన కలుగుతుంది. ఇదే నిర్వేదం, వైరాగ్యం. దీనినే బూడిదతో చివఱగా తోమి కడగడం. ఈ శుద్ధినే 'జ్ఞాన ప్రకాశము' గా చెప్పవచ్చును. అటువంటి పరీక్ష ఒక్కటి గురువుగారి చరిత్రలో ఉంది.

ఒకసారి గోదావరి జిల్లాలో నరసాపురములో జరుగనున్న సన్మానసభలో పాల్గొనుటకు గురువుగారు నరసాపురం బయలుదేరారు. భీమవరం చేరేసరికి ప్రొద్దు గూకింది. ఈ రోజుల్లో లాగా ఆరోజుల్లో బస్సులు ఎక్కువగా లేవు. రాత్రివేళ అసలుండవు. దొంగల బాధ ఎక్కువ. అంతా అడవి. కనుక ప్రయాణం సాహసమే. కాని వీరికి తెల్లవారేటప్పటికి చేరవలసిన అవసరం ఉంది. పైగా ఈ సాయంకాలం జపతపాలు ఎట్లా

జరగాలి. ఏదోరకంగా గమ్యం చేరుకోవాలనే 'తహతహ' ఎక్కువయింది. ఆఖరు బస్సు తప్పిపోయింది. వీరి ఒంటిమీద పండిత లాంఛనా లున్నై. సింహలలాటాలు, మురుగులు, కాశ్మీరపు బంగారుపుటంచు శాలువా మెడ మీద భస్మరేఖలు మధ్యలో పెద్ద కుంకుమ బొట్టు. ఎవరినయినా పిలిచిన్న ఆకర్షించేరూపం. వీరిని గమనించాడొక వ్యక్తి. దగ్గరకు వచ్చాడు. మంచి సంపన్నుడి లాగా ఉన్నాడు. ఆజానుబాహువు అయిన ఆకారం. శ్రీ 'తహతహ' గమనించినట్లున్నాడు.

శాస్త్రి గారూ! తమరెక్కడికి వెళ్ళాలి?

నరసాపురం వెళ్ళాలి.

ఎందుకు?

అచ్చుట రామరాజుగారి కొలువులో సన్మానసభ.

ఓహో! అయితే నేనూ అక్కడికే, ఆ రామరాజు మావాడే. బస్సు తప్పిపోయింది గదా! ఊరిబయట బండి వాడున్నాడు. బండికట్టమని కబురు పంపాను. తమరు గూడా నాతో రావచ్చు.

గురువుగారికి ఆందోళన మాయమయింది. వెంటనే అంగీక రించారు. ఇంతలో లాంతరుపట్టికొని ఒక పనివాడు వచ్చాడు. ముగ్గురు కల్సి ఊరిబయట 'గుర్రబ్బండి' దగ్గరకు బయలుదేరారు. ఊరు దాటింది రోడ్డు లేదు. ఎగుడు దిగుడు బాట. కీచురాళ్ళ రొద. దూరంగా నక్కల ఊళలు. సంభాషణ సాగుతుండటం వలన మొదట గమనించలేదు. ఊరు పూర్తిగా దూరం అయింది. అనుమానం మొదలయింది. ఎవరు వీరు! రక్షకులా? భక్షకులా? గుర్రబ్బండి జాడలేదు. అడిగితే ఏమో? తన ఒంటిపై విలువయిన పండిత భూషణాలు.

ఎందుకయినా మంచిది. కార్తవీర్యార్జున మంత్రం మనసులో అనుకో చేస్తున్నారు. ఆవ్యక్తి అన్నాడు.

అయ్యో! బండివాడు మోసం చేశాడు. మనం ఇట్లా నడిస్తే దగ్గరలో "పేరూరు" వస్తుంది. అక్కడే ఏదైనా బండి చూసుకొందాం అన్నాడు.

అసలు అతడు ఊరిబయట బండి గురించి అడిగినదే లేదు. ఇదొక మోసం. రొటిలో తలదూర్చిన తరువాత రోకటిపోటుకి వెఱచేదేముంది? మౌనంగా నడక సాగిస్తున్నారు. ఏదో ఊరు దూరంగా చీకట్లో మిణుకు మంటున్నది. అంతలో నిశ్శబ్దాన్ని చీల్చుకొంటూ భయంకరమయిన 'ఈల' వినబడింది. ప్రక్కనున్న వ్యక్తి మాయమయినాడు. బదులుగా చుట్టూ బరిసెలు, ఈటెలు, కత్తులు పట్టుకున్న గుంపు కనబడింది. ప్రమథగణాల మధ్య శివునిలాగా తామొక్కరే ఉన్నారు. వారిలో నుంచి ఒక దొంగ ముందుకు వచ్చి - నాయకుడు గాబోలు -

"అయ్యా! మీ దగ్గరనున్న సొమ్ములు డబ్బు తీసి మీ శాలువాలో మూటకట్టి ఇవ్వండి" అన్నాడు. వీరు అలాగే చేసి అంగవస్త్రంతో మిగిలారు. వాడు తన అనుచరులను ఇద్దఱిని పిలిచి "ఒరే ఈ అయ్యగారిని నరసింగపురంరోడ్డు దగ్గర దించిరండి" అని చెప్పాడు. మళ్ళీ ప్రయాణం. కంకర రోడ్డు వద్ద వదలి పెట్టి దొంగలు వెళ్ళారు. అంతా అంధకారం. దొంగలో? దొరలో? ఇప్పుడు ఆ తోడు గూడా లేదు. గమ్యం తెలియదు. ఈ అంగవస్త్రంతో ఎటు పోవాలి?

స్వభావ మేకే కవయో వదంతి - కాలం తథాన్యే పరిముహ్యమానాః
దేవస్యైష మహిమా తు లోకే - యేనేదం భ్రామ్యతే బ్రహ్మ చక్రమ్॥

అని శ్వేతాశ్వతరోపనిషత్తు చెప్పినట్లు ఈ 'భ్రమణం' అంతా దేవ సంకల్పమే అనే భావన బలపడింది. ఇక దొంగలు వచ్చినా దోచేదేముంది? అంగవస్త్రం తప్ప. అదీ దోచితే దిగంబరత్వం. చంపితే చిదంబరత్వం వదలితే మృత్యుంజయత్వం.

...కంకరరోడ్డు మీద నడక ప్రారంభించారు. ఎటు? ఆ ప్రశ్న ఈ జన్మలోకి వచ్చినపుడే తెలియదు. ఇప్పుడెందుకు? ఏదో ఒక దారి. గోదారి. అన్నట్లు ఎటూ గోదారి గట్టేగదా తాను తిరుగుతున్నది. ఇంతలో ఒక గుర్రపుబండి వచ్చివారికి ముందుగా ఆగింది. దానిలో ఉన్న ఒక అపరిచిత వ్యక్తి వీరిని పిలిచి, "అయ్యా! శాస్త్రిగారూ! మీకోసం భీమవరం పొలిమేఅలో ఎదురుచూశాను. మీరు ఎంతకూ రాకపోతే ఇప్పుడు బయలుదేరి వెళ్తున్నాను. మీరే గదా నర్సాపురం సన్మానానికి వెళ్తున్న కవీశ్వరులు.... అయ్యో! దొంగలు దోచినట్లున్నారే? అయ్యయ్యో! ఇదంతా నా మూలంగా జరిగింది. మన్నించండి" అని బండి దిగి వారిని బండిలోకి ఎక్కించి తాను గూడా ఎక్కాడు. బండి బయలు దేరింది.

గురువుగారి మనస్సులో ఎన్నో స్పందనలు! వీడెవడు? నాకోసం ఎదురుచూడటం ఏమిటి? ఈ అంగవస్త్రంతో చీకటిలో నన్నెట్లా గుర్తుపట్టాడు? వేరే దొంగలా? ఏ దొంగకయిన ఇంక నా దగ్గర కోరేదేముంది?

"కౌపీనవంతః ఖలు భాగ్యవంతః" అన్నట్లు ఇపుడు నా దగ్గఱనున్న భాగ్యము ఈ కౌపీనమే కదా!

వారి ఆలోచనలకు అడ్డుకట్టవేస్తూ ఆ వ్యక్తి వారిని చాలా విషయాల మీద ప్రశ్నలు వేశారు. ప్రధానంగా "దైవం ఎక్కువా? పురుషకారం ఎక్కువా?" అన్న విషయాన్ని చర్చించారు. "దైవమే నిర్ణయశక్తి" అని గురువుగారు తీర్మానించారు. శ్రీగురుచరిత కావ్యంలో మహోపదేశః అనే శీర్షిక మీద ఈ విషయాలు కావ్య ఫక్కిలో వర్ణించటం చూడవచ్చును. తేల్చి చెప్పిన సారాంశం ఇది.

విధిర్వా విభుర్వా పరా వా నిదానం-ఫలంవా కృతిర్వా తదాజ్ఞా విధేయః
హితార్థం ప్రయత్నాః శుభార్థం ప్రయాసాః-యథాభాగధేయం
ఫలిష్యంతి నూనమ్॥

విధి కాని ప్రభువుగానీ పరాశక్తిగానీ ఎవరో దైవశక్తి అన్నింటికి కారణము. పనిగాని ఫలితముగాని ఆ దైవాజ్ఞకు అనుకూలంగానే నడుస్తాయి. హితం కోసం చేసే ప్రయత్నాలు గాని శుభంకోసం పడే ప్రయాసలు కానీ "అదృష్టం" ఉన్నంత వఱకే ఫలిస్తాయి. కనుక అంతిమ నిర్ణయం అదృష్టానిదే.

ఈ నిర్ణయం విని ఆ వ్యక్తి కొంచెం సవ్యగర్వంగా అడిగాడు. అయితే తమను చంపటానికి ఎవరయినా మీదకువస్తే జడభరతుడిలాగా మౌనంగా అంగీకరిస్తారా, కనీసం పురుష ప్రయత్నంగానైనా పెనగులాడరా? అని ప్రశ్నించాడు.

పెనగులాడను. అది దైవేచ్ఛ అని అంగీకరిస్తాను. ఇప్పటికీ అంగవస్త్రంలో తిరుగు తున్నాను కదా! పైగా నీవు చెప్పిన జడభరతుడికి చావురాలేదు. దేవత రక్షించింది. మఱి వేటగాళ్ళు చంపాలనుకొన్న దైవం అన్యథా తలచబట్టేగదా అతను బ్రతికింది. అంతదాకా ఎందుకు? నీ నోటి నుంచి నీ వాదానికి వ్యతిరేకంగా ఉండే 'జడభారతుని' ఉపమానం వచ్చింది గదా! ఇదే దైవ ఘటన. ఒకమాట గూడా మన పురుషకారంతో రాలేరు గదా! దైవమే నిర్ణాయకశక్తి అన్నారు. ఈ విషయాన్ని "శ్రీగురుచరిత" కవి

"భరత శంకరదానవమానవః-పురుషయత్నహతా అపి రక్షితాః
విధి రహో బలవానితి మే మతిః-యదుపద్మమ తై రుపమాం భవాన్॥

అని వర్ణించాడు. అలాగా! అన్నాడు ఆ వ్యక్తి. తరువాత బండి ఆగింది. ఇద్దఱు దిగారు. బండి వెళ్ళింది.

"తావద్రథేన గంతవ్యం - యావద్రథపథి స్థితః
స్థాతా రథపథి స్థానం - రథ ముత్సృజ్య గచ్ఛతి॥

వదలి వెళ్ళడమే. మఱి యిక్కడ రథంతో పని అయింది. అందుకే ఆ వ్యక్తి రథం దింపి నడక సాగించారు. చుట్టు చిమ్మచీకటి. ఇద్దఱు మౌనంగా నడుస్తున్నారు. ఎంత దూరమో తెలియదు. కొంతసేపటికి పెద్ద చెట్టు - బహుశః మఱ్ఱిచెట్టు వచ్చింది. దట్టంగా ఉన్న ఆ చెట్టు క్రింద మఱీ చీకటిగా ఉంది. ప్రక్కన ఉండవలసిన ఆ వ్యక్తి కనబడలేదు. ఆశ్చర్యం! ఏమయి పోయినాడు. ఒళ్ళంతా శ్రమ దాహం. ఆకలి. సంధ్యావందనం పూజ లేకుండా నీరు గూడా తాగరు. మధ్యలో వాగు వచ్చింది. అయినా నీరు త్రాగలేదు. చెట్టు మీద నుంచి రెట్టలు పడుతున్నాయి. కప్పల బెకబెక. కీచురాళ్ళ హోరు. ఏవో సర్పాలు ప్రాకిపోతున్నట్లు జరజర చప్పుడు. ఇది కాదా? వల్లకాదా?

అంతలో చీకటి ముద్దలాగా ఉన్న ఒక నల్లటి ఆకారం ఆ చెట్టు ప్రక్కనుంచి గురువుగారి వద్దకు వస్తోంది. అంత చీకట్లోను నక్షత్రకాంతిలో మెరుస్తున్న పట్టాకత్తి. వీడెవడు? ఉగ్రకాపాలికుడా? నరహంతకుడా? దొంగల్లో ఒకడా? వాడు బిగ్గరగా నవ్వాడు. అయ్యవారూ! మా దేవికి నిన్ను బలియివ్వాలని వచ్చాను. మంచి బ్రాహ్మడివి దొరికావు. చివరి ప్రార్థన చేసికో! అని కత్తిని బండపైన నూరుతున్నాడు.

వారు ధ్యానించారు. ధ్యానంలో తన జీవితమంతా ఒక వలయం తిరిగింది. తన ఇల్లు తల్లిదండ్రులు, భార్య, పిల్లలు, శిష్యులు తమ ఆశ్రమసౌధం అన్ని ఒక్కసారి కళ్ళకు కట్టినట్టు కనబడ్డాయి. వెంటనే తన ఆరాధ్య దేవత బాలా సమేత లలితాంబిక సౌభాగ్యవిద్యేశ్వరి దర్శనం అయింది. వారు సమాధిలో ఉన్నారు. ఆ భీకరాకారుడు వచ్చాడు. కత్తి ఎత్తాడు. వీరు సిద్ధంగా ఉన్నారు. కాని చివఱి క్షణంలో ఆగి "బ్రతికిపోయావు ఫో..! మా అమ్మోరు నిన్ను బలిచేయవద్దని అన్నది" అని చీకట్లో కలిసిపోయినాడు.

బాగుంది ఈ రభస. బలికోరటం ఎందుకు? వద్దనటం ఎందుకు? ఎందుకయితే ఏమి? మఱల కనబడిన దారిన నడక మొదలు పెట్టారు.

కొంతదూరం పోయినారు. దూరంగా ఒక భవనం కనబడింది. విద్యుద్దీపాలతో వెలుగుతోంది. భవనం దగ్గరకు చేరారు. అర్ధకర్ణం గేటున్నది. లోపల బావి కనబడుతున్నది. గేటు తీసికొని వెళ్ళి బావి వద్ద స్నానం చేశారు. అర్ఘ్యప్రదానం గాయత్రి, చేశారు. మంచినీళ్ళు దోసిళ్ళతో త్రాగారు. అమృతంలాగా ఉన్నాయి. బావి దగ్గర నుంచి ఇవతలకు వచ్చారు. పరిశీలనగా చూచారు. తులసికోటవద్ద ఎవరో సుందరి పూజ చేసికొంటున్నది. అచ్చట నుంచి ఆమె తల ఎత్తకుండానే వీరితో అన్నది. "అయ్యా! దొంగలవల్ల చాలా మార్గాయాసం పడ్డట్లున్నారు. తమకు మడివస్త్రాలు సిద్ధంచేశాను. ఉండండి" అని తెచ్చి యిచ్చింది. వారు చూచారు. తొలిసారి తడిపి ఆరేసిన క్రొత్త వస్త్రాలు. ఆశ్చర్యం! సరే! అవి ధరించారు. ఆమె అనుష్ఠాన సామగ్రి అంతా సిద్ధం చేసింది. అనుష్ఠానం అయింది. తరువాత పండ్లు ఒలిచి యిచ్చింది. ఆరగించారు. ఇంటిలో విశ్రాంతికి "మంచం, ప్రక్క" సిద్ధం చేసింది. కాని వారు నిరాకరించారు. అప్పటికే తెల్లవారు జామున బ్రాహ్మీముహూర్తం వచ్చింది. వారికది ప్రాణాయామ సమయం. పైగా ఇతరుల 'ప్రక్క' మీద వారు పడుకోరు. ఈ నియమాలు చెప్పి, వారు దగ్గరలో ఉన్న ఒక కుర్చీలో కూర్చొని కళ్ళు మూసికొని ధ్యానం ప్రారంభించారు. ఆమె ఆ గదిలోంచి బయటకు వెళ్ళ బోతున్నట్లు వెళ్ళి తలుపు గడియవేసి వెనక్కుతిరిగి వచ్చి తటాలున వారి 'ఒడి' లో కూర్చొన్నది. వారు కళ్ళు తెఱచారు. పరిస్థితి అర్థమయింది. తాము బలాఢ్యులు. ఆమెను క్రిందకు విసరివేయగలరు. బుద్ధిపూర్వకంగా పరస్త్రీని తాకవలసియుంటుంది. పైగా దానివలన ఇంకేదయినా ప్రమాదం కలుగవచ్చును. అందువలన వెంటనే కుంభకప్రాణాయామంతో సర్వేంద్రియవృత్తులను శ్వాసతో సహా బంధించారు. నాడీ చలనము హృదయస్పందం ఆగింది. ఒళ్ళు చల్లబడింది. తెల్లబడింది. ఉలుకూ పలుకూ లేదు. ఆమెకు అనుమానం వచ్చింది. తన వంటి సుందరి ఒడిలో.

ఒంటరిగది. ఈ మహాత్మునిలో చలనం లేదేమిటి? అని వెనక్కు తిరిగి చూసింది శవాన్ని చూసినట్లున్నది. శివుణ్ణి చూసినట్లున్నది. ప్రమాదం పసికట్టింది. చటుక్కున ఒడి నుంచి లేచింది. కాళ్ళపై బడింది. గురువుగారు క్రమంగా సమాధి నుంచి బయటకు వచ్చారు. వారి వెనుకనున్న తెఱలనుంచి నల్గురు వ్యక్తులు - ఖడ్గధారులు వచ్చారు. ఆ కత్తులు అవతల పడవేసి క్షమాపణ వేడికొన్నారు.

అంతా తలతోక లేకుండా ఉంది. వీరెవరు? క్షమాపణ లెందుకు? అర్థంకాలేదు. మౌనంగా చూస్తున్నారు. అందులో పెద్దవాడు జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పాడు.

"అయ్యా! మేము ఈ ప్రాంతమున దారిదోపిడీలు జరిపించే దొంగల్లో దొరలం. రాత్రి తమను భీమవరంలో బస్సుస్టాండు నుంచి తెచ్చినది నేనే. చీకటి కనుక మీరు నన్ను గుర్తు పట్టలేదు. మీ ఒంటి మీద సొమ్ములకు ఆశపడి భీమవరం పొలిమేరలోని అడవిలో దోచుకొందామని బండి ఆశపెట్టి నడపించాను. కాని మీ వెంట నడుస్తుంటే నా ఒంటి మీద నిప్పులు పోస్తున్నట్లు అనుభూతి గలిగింది. ఇలాంటి అనుభూతి ఏ దోపిడీలోను కలగలేదు. కొంచెం భయం కలిగింది. అందుకే మీ సొమ్ములు మీ చేతే ఒలిపించి మూట కట్టించాము. ఆ సందర్భంలో మీ నిర్లిప్తత, ధైర్యం మొదలగు గుణాలు ఆశ్చర్యం కలిగించాయి. మీరు గొప్పవారేమోనని పరీక్షిస్తామనుకొన్నాను. మీ సొమ్ము కాజేస్తే మాకేమి చేటు ముడుతుందో అని సందేహం కల్గింది. నిజంగా గొప్పవారు కాకపోతే మాకు మంచిదే కదా! అని యీ పరీక్షలు చేశాము. తమను నిలువు దోపిడీ చేసినవాడు వీడు. బండిలో ఎక్కించికొన్నవాడు వాడు. తమను చంపటానికి ప్రయత్నించిన మహానటుడు అతడు. వీరందఱునా సోదరులు. ఈమె నా భార్య. తమను చంపరాదని శాసించిన సౌభాగ్యవతి యీమె. చివఱి పరీక్ష

పెట్టటానికి యీ దేవతనే బలవంతంగా ఒప్పించాము. ఇక్కడ మీరు పొరబడి ఉంటే ఈ పాటికి మా కత్తులకు బలి అయ్యేవారే. అందుకు సిద్ధంగా మేము విచ్చు కత్తులతో తెఱచాటున దాగి ఉన్నాము.

కాని, స్వామీ! తమ అచంచల నిష్ఠ ముందఱ మా సందేహ పర్వతాలు పటాపంచలయి పోయాయి. అంతేకాదు ఇక ఈ వృత్తి గూడా మాయం. తమరి ఉపాసనా శక్తిని చూచిగూడా మాకు పుణ్యాకాంక్షకలుగకపోతే మనుష్య జన్మ ఎత్తి ఉపయోగం ఏమిటి? అని నమస్కారం చేశారు. ఆ 'స్త్రీ' గూడా తమతప్పులను క్షమించి కాపాడమని కోరుకున్నది.

గురువుగారు అన్నారు

"గురుర్జగాద ప్రియవాక్య మేవం - త్వద్దర్శనం దుర్లభ మత్ర లబ్ధమ్।
విధిశ్చ యోత్రాద్భుతరూప ఆత్తః - ధియో మమాసీదగదంకరాభః॥

(శ్రీగురుచరితం)

అయ్యా! మీ దర్శనం నాకు మేలు చేసేదే. మీరు స్వీకరించిన యీ పరీక్ష నా మనస్సుకు మంచి చికిత్సగా అయింది. దీనివలన మనశ్శోధన జరిగింది.

"సర్వం చ తద్దంపతియుక్తచిత్తం - భుక్తం భవేదిత్యదపేవ వక్తి।
తమఃప్రభావః ప్రతిరోధిభావః - నివారితౌ పశ్యత లోకబంధుమ్॥

శ్రీగురుచరితం

పురాణ దంపతులు చేసిన సంకల్పమే మీ దంపతుల సంకల్పంగా నన్ను శోధించింది. చీకటి అజ్ఞానము - వీటి ప్రభావం నశించింది. లోక బంధువు అయిన జ్ఞాన సూర్యు డుదయించాడని వారిని సమాధానపరచారు. ఆ దొంగలు రాత్రి వారి వద్ద తీసికొన్న ఆభరణాల మూటను తిరిగి యిచ్చి

ఒక గుర్రపు బండి మీద వారిని సగౌరవంగా నర్సాపురంలో దించారు. వారు తిరిగి చందోలు వచ్చారు. శ్రీదేవమ్మగారి (అసలు పేరు పార్వతమ్మ గారు) నీరాజనాలు స్వీకరించారు.

ఈ కథలో చాలా ఆశ్చర్యాలు ఉన్నాయి దొంగలయినా వారు శాస్త్రీయంగా 'ధన ప్రాణ కామ' పరీక్షలు పెట్టారు. స్థూల సూక్ష్మ కారణ శరీరాలకు పరీక్ష పెట్టినట్లు, త్రిపుటిని శోధించినట్లు త్రివర్గాన్ని పట్టిచూపినట్లు త్రిపురాలను మథించినట్లు ఈ పరీక్షలు జరిగినవి. దొంగలకు భయం కలిగితే వారిని వదలిపోవచ్చును. వెంబడిపడి రాత్రంతా యీ పరీక్షలు ఎందుకు? మఱల ఆ దొంగల ప్రస్తావన వీరిజీవితంలో లేదు. ఇదంతా జగన్మోహిని నడపిన మహామాయ కాక మఱేమిటి? కనుకనే కంచి పరమాచార్యులు ఈ ఘట్టం గూర్చి "వనదుర్గా విలాసం" అన్నారని కొందఱు భక్తులు చెప్పారు. గురువుగారి జప ప్రార్థనలో గూడా ఈ 'వనదుర్గ' ప్రస్తావన రోజూ వస్తుంది.

"కాంతారాంతరసంచారి – కామేశ్వరగృహేశ్వరి।
జపేనానేన సుప్రీతా – ప్రసన్నా వరదా భవ॥"

ఈ "కాంతారాంతర సంచారి" ఆ వనదుర్గే కదా! ఆమె వారికి జీవన్ముక్తి ఇచ్చినట్లే కదా! ఈ కామ పరీక్ష జరుగుతుందనేది ఆగమ పురాణాల్లో గూడా ప్రసిద్ధమే. శంకరాచార్యుల వారి 'సౌందర్యలహరి' లో

"నరం వర్షీయాంసం నయనవిరసం నర్మసు జడం
తవాపాంగాలోకే పతిత మను ధావంతి శతశః।
గలద్వేణీబంధాః కుచకలశ విస్రస్త సిచయాః
హఠాత్త్రుట్యత్కాంచ్యో విగళిత దుకూలా యువతయః॥"

అని వ్రాశారు. యోగి ధ్యానంలో ఆజ్ఞాచక్రం ప్రవేశించేటప్పటికి అచ్చట స్త్రీవ్యూహం దర్శనమిస్తుంది. ఆ స్త్రీలు మన సినిమాతారామణులలాగ

విరబోసిన అందమయిన జుట్టుతో తొలగుతున్న పైటలతో, వక్షాలు పట్టు తప్పడంతో జారుతున్న చీరలతో కామోద్రేకం కలిగించేలా కనబడ్తారు. అక్కడ మనస్సు చలించిందా యోగి పని అంతే! మఱల ఎన్ని జన్మలు ఎత్తాలో. చలించక నిలబడితే సహస్రార పద్మవనంలోకి ప్రవేశించే అర్హత కలుగుతుంది. మఱియిప్పుడు మనస్సు చలించని వీరు ఆ అర్హత సంపాదించినట్లే గదా! కనుకనే దీనికి 'అగ్నిపరీక్ష' అని పేరు పెట్టారు రచయిత.

ఇతర చిన్న ఘట్టాలు:-

1. విజయవాడలో కృష్ణాస్నానమునకు వెళ్ళగా బందరులాకుల వద్ద ఒక అవధూత వంటి అపరిచిత వ్యక్తి వీరిని పిలచి దత్తాత్రేయ మంత్రమును ఉపదేశించి అదృశ్యమయ్యాడు.

2. నవరాత్రపూజలో పూజాకుంకుమరాశి మీద దేవీ పాదాంకితములు కనబడేవి.

3. బ్రహ్మానందయతీంద్రులు కలలో కనబడి హంసమంత్రము నుపదేశించారు.

4. దత్తాత్రేయుని స్వప్న దత్తానుమతితో "దత్తభాగవతం" అనే తెనుగు పురాణం వ్రాసి ప్రచురించారు. ఆ గ్రంథ రచన ప్రారంభించక ముందు ఒక కల వచ్చింది. అది గూడా తెలిసికోదగిందే. ఆ 'కల' ఇది.

వీరు భార్యాసమేతంగా తీర్థయాత్రలు చేస్తున్నారు. తీర్థయాత్రలో ఒక బ్రాహ్మణుని ఇంటికి వెళ్ళారు. ఆ బ్రాహ్మణుని భార్య ఉయ్యాలలో నున్న పసివానిని వీరి చేతికి ఇచ్చింది. ఆ పసివాడు వీరిని చూచి 'నవ్వటం' మొదలు పెట్టాడు. వీరికి సందేహం వచ్చి యీ పిల్లవాడు నన్ను చూచి

ఎందుకు నవ్వుతున్నాడు? అని ఆ స్త్రీని అడిగారు. "వీడి మీద పద్యాలు వ్రాస్తానని చెప్పి మీరు ఇంతవఱకు రాయలేదని" నవ్వుతున్నాడని చెప్పింది. అంతలోనే ఆ బాలుడు 3 తలలతో దత్తాత్రేయుని లాగా కనిపించాడు. కల చెదిరింది. వీరికి గుర్తు వచ్చింది. తను బ్రహ్మాండ పురాణాంతర్గతమయిన "దత్తమాహాత్మ్యం" అనే భాగాన్ని దత్త భాగవతంగా వ్రాయాలని సంకల్పించినట్లు, ఇంతవఱకు కార్యాంతరాల్లో పడి ఆ విషయం మొదలు పెట్టలేదని స్ఫురించింది. స్ఫురింపజేసినవారు అత్రి, అనసూయా దత్తాత్రేయులు. వారి గోత్రంలో ప్రవేశించిన తమకు గోత్రమూల పురుషులు కర్తవ్యాన్ని గుర్తుచేసి మఱీ జరిపించికొన్నారు.

5. ఇలాంటిదే మఱొక కల – అయితే ఇది "దత్త భాగవత" గ్రంథ రచన కొంత సాగిన తరువాత రచనా మధ్యంలో వచ్చింది.

ఈ కలలో వీరికి ఒక సిద్ధపురుషుడు కనబడ్డాడు. ఆయనతో సంవాదం జరిగింది. ఆ 'కల' ఇది.

ఒకనాడు ప్రొద్దున శాస్త్రిగారు దంతధావనం చేసికొంటున్నారు.ఒక దిగంబరాకారుడు – బంగారు ఛాయ – వారి వద్దకు వచ్చి కూర్చొన్నాడు. దంతధావనం పూర్తయిన తర్వాత వీరు ఆ దిగంబరవ్యక్తి వైపు తిరిగారు. అతని ముఖం చాలా ప్రకాశవంతంగా ఉంది. అతనితో పాటు ఒక వ్యక్తి ఉన్నాడు. ఆ వ్యక్తి చేతిలో ఒక పుస్తకం ఉంది. వీరికి దిగంబర వ్యక్తికి మధ్య సంభాషణ మొదలయింది.

దిగంబర వ్యక్తి : ఏమయ్యా! నీవు మంచి స్థితప్రజ్ఞుడవు. కాని నీ మొహంలో ఏదో పరధ్యాస కనబడ్తున్నది. నేను ఇందాకటి నుంచి చెబుతున్నది నీవు అసలు వింటున్నట్లు లేదు.

గురువుగారు : ఏమి చెప్పమంటారు స్వామీ! సంసారంలో అనేక విక్షేపాలు. వాటివలన చిత్తవికారం. ఇంతకు ముందే నా పినతండ్రి వచ్చి ఏవో గృహకల్లోలాలు వినిపించాడు. ఆయనటు పోయా పోక ముందే ఒక ముసలిది వచ్చింది. '2' చినిగిన తాటాకు బుట్టలు తెచ్చింది. ఒక దానిని ఊడదీసి రెండవ దానిని ఆ ఆకులతో కాస్త గట్టిగా అల్లి పెట్టమంది. ఎంతకాదన్నా వెంబడిపడి వేధించింది. సరే! చివఱకు ఒక బుట్టలో మఱొక బుట్ట అమర్చి ఆమెను వదిలించికొన్నాను.

అంతలోనే 'మా అత్తగారు' ఇలాంటి పనులు అయనచేత చేయించవచ్చునా? అని ఆ ముసలిదానిని కసిరి కొట్టింది. వీరినందఱిని తప్పించికొని బయటకు బయలు దేఱాను. వైరాగ్యం, నిర్వేదం, కలిగాయి. సన్యాస వాంఛ కలిగింది. అపుడే మా "పినతల్లి" వచ్చి ఏదేదో చెప్పింది. ఆమె మాటలు వింటుంటే కాస్త మనస్సు తేటపడింది. ఏదో సాంఖ్యం అని, యోగం అని చెప్పింది. సంసారంలో చిక్కుపడిన నాకు ఈ యోగాలు సాంఖ్యాలు కుదురుతాయా? అని మనస్సు వికలంగా పరధ్యానంగా ఉంది.

ది.వ్య : నాయనా! ఏది ఎటుపోయినా విచారం మాని నీ కర్తవ్యం నీవు నిర్వహించుకో. "నీవు మా జనకుని" వలెనుండాలి.

గు. : అయ్యా నేను "ఉమాజనకుని" (హిమవంతుడు) వలె స్థిరంగా ఉన్నాను. "మా జనకుని" (సముద్రం) వలె గంభీరంగా ఉన్నాను. "జనకుని" వలె ధైర్యంగా ఉన్నాను. కాని "ప్రకృతి" మహాబలురాలు. క్షణంలో నన్ను అటు ఇటు లాగుతున్నది. అది సరే! స్వామీ మీ మెడలోని ఆభరణం ఏది?

ది.వ్య. : ఆ ఆభరణాన్ని మునుపు ఒక పిచ్చి కుక్కకు ఇచ్చాను.

గు. : ఆ పిచ్చి కుక్క ఏమయింది స్వామీ!

ద.వ్య. : దాని పిచ్చి కుదిరి ఎటో పోయింది.

గు. : అట్లయితే ఆ ఆభరణం నాకు ప్రసాదించండి.

ద.వ్య. : నీ కీయవలసిన ఆభరణం నీ పినతల్లి ఇచ్చింది గదా! నీ కిది ఎందుకు?

గు. : ఆమె చెప్పిన మాటలు అనుభవానికి రావటం లేదు. మరి ఏమిగతి?

ద.వ్య. : అయ్యా! అభ్యాసం చేయాలి. మనస్సు చంచలం. అభ్యాసంతో చాంచల్యం పోగొట్టాలి. సంకల్ప పరంపర రానీయవద్దు. నీవు అసలే సన్యాసివి, శాస్త్రం చదివావు. పినతల్లి ఉపదేశాలు లభించినాయి. ఇపుడు నా మాటలు దొరికినాయి. నిదిధ్యాసతో ముందుకుపో. ఈశ్వరుడు నీకు అభిముఖంగా ఉన్నాడు. ప్రాణాయామ సాధనతో 'సిద్ధి' లభిస్తుంది. నీ భావన నాకు తెలుసు. అర్జునుడు వాసుదేవుని కొఱకు పోవలసిన అవసరం నిజంగా లేదు. నిజముగా తాను అర్జునుడే అయినచో వాసుదేవుడు అభిముఖంగా రావాలిగదా – అని నీ భావన. అది నిజమే. అట్లే భావించిచూడు. సవికల్ప సమాధి నిర్వికల్ప సమాధి కాగా. ఆత్మానుభవం సంపన్నం అవుతుంది.

ఈ సంభాషణ అంతా వింటున్న "పుస్తకం వ్యక్తి" గూడా "నాయనా! ఈ ధత్తాత్రేయ స్వామి బోధవలన నీకు ఆవదలు పోయి శుభంకలుగుతుందని," దీవించాడు. గురువుగారు స్వామి పాదములు తాకి నమస్కరించిరి. నిద్ర చెడింది. అంతా స్వప్నం.

ఈ స్వప్న వృత్తాంతాన్ని తమ సహధర్మచారిణికి వివరించారు. ఇందులో 'మర్మం' ఏమిటి అని ఆమె అడిగారు? పార్వతి ప్రశ్నించిన మీదట

పరమేశ్వరుడు అనేక తంత్ర రహస్యాలు చెప్పినట్లు మనం విం‌ంటాం. అలానే ఈ పార్వతమ్మ గారు (గురుపత్ని) అడిగిన మీదట ఈ పరమేశ్వరుడు (గురువుగారు) తమ స్వప్నతంత్రాన్ని మర్మాలను వివరించారు. ఆ వివరణ ఇది.

ధర్మపత్ని కోరిక మేఱకు తమ దివ్య స్వప్నమును వారే వివరించారు.

"పినతల్లి నా ఉపాస్య దేవత బాలాత్రిపుర సుందరి. బట్టలు అల్లమని వచ్చిన ముసలిది "ప్రవృత్తి" అత్తగారి రూపంలో కనబడిన ఆమె "నివృత్తి". పిచ్చి కుక్క పేరుతో చెప్పబడినది "అలర్కుడను" రాజు. సొమ్ము "జ్ఞానము" లేదా జ్ఞానోపదేశము కావచ్చును. వచ్చిన స్వామి దత్తాత్రేయుడు. స్వామి 'మా జనకుని' వలె ఉందనుకున్నాడు. "మా జనకుడు" అంటే "అత్రి మహర్షి" కావచ్చును. 'అత్రి' అంటే "త్రిపుటికి" అనగా "నీవు, నేను, వాడు" లేదా "ద్రష్ట దృశ్యము దర్శనం" వంటి అనేక త్రయతత్త్వములకు అతీతంగా బ్రహ్మరూపంలో ఉండే మహర్షి కనుక అత్రిగా అత్రిమహర్షి వలె ఉండమని బోధించినట్లు అనిపిస్తున్నది- అని వారు సెలవిచ్చారు.

అయితే బట్టల గూర్చి, పుస్తకధారి అయిన సహచర వ్యక్తి గూర్చి వివరణము గ్రంథస్థం కాలేదు. ఆ సహచర వ్యక్తి శ్రీ తాడేపల్లి వెంకటప్పయ్యశాస్త్రి గారే అయియుండ వచ్చునని "దత్త భాగవతాద్వైత" గ్రంథరచయిత శ్రీ నోరి భోగీశ్వరశర్మగారు అభిప్రాయ పడినారు కావచ్చును. లేదా, గురువుగారు 'దత్తభాగవతగ్రంథరచన' లో ఉండగా అందుకు స్ఫోరకముగా ఆ దత్తభాగవత మూలకర్త అయిన వ్యాసుడు 'దత్తమాహాత్మ్యము' చేత పట్టుకొని "దత్త బోధచే ఆపదలు గడచి నీకు శుభమగు" నని దీవించియుండును. వీరికి జీవిత చరమ సంవత్సరాలలో మఱొక స్వప్నం వచ్చింది. ఆ స్వప్నం పెద్దకావ్యం అయింది. అదే "మత్స్వప్నః" అనుపేర ప్రచురణ అయింది. ఆత్మజ్యోతి పాఠకులకు

అదిగూడా "సీరియల్"గా వస్తున్నదే. అందులో "వ్యాస మహర్షి" ఒక పాత్ర. కనుక పై కలలో వచ్చినది. "వ్యాస మహర్షి" కావచ్చును.

ఇక కథలో బుట్టల సంగతి, అది వారు వివరించలేదు. అయితే మునలమ్మ "ప్రవృత్తి" కనుక "బుట్టలు వారి జీవితము" కావచ్చును. సంసారచ్ఛిద్రములతో నిండిన జీవితమే ఆ రెండు బుట్టలు. ఆ రెంటిని కలిపినను ఏదో కష్టసుఖముల మిశ్రమంగానే జీవితం నడుస్తుంది. అంటే కష్టాలవలన సుఖాలకు ఛిద్రాలు. సుఖాలవలన కష్టాలకు ఛిద్రాలు. ఈ కష్టసుఖాలు కలగలిస్తేనే జీవితం. అదే ప్రవృత్తి స్వభావం. అలా బ్రతకటమే ప్రవృత్తి స్వరూపం. ద్వంద్వం లేని ప్రవృత్తి లేదు. అదే 'ప్రవృత్తి' దేవత సూచన. ఇదంతా ఉదంక మహర్షి కథలాగా వింతగా ఉంది. ఇక 'నివృత్తి' వారి అత్తగారు. అంటే 'జ్ఞానబుద్ధిని' ఆ జీవునకు ఇచ్చిన తల్లి అయి యుండును. ఈ విధంగా కష్టసుఖమయ మయిన ప్రవృత్తి మార్గంలో ఉండమని వారికి చెప్పటం "నివృత్తి" కి నచ్చలేదు. కనుక ప్రవృత్తిని ఆవలకు తోసింది. తరువాతనే వారికి సన్యాస బుద్ధి పుట్టింది కలలో. అపుడు వచ్చింది "పినతల్లి" ఆదిగురువు. యోగసాంఖ్యాలు ఉపదేశించింది. అయినా వారి మనస్సు పూర్తిగా సమాధానపడలేదు. సాక్షాత్తు త్రిగుణాతీత పరబ్రహ్మమే వచ్చి 'బోధ' చేసింది దత్తరూపంలో. అపుడు మనస్సు తేటపడింది. దత్తబోధతో ఆపదలు అంటే సంసార కష్టాలు తొలగుతాయి అంటే మనస్సుకు తాకవు అని పుస్తకవ్యక్తి (వ్యాసుని) బోధ. అంటే దత్తభాగవతం వ్రాయటం ద్వారా దత్తబోధలు మననం చేయమని పుస్తక హస్తుని అనుదేశం. అభ్యనుజ్ఞ. ఇక అలర్కుని సంగతి చూద్దాం.

అలర్కః = అంటే పిచ్చికుక్క అని అర్థము. దత్తభాగవతంలో 'మదాలస' అను వేదాంత యోగిని అయిన రాజమాత ప్రస్తావన వస్తుంది. ఆమె

తన యిద్దరి పిల్లలకు జోలపాట లోనే వేదాంతం నూరిపోసింది. వారు ప్రహ్లాదునివలె పుట్టు వైరాగ్యంతోనే రాజ్య పరిత్యాగం చేసి జ్ఞానమార్గంలో వెళ్లారు. తృతీయ పుత్రుడు "అలర్కుడు". వీటికి గూడా జోలపాటలో వేదాంతం మొదలయింది. రాజుకు అంటే మదాలస భర్తకు అర్థమయింది. తన పుత్రులు విరక్తులయి సన్యసించి వారలంగా ఎందుకు పరివ్రాజకులయినారో తెలిసింది. ఈ పిల్లవానినయినా తనకు వదలమని మదాలసను ప్రార్థించాడు. ఆమె అంగీకరించింది. అందువలన వాడు అలర్కుడయినాడు. అంటే సంసారపు "పిచ్చికుక్క" అయినాడు. వేదాంతుల దృష్టిలో సంసారి పిచ్చివాడుగా కనబడ్తాడు. సంసారుల దృష్టిలో వేదాంతి పిచ్చివాడుగా కనబడ్తాడు.

"జడోన్మత్త పిశాచవత్"

ఈ అలర్కుడు చివరకు మదాలస సందేశం తోను, దత్తస్వామి బోధతోను 'జ్ఞాని' అవుతాడు. కనుక దత్తస్వామి మెడలో ఉన్న అభయం ఈ "బోధ". అది అలర్కునికి ఇంతకు ముందే చెందింది. వాడు జ్ఞాని అయి ఎటో వెళ్ళాడు. అంటే దిక్కులు తెలియని చోటుకు. అంటే దేశకాల పరిచ్ఛేదాలు లేని గమ్యాన్ని చేరుకొన్నాడని స్వప్నంలో దత్తస్వామి మాటలకు అర్థం అయియుండవచ్చును.

ఈ విధంగా దేవతలు స్వప్నసందేశముతో గూడా వారి జీవితాన్ని తీర్చిదిద్దారు. వారి సందేహాలను తీర్చిదిద్దిన స్వప్నం "మత్స్యస్వప్న". అది గ్రంథంలోనే చదవాల్సిన విషయం.

అణువులో క్షణములో అన్నింటి గమనించి
నడపించు "నడిలేని నడక" వారు,
తలచుటకే యైన 'తతి' యూక 'దతి' రాక
అందక చరియించు నట్టివారు

తమ కాలిదువ్వకై తహతహలాడెడి
మన మొగమ్ముల చూడ మఱచువారు
తగినట్టి తగులంబు తగిలినంతనె వెల్గు
"తేజోలతల" వోలె తేలువారు
కలలలోన సమాధిలో గనుల యెదుట
వెంటబడి కానబడి ప్రేమ వీపు నిమితి,
నా గురుని తత్త్వపథమున నడపుటీఱు
చూడ నా కంట, గన్నీరు జాలువాఱు.

(భావనా బృందావనం నుంచి)

6. మొదట్లో వీరు సోహంభావంతో దేవీన్యాసం కారణంగా తన శరీరమునే దేవీ పీఠంగా భావించి తమ తలపైననే పూజచేసికొనేవారు. కాని "దేవి" అంబికాశిలపెట్టి దానికే పూజచేయమని ఆనతిచ్చింది. తరువాత "పంచాయతనం" పెట్టి పూజించమని ఆదేశించింది. ఆవిధంగా తన భక్తుని స్మార్తపూజా విధానం లోనికి మళ్లించింది.

7. నవరాత్రులలో పూజావిధానం విస్తృతంగా ఉంటుంది. చాలా కొబ్బరికాయలు కొట్తారు. కొబ్బరి చిప్పలు నైవేద్యానికి అలానే పెట్తారు. అయితే ఒకరోజు అమ్మవారు కలలో కనబడింది. ఆమె పెదవులు నెత్తురు కారుతున్నవి. అదేమిటని అడిగారు గురువుగారు. అమె అన్నది "ఏం చేస్తాను? నీవు పెట్టే కొబ్బరి చిప్పలు పీక్కొని తినటం వలన ఇలా అయినది" అని. ఆనాటి నుండి ఎన్ని కొబ్బరి కాయలయినా వలిచి పెట్టవలసిందే. అంటే నైవేద్యంలో ఉన్న ఒకానొక శ్రద్ధాలోపాన్ని దేవి పట్టిచూపి తన భక్తునకు మార్గదర్శనం చేసిందని గదా! దీని అర్థము.

8. ఇంట్లో పూజకు కొన్ని సువర్ణ పుష్పాలుండేవి. నవరాత్రులలో విశేషపూజలు కనుక మామూలు పుష్పాలు విరివిగా వాడేవారు. వీటితో

బాటు కలిపితే సువర్ణ పుష్పాలు నిర్మాల్యంలో కల్సి పోతాయని ఆ పూలు దాచి పెట్టారు. రాత్రికలలో కనబడి దేవి "బంగారు పూలు దాచి పెట్టుకొన్నారేమి" అని అడిగింది. అంటే మఱల 'జాగ్రత్త' అనేపేరుతో ఉన్న 'శ్రద్ధాలోపాన్ని' సవరించిందన్న మాట.

9. "సీనారేకుపెట్టె" ఒకటి ఉండేది. అంటే పెట్రోమాక్సులైటు వత్తుల పెట్టెలాంటిది. అదేవారి "బ్యాంకు". ఈ పెట్టె పూజామందిరంలో దేవీ పీఠం క్రింద ఉండేది. ఎంత డబ్బు వచ్చినా దాన్లో ఉంచి వాడుతుండే వారు. "ఏ అవసరం వచ్చినా ఆ సీనారేకు పెట్టె తీసికొనిరా" అని గురుపత్నిని అడిగేవారు. దేవి అనుగ్రహంతో ఆ పెట్టెలో తమకు కావలసిన డబ్బు ఏదోవిధంగా సమకూడేది.

10. ఒకసారి శృంగేరీస్వామివారు చందోలు వస్తామని స్వయంగా కబురు చేశారు. కాని వారి భిక్షకు కావలసిన డబ్బు వీరి వద్ద లేదు. స్వాములవారిని రావద్దని చెప్పగలరా! రమ్మన్నారు. స్వాములవారు వచ్చారు. గురువుగారు తమపైన ఉన్న చిరుగుల కొల్లాయిగుడ్డ క్రిందపఱచారు. భిక్షకు సహాయంగా దాతలను తమ ఇష్టం వచ్చింది దాన్లో వేయమన్నారు. భిక్షకు కావలసినదానికన్న ఎక్కువ వసూలయింది. ఆ కొల్లాయిలోనే అదంతా మూటగట్టి స్వామివారికి సమర్పించారు. జరిగిన ఘట్టం పూర్తిగా గ్రహించిన స్వామివారు నవ్వుతూ "శాస్త్రిగారూ! ఈ పైకం వద్దు. ఆ కొల్లాయి గుడ్డ ఇవ్వండి చాలు! దానిలో ఏదో మహిమ ఉంది" అని చమత్కరించారు.

11. ఒకసారి గురువుగారికి బాగా రక్త విరోచనాలు అయినవి. ఒళ్ళు పట్టు తప్పింది. ఈ పరిస్థితిలో ఒక అశరీరవాణి వినబడినది. "ప్రాణాయామానికి వేళ అయింది లే" అని. మాట్లాడినవారు ఎవరు? అక్కడ ఎవరూ లేరు. అంబపలుకే అనుకొన్నారు. యోగం పూర్తి చేశారు.

చివరలో దేవిని ఒక కోరిక కోరారు. ప్రారబ్ధం అనుభవిస్తాను. కాని అనుష్ఠానాదులకు ఆటంకం కాకుండా తక్కువ తీవ్రతతో ఎక్కువ రోజులు అనుభవిస్తాను అని. అదే ప్రకారం ఆ రక్త విరోచనాలు 45 రోజులు రోజుకు 3సార్లు జరిగి ఆ బాధ ఉపశమించినది.

"ఏతదేవ పరమం తపో యద్ వ్యాహితః తప్యతే" బృహదారణ్యకమ్.

వ్యాధిలో ఉండి గూడా ఎవడు తపస్సు కొనసాగిస్తాడో అదే గొప్పతపస్సు అని. పంచాగ్ని మధ్యంలో తపస్సు అంటే పంచాగ్నులు మనం సంపాదించికొన్నవి. కాని **శరీరంలో వ్యాధి మనసులో** ఆధి ఇవి ప్రారబ్ధకల్పితాలు. బాగా బాధాకరాలు. ప్రమాదకరాలు. అయినా మనస్సు విక్షేపం చెందకుండా అప్పుడు గూడా తపస్సు చేయటం అనేది గొప్ప తపస్సు. అదే "పరమం తపః" అన్నది ఉపనిషత్తు. "అధి+ఆత్మకత-ఆధ్యాత్మికత" కలిస్తే పెద్ద తపస్సు అన్నమాట!

12. నేను వారివద్ద చదువుకు చేరిన క్రొత్త రోజులు అవి. వారు తెల్లవారుజామున ప్రాణాయామం పూర్తిచేశారు. ప్రార్థన అయిపోయింది. తరువాత ఇంటి విషయాలు ఆలోచిస్తూ 2, 3 రోజులలో తెనాలి వెళ్లి కొంతకాలం ఉండాలి అని మనస్సులో అనుకొన్నారు. అంతలో వారికి ఒక రమణీయ స్వరం వినబడింది "16 రో॥ పండుగ తర్వాత వెళ్ళవు గాని" అని.

ఎవరికి 16 రో॥ పండుగ. ఎవరి పెళ్లి ప్రస్తావన లేదే? ఏమిటి ఈ సలహా! అని అనుకొన్నారు. యథావిధిగా మేడదిగివచ్చి వాకిట్లో 'నారింజ చెట్టు' వద్ద దంతధావనం చేస్తున్నారు. అప్పుడే ఉప్పులూరి నుంచి ఒక బ్రాహ్మణుడు వారి దర్శనానికి వచ్చాడు. ఆయన పేరు తూములూరు వెంకటరామశాస్త్రిగారు. ఆయన వచ్చి తన పరిచయం

చేసికొని గురువుగారి దౌహిత్రుడు చెరువు సత్యనారాయణ శాస్త్రిగారికి పిల్లను ఇవ్వవలెనని వచ్చినట్లు చెప్పారు. దేవి సూచన అప్పుడు అర్థమయింది. ఇక పెళ్లిచూపులు లాంఛనాలు చేసి, వెంటనే 'నెల' లోపల పెండ్లి అయింది. 16 రోజుల పండుగ తర్వాతనే తెనాలియాత్ర జరిగింది.

13. ఒకసారి వీరు రాంభొట్లపాలెం వైపు రోడ్డు మీద నడిచి వెళ్తున్నారు. ఎదురుగా వంతెన మీద నుంచి దూరముగా ఒక నల్లని ఆకారము భీకరముగా మీదకు వస్తున్నట్లు కనబడింది. కనుక మాటికొని అచ్చటనే కూలబడ్డారు. అప్పుడే వారి వెనుక వైపునుంచి అశ్వారూఢలయిన 4, 5 గురు స్త్రీలు ఆ భీకరాకారము వైపు దూకిపోయినట్లు కనిపించారు. ఆ ఆకారము వెనుదిరిగి పారిపోయింది. ఆ వెంటనే వీరికి స్వస్థత చిక్కింది. తరువాత కొన్నాళ్లకు తెలిసింది. ఎవరో వీరిపై ప్రయోగం చేసినట్లు చేసిన వారు ఆ క్షణముననే మరణించినట్లు. లలితాసహస్రనామంలో ఒక శ్లోకం ఉన్నది.

శ్లో॥ యోవాభిచారం కురుతే నామ సాహస్రపాఠకే
నివర్త్య తత్క్రియాం హన్యాత్ తం వై ప్రత్యంగిరా స్వయమ్॥

లలితాసహస్రనామం జపించే వారి మీద ఎవరయినా ప్రయోగం చేస్తే ప్రత్యంగిరాదేవి ఆ ప్రయోగాన్ని తానే త్రిప్పి కొట్టి చేసిన వానిని సంహరిస్తుందిట. అథర్వణమంత్ర విధానంలో భద్రకాళికి "ప్రత్యంగిర" అని పేరు. అలాగే అమ్మవారి అనుచరగణంలో "అశ్వారూఢ" శక్తులున్నారు.

"అశ్వారూఢాధిష్ఠితాశ్వ కోటి కోటిభి రావృతా" అని లలితానామము. **"ప్రత్యంగిరా"** ప్రభావంతో అశ్వారూఢాశక్తులు గురువుగారిపై

ప్రయోగించిన శక్తిని త్రిప్పి ప్రయోక్తను సంహరించినట్లు భావించవచ్చును. దీనినిబట్టి 'లలితా సహస్రనామ' ప్రభావానికి ప్రత్యక్షోదాహరణం లభించింది.

14. బ్రా॥వే॥ మద్దులపల్లి మాణిక్యశాస్త్రులవారు ప్రస్తుతం సుప్రసిద్ధులయిన షడ్దర్శన పండితులు. వారు చందోలు వచ్చి గురువుగారి సన్నిధానంలో 'బ్రహ్మసత్రం' నిర్వహించారు. వారు రాబోయే ముందురోజు గురువుగారికి దేవి ఇచ్చిన సలహా ఏమంటే,

"శాస్త్ర వాదంపై కాకుండా తత్త్వం పై దృష్టి పెట్టు" అని. కౌషీతక బ్రాహ్మణంలో ఇలాంటి సందేశం ఉన్నది.

న వాచం విజిజ్ఞాసీత వక్తారం విద్యాత్
న గంధం విజిఘ్రాసీత ఘ్రాతారం విద్యాత్
న రూపం విజిజ్ఞాసీత రూపవిదం విద్యాత్

అంటే "వాక్కును గురించి గంధం గురించి రూపం గురించి పట్టించుకోవద్దు. అవి మాయా విలాసములు. వాటి వెనుకనున్న "ఆత్మతత్త్వం" శాశ్వతం. దానిని గ్రహించు అని అర్థము. భగవాన్ "రమణమహర్షి" గూడా "నేను" అనే భావనకు మూలాన్ని అన్వేషించ మన్నారు. అలానే శాస్త్రంలో వాద వైఖరి గాక ప్రతిపాదించదలచిన తత్త్వమేదో తెలిసికొమ్మని జగన్మాత ఉపదేశము.

15. నాకు వారిదగ్గర చదువుకొనే రోజులలో పెద్దమ్మవారు పోసింది. 15 రోజులలో తగ్గుతున్నట్లే తగ్గి మఱల తిరుగ బెట్టింది. గురువుగారి వద్దనే ఉన్నాను. వారు రోజూ సుదర్శన మంత్రంతో నన్ను రాత్రిపూట అభిమంత్రించేవారు. తరువాత నేను నిద్రపోయేవాడిని. రోగం తగ్గటానికి ముందురోజున నాకు ఒక కల వచ్చింది. ఎవరో గురువుగారి

కోసం వచ్చారు. నన్ను అడిగారు. నేను వాళ్ళను గురువుగారి దగ్గఱకు తేవటానికి బయటికి వచ్చాను. చంద్రమండలం నుంచి నా మీదకు "బ్యాటరీ లైటు ఫోకస్" లాగా కాంతి పడుతున్నది. నేను తటిసిపోతానని అటు ఇటు గెంతుతున్నాను. కాని ఆ 'ఫోకస్' నన్ను వదలలేదు. నా మీదకు గురిగా పడుతున్నది. తరువాత మెలకువవచ్చింది. మఱునాడు గురువుగారితో కల వచ్చినట్లు వివరించాను. అయితే నీ రోగం ఇక తగ్గిపోతుంది అన్నారు. సుదర్శన మంత్రార్థం ఏమంటే విష్ణుశక్తి "విషూచిక" ను హిమాలయం మీదకు వెళ్ళగొట్టుందని, చంద్రమండలం నుంచి విషూచీదగ్ధ జీవునిపై అమృతం కురుస్తుందని. ఇందులో నాకు రెండవ అనుభూతి కలిగింది. ఈ విషయమే శ్రీ గురుచరితంలో కవి

"ఆవృత్తమంత్ర మహిమేరిత విష్ణుశక్తి
యోగాద్గురుః ద్విగుణితాం హి విషూచికాం మే,
నిష్కాసయన్ హిమగిరిం ప్రతి, మా మవృష్యత్
స్వప్నే ప్రపన్మయి సుధాం తుహినాంశుబింబః" అని చెప్పుకోవటం జరిగింది.

16. గురువుగారి తమ్ముని కుమారుడు చిన్నప్పుడు ఉబ్బసంతో బాధపడేవాడు. చాలాకాలం వఱకు తగ్గలేదు. "చదువు, పెండ్లి" అన్నింటికి ఇది ఆటంకం అయింది. వాళ్ళ బాధ్యత వీరిపైనే ఉంది. ఉమ్మడి కుటుంబం. ఒక రోజున సంప్రజ్ఞాత సమాధిలో దేవిని దర్శించి అతని జబ్బు తగ్గించమని, తప్పనిసరి అయితే 60 ఏండ్ల తరువాత అనుభవింప చేయమని ప్రార్థించారు. ఆమె అంగీకరించింది. అంటే నాటి నుంచి నేటి వఱకు ఉబ్బసం లేదు.

"అనఘాద్భుత చారిత్రా వాంఛితార్థ ప్రదాయినీ" కదా! దేవి.

17. ఇవే కాక అనేకమందికి పిశాచ విమోచనాలు చేశారు. భూతావాసంగా మారిన గృహాలను భూత నిర్ముక్తం చేశారు. తాడికొండలో ఒక భూతగృహాన్ని అలాగే విముక్తం చేశారు.

తాడికొండలో పడమటి వీధిలో ఒక వేద పాఠశాల ఉండేది. దానిలో దయ్యం ఉన్నదని, రాత్రిపూట అచ్చట ఉన్నవారు ఎవ్వరును బ్రతికి బట్టకట్టరని వదంతి గూడా ఉంది. రాత్రి దాక అచ్చట వేదపాఠం జరుగుతుండేది. తరువాత గురువు, విద్యార్థులు ఎవరిదారిన వారు వెళ్తారు. అదీ పరిస్థితి. ఒకరోజు రాత్రి శ్రీ శాస్త్రిగారు ఆ వేదపండితునితో మాట్లాడాలని అక్కడకు వెళ్ళారు. ఆయన పాఠ ప్రవచనంలో ఉన్నాడు. అందుకని కాసేపు నిదానించారు. బాగా కునుకు పట్టింది. ఆ వేద పండితుడు వీరిని గమనించలేదు. తలుపు గొళ్ళెం పెట్టి ఎవరిదారిన వారు వెళ్ళారు. వీరు గాఢనిద్రలో ఉన్నారు. అర్ధరాత్రి వేళకు ఒక స్త్రీ జుట్టు విరబోసుకొని వీరి వద్దకు వచ్చింది. తట్టి లేపింది. నీ వెవరు అన్నారు. తాను ఆ యింటి యజమానురాలినన్నది. మీద మీదకు వస్తున్నది. వీరికి ఇది 'దయ్యపు కొంప' అనే విషయం గుర్తుకు వచ్చింది. గాయత్రీ జపం తనంతతానుగా సాగటం మొదలు పెట్టింది. ఆ మంత్రం మానేయమని ఆమె కేకలు వేసింది. అట్లా ఆ రాత్రి గడిపారు. ఆ దయ్యం అదృశ్యం అయిపోయింది. తెల్లవారిన తరువాత ఈ జరిగిన సంగతి విన్న ఊరంతా ఆశ్చర్యపోయారు. నిజంగానే ఆ యింటి యజమానురాలు అర్ధాంతరపు చావు చచ్చిందట.

18. ఒకసారి చందోలులో వారి యింట్లో దొంగతనం జరిగింది. దేవీ సేవకు ఉపయోగించే వెండి వస్తువులు, ఇంట్లో స్త్రీల ఆభరణాలు పోయినవి. వారు పోలీసు రిపోర్టు ఇవ్వలేదు. మౌనంగా ఆ విషయాన్ని వదిలేశారు.

తరువాత ఆ విషయం పోలీసులకు తెలిసింది. వారిని రిపోర్టు ఇవ్వమని గట్టిగా అడిగారు. వీరు 'అక్కర్లేదు' అన్నారు. దొంగలు తప్పు చేశారు. వారికి శిక్ష పడాలి గదా! వారికి శిక్ష లేకుండా తప్పించవలసినదే అది అధర్మం కదా! అని పోలీసువారి ప్రశ్న. దానికి వారు చెప్పినదాని సారాంశం నాకు గుర్తున్నంత వరకు వ్రాస్తాను.

పూర్వం నవరాత్రి సమయాల్లో దొంగతనానికి ప్రయత్నం జరిగితే దేవి స్వయంగా ఆ ప్రయత్నాన్ని అడ్డుకొన్నది. ఇప్పుడు అలా జరగలేదంటే నా తపశ్శక్తి తగ్గి ఉండాలి. లేదా నా ప్రారబ్ధం అయినా అంత బలవత్తరంగా ఉండి ఉండాలి. అందువలన ప్రారబ్ధం అనుభవించటం ఒక పక్షం. ఇదికాదని మీ వెంట, కోర్టుల వెంట తిరిగి సత్యాలు, అసత్యాలు, సత్యాసత్యాలు పలుకుతూ, మీకు లంచాలిచ్చి, పోయిన సొమ్ము తిరిగి సాధిస్తే వచ్చేది సొమ్ము కాదు మరింత పాపం. దాంతో బాటు తితిక్ష లేక పోవటంతో మళ్ళీ తపోభంగం. ఇంతా చేసి మీరు ధర్మశాస్త్ర ప్రకారం శిక్షలు వేయరు. నవీన చట్టం ప్రకారం ఏవో శిక్షలు వేస్తారు. ఈ రుసుం వలన పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. కనుక విషయం దైవానికి వదిలితే కర్తవ్యం అదునే చూసికొంటాడు. నాకు ఎవరో ఇస్తే వచ్చినవి. ఎవరో తీసికొంటే పోయినవి. ఇందులో నాదంటూ ఏమీలేదు. ఆ దేవి ఏది ఇస్తే ఏది మిగిలిస్తే అదేనాది. సొంత అవసరానికి మించి ఏది సేకరించినా అట్టి బ్రాహ్మణుడు గూడా "చోరుడే" అని మనుస్మృతి. కనుక మనం గూడా పాపానికి అతీతులం కాదు. కనుక ఈ కాలాన్ని తపస్సుకు వినియోగిస్తే "ప్రారబ్ధక్షయం" అవుతుంది. పాపక్షయం అవుతుంది. ఇది వారి భావనా సారాంశం అని నాకు గుర్తు. ఇదీ విద్యాలో స్మృతి.

ఇలా ఏమి జరిగినా బాలాంబికపై భారం వేయడమే, "సమలోష్టాశ్మ కాంచనః" అన్నట్లుగా ఉండటమే వారి పద్ధతి.

19. ఒకసారి తమ తమ్ముని అల్లుడి యజ్ఞానికి వెళ్ళారు. అక్కడ యజ్ఞసంకల్పం విన్నారు. అందులో అటు ఇటు '7' తరాల వారికి "దౌర్బ్రాహ్మణ్య" నివృత్తికి యజ్ఞం చేస్తున్నట్లు అర్థమయింది. అంటే కనీసం వంశంలో ఒక్కరయినా యజ్ఞం చేయకపోతే అటువంటి వారు "దుర్బ్రాహ్మణులు" అని సారాంశం. ఒక్కరయినా యజ్ఞం చేస్తే ముందు వెనుకల '7' తరాల వారికి దుర్బ్రాహ్మణత్వం పోతుందని పిండితార్థం. అంతే! అక్కడనే యజ్ఞ సంకల్పం మనస్సులో రూపుదిద్దుకొన్నది. తన తమ్ముని జ్యేష్ఠ పుత్రుడు శ్రీ తాడేపల్లి లక్ష్మీధరశాస్త్రి చేత యజ్ఞం చేయించారు. నిజంగా యజ్ఞమంటే అదే. మామూలుగా ఈ రోజులలో యజ్ఞం చేసేవారు దేశంలో యజ్ఞ ద్రవ్యం యాచించి తెచ్చి వీలయినంత తక్కువ ఖర్చుతో యజ్ఞం ముగించి మిగిలిన ధనం నిలువచేస్తారు. ఆర్థిక పరిస్థితులు అట్లాంటివి. కాని వీరు "యజ్ఞభిక్ష" గా వచ్చిన అర్థాన్ని పదార్థాన్ని గూడా యజ్ఞంతోనే పూర్తి చేశారు. నవరాత్రులలో గూడా అంతే! నవరాత్ర పూజలు మొదలుపెట్టిన తర్వాత భక్తుల నుంచి శిష్యుల నుంచి వచ్చిన ద్రవ్యమంతా నవరాత్రులలో ఖర్చు కావలసినదే. మహానవమి, విజయదశమి నాడు అష్టాదశ వర్ణాలకు ఆరగింపు ఉంటుంది. ఇక ఏవన్నా మిగిలితే ఏకాదశి నాడు సత్యనారాయణ వ్రతంతో పూర్తి అవుతాయి. మిగిలేదంటూ వుంటే వారు చేసిన అప్పు, వారి సొంత ధాన్యం. అంతే! ఇక యజ్ఞంలో సంగతి చెప్పేదేముంది. ఆ యజ్ఞం జరిగిన వారం రోజులు బస్సులు కిటకిట లాడినవి. "అన్న దానం" అపరిమితంగా సాగింది. గురువుగారి దర్శనం చేసికోవటం గూడా సాధ్యం కాక మావంటి వారము గూడా వెనుదిరుగవలసి వచ్చింది. అంత జనం. అంత అన్నదానం. ఆనాడు అదొక వార్త.

20. వారి ప్రథమకాశీయాత్రలో ఒక అనుభవం. తెల్లవారుజామున నారద ఘట్టంలో గంగా తీరంలో ప్రాణాయామం చేస్తున్నారు. ఆ ధ్యానంలో వారికి ఒక 'తేజోరాశి' కనబడింది. ఆ తేజస్సుకు అడుగున పళ్ళవరుస, దాని క్రింద ఎఱ్ఱని పెదవి గోచరించాయి. అది కాశీ అంతా వ్యాపించినట్లున్నది. తరువాత ప్రొద్దున స్నాన సమయంలో పురోహితులు "గౌరీముఖే" అని సంకల్పం చేయించారు. ఆ సంకల్పం అర్థం ఏమిటి అని పురోహితులను అడిగారు. వారు తరతరాలుగా ఇలా చేయిస్తున్నాం. అర్థం తెలియదు అన్నారు. ఏమిటో యీ దర్శనం? ఈ సంకల్పం అనుభూతి అర్థం కాలేదు. తమ వసతికి వచ్చారు. మనస్సు మాత్రం అనుభూతి మీదనే నిలిచిపోయింది. తరువాత ఒక కాశీ పండితుని దర్శనానికి వెళ్లారు. ఆ పండితుడు బయటకు వచ్చేలోపుగా వీరు వాకిట్లో కూర్చొనియున్నారు. ఎదురుగా బల్ల మీద ఒక పుస్తకం ఉన్నది. యథాలాపంగా తెఱచారు. అది దేవీ భాగవతం. తెఱచిన వెంటనే వచ్చిన ఘట్టం "దక్ష యజ్ఞం" లో సతీదహనం. అందులో విష్ణుబాణాలతో ఛిన్నమయిన సతీదేవి శరీర భాగాలతో ప్రధానమైన "ముఖం" కాశిలో పడినట్లు వర్ణన ఉంది. అంతే! సందేహం తటాలున విడిపోయింది. అప్పుడు వీరి నోటి నుండి తరలి వచ్చిన శ్లోక గంగ ఇదిగో!

కనుగొంటింగనుగొంటి గౌరి శుభవక్త్రంబిందు గన్గొంటి నే
గనుగొంటిన్నవపల్లవాధరము, ముక్తాదంత సంస్ఫీతమున్
గనుగొంటిన్ గనుగొంటి నందును హిరణ్యజ్యోతి రుద్దామభీ
షణ సౌమ్యాకృతి విశ్వనాథపదపంచ క్రోశ భూలింగమున్

తమకు గంగలో అయిన అనుభూతికి ఈ పురాణంలో యథాలాపంగా కనపడిన ఘట్టానికి ప్రేరకులెవరో! ఆ విశాలాక్షియే కదా! విశాలాక్షి

కటాక్ష వీక్షణాలు శ్రీగురువులై తనను వెన్నంటియున్నట్లే గదా! ఆ మూలంగా అష్టాదశ శక్తిపీఠాల మూల కథలు అబద్ధం గావని మనకు గూడా తెలిసినట్లే గదా!

21. మఱొక సంఘటన. నేను దీనికి ప్రత్యక్ష సాక్షిని. గుంటూరు నుంచి అనుకొంటాను – ఊరి పేరు బాగా గుర్తులేదు. ఒక స్త్రీ ఆమె తండ్రి సోదరులు వచ్చారు. మేము అంతా గురువుగారి వద్ద పాఠం చదువుతున్నాము. సుమారు సాయంకాలం 3-4 గంటల ప్రాంతం. ఆ స్త్రీ పిశాచగ్రస్తురాలట. అందువలన కాపురం గూడా పోయింది. ఆమెన్ను తండ్రి సోదరుడు చివఱి ప్రయత్నంగా – ఎవరో చెబితే గురువు గారి వద్దకు తెచ్చారు. మాకు పాఠం చెబుతూనే గురువుగారు ఏదో మంత్రించి ఆమె నుదుటి మీద, జడ మొదట్లో చేయి పెట్టి పరీక్షించారు. అంత వఱకు మౌనంగా ఉన్న ఆమె క్రమక్రమంగా వికృత ప్రవర్తన మొదలుపెట్టింది. చేతులకున్న రబ్బరు గాజులు మొత్తం కొఱికి తిన్నది. మేము భయంతో బిక్క చచ్చిపోతున్నాం. గురువు గారు మంత్రించి చేత్తో సున్నితంగా '2' దెబ్బలు ఆమె చెంప మీద వేశారు. ఆమె ఆవేశం తగ్గింది. క్రమంగా పూనకం పోయింది. ఒళ్ళు తెలిసింది. ఆ ఒళ్ళు తెలిసేక్రమంలో; తన బ్రతుకు ఈ పిశాచ బాధవలన పాడయిందని తగ్గించి తన కాపురం నిలబెట్టమని ఏడ్చింది. ఆ తరువాత ఆమెకు ఆహారంగా ఇంట్లోంచి అరటిపండ్లు తెచ్చియిస్తే ఆమె వాటిని తినలేక పోయింది. ఇలా పూనకం వచ్చినపుడల్లా గాజులు లాంటి కఠిన పదార్థం తినటం వల్ల దంతాలు బాగా దెబ్బతిన్నాయట. అందువలన అన్నం కాదు గదా! అరటి పండ్లు గూడా తినలేని పరిస్థితి వచ్చిందట. ఇంకో చిత్రం ఏమంటే గురువు గారి దగ్గఱకు బయలుదేరిన ఆమెకు చందోలులో బస్సు దిగగానే "అక్కడకు వద్దు వెనక్కు వెళ్ళమని" హెచ్చరికలు వినబడ్డాయట. బంధువులు బలవంతంగా తీసికొని

వచ్చారు. సరే, గురువుగారు తర్వాత తమ మహా విద్యా తీర్థమును, విభూతిని ఇచ్చి పంపారు. ఆమె ఆ తరువాత బాగుపడిందని తెలిసింది. ఇదంతా ఒక గంటసేపు జరిగిన విషయం. ఇక్కడ నిమ్మకాయలు, ఎముకలు, కుంకుమలు, భయంకర మంత్రోచ్చారణం, వేపమండల బాదుడు లాంటి సినిమా మాంత్రిక దృశ్యాలు లేవు. ఈ విషయాలకు నేను ప్రత్యక్ష సాక్షిని. ఇంతటి శక్తి మంతులు శ్రీ గురువులు.

22. ఒక నాగుల చవితి నాడు వీరు పొలంలో నడుస్తున్నారు. నాగలి చాలులో ఒక నల్లత్రాచు నిద్రపోతుంది. వీరి కాలు తగిలి లేచింది. బుస కొట్టింది. వీరు గమనించారు. కాటు వేయుటకు సిద్ధంగా ఉన్నది. మనస్సులో గరుడ మంత్రం అందుకొన్నది. సర్పం తలవంచి నేల కూలింది. మెల్లగా దూరంగా వెళ్ళిపోయింది. అయినా పాములు పగ పడతాయంటారు. కనుక ఆ రాత్రి నిద్రించేదాకా గరుడ మంత్ర పారాయణం సాగింది. ఆ రాత్రికలలో "సువర్ణుడు" వారి చుట్టూ పరిభ్రమిస్తున్నట్లు కనబడ్డాడుట.

ఇలాగే మఱొకసారి, విద్యార్థులు తోటలో చెట్లకు నీళ్ళు పోస్తున్నారు. ఒక పిల్లవాడు చూడక పాము మీద నీళ్ళ ద్రిమ్మరించాడు. పాము బుస్సున లేచింది. అంతా భయపడినారు. ఆ సమయానికి గురువుగారు మైలు దూరంలో చెన్నకేశవాలయంలో ఏదో పురాణ ప్రసంగంలో ఉన్నారు. మనస్సు కీడు శంకించింది. దేవాలయ ధ్వజస్తంభం మీదనున్న గరుడ పక్షి ఒక్కటి రివ్వున వీరింటివైపుగా దూసికొని పోయింది. ఎందుకో వీరికి మనస్సు కాస్త ఊఱట చెందింది. ఇంటి వచ్చిన తర్వాత అసలు విషయం తెలిసింది. అలా బుస్సుమని లేచిన ఆ నాగసర్పాన్ని ఒక "గరుడపక్షి" తన్నుకుపోయిందని లేకపోతే అనర్థ జరిగేదని అందఱు చెప్పారు. అలా భగవంతుడు, మంత్రదేవత వారిని వారి ఏలుబడిలో ఉన్న వారిని కనిపెట్టి ఉండేవారు.

23. మధ్య వయసు రోజులలో, ఒకనాడు వీరు తిరుపతికి వెళ్ళారు. వీరికన్న క్యూలో ఒక మార్వాడీభక్తుడు ముందుగా నిలిచియున్నాడు. అతడు ఆ రోజులలో 1000 రూపాయలు ఇచ్చి స్వామికి భోగం జరిపించాడు. అతడు స్వామిముందు ఒక నిమిషం ఎక్కువసేపు ఆగాడు. అయినా అధికారులు నిరాదరణగా నెట్టారు. అది చూచిన గురువుగారు ఆ భక్తుని జబ్బ పట్టికొని లాగి "నీకు నేను దేవుణ్ణి చూపిస్తాను రా!" అని బయటకు తీసికొని వెళ్ళి ధ్వజస్తంభం పైకి చూపి "అక్కడ ఉన్నాడు స్వామి - చూడవయ్యా" అన్నారు. నిజంగానే అతనికి స్వామి దర్శనం అయింది. పిచ్చి ఆనందంతో గంతులు పెట్టాడు ఆ భక్తుడు. జనమంతా ధ్వజస్తంభం చుట్టూ మూగారు. అర్చకులు గూడా బయటకు వచ్చి వీరిని, ఆ భక్తుడిని సాదరంగా లోపలకి తీసికొని వెళ్ళారు.

24. వీరు ద్వితీయ పర్యాయం కాశీయాత్ర చేశారు. అందులో గంగాయాత్రలో గంగాదేవి గలగల లాడే బంగారు గాజులతో చేయి చాచి - "ఏరా! నాకేమి కానుక తెచ్చితివి?" అని అడిగిందిట. వారు ఈ సన్నివేశానికి సిద్ధంగా లేరు. ఏమీ తోచలేదు. తటాలున తమ చేతి నుంచి దర్భముడి ఉంగరం తీసి ఆ చేతిలో పెట్టారు. అంతటతో ఆ "దృశ్యం" అదృశ్యం అయింది. గంగాయాత్ర ముగించి ఇంటికి వచ్చి దేవతార్చన మొదలు పెట్టారు. అందులో ఆశ్చర్యంగా దర్భముడి ఉంగరం కనబడింది. ఈ భ్రాంతి ఏమిటో అర్థం కాలేదు. ఖచ్చితంగా తాను గంగాదేవి చేతిలో ఉంగరం పెట్టారు. అందులో భ్రాంతికి తావులేదు. మరి ఇదేమిటి? తమ వల్ల ఏమయినా పొరపాటు జరిగిందా? దేవి తన బహుమతిని నిరాకరించిందా? మనస్సులో ఈ ప్రశ్న వేధిస్తున్నది. ఇందు గురించి తీవ్రముగా తపస్సు మొదలు పెట్టారు. అందులో నిద్ర - యోగనిద్ర వచ్చింది. ఆ కలలో గంగమ్మ కనబడింది. ఏరా! నీవు పితృతర్పణలకు ఉపయోగించే దర్భముడి

ఉంగరం నాకెందుకు. నీవు అది లేకుండా పితృతర్పణలు ఎలా సాగిస్తావు? నీ భార్య నాకోసం ఒక కానుక తెచ్చింది. అది సమర్పించు అని చెప్పింది. కల చెదరింది. మెలకువ వచ్చిన తర్వాత వీరు తన సహధర్మచారిణి నడిగారు. "గంగమ్మకు కానుకగా వేయటానికి నా కాసుల గొలుసు తెచ్చాను" అని ఆమె చెప్పింది. వెంటనే వీరు ఆ కాసుల గొలుసును గంగలో సమర్పించి వచ్చారు. ఇలా జీవితమంతా దేవతల అనుబంధాలతో సాగింది.

25. ఒక సందర్భములో మాటలాడుతూ, నాకు శంకరుల మీద భక్తి ఉన్నట్లే రామానుజుల మీద, మధ్వాచార్యుల మీద గూడా ఆదరం ఉన్నది. శంకరులు నిర్గుణ శ్రుతులను వ్యాఖ్యానిస్తే వీరు సగుణ శ్రుతులను వ్యాఖ్యానించారు. రామానుజ జయంతి, మధ్వాచార్య జయంతి గూడా జరుపదగినవే, అని సెలవిచ్చారు.

26. వీరు ప్రథమంగా బాలాంబికకు భక్తులు, ఉపాసకులు కదా! తరువాత లలితా త్రిపుర సుందరీ పరాభట్టారికా పాదుకోపాసకులయినారు. నవరాత్రులలో ఉభయ దేవతలకు అర్చన జరుగుతుండేది. వయసు పైబడిన కొద్ది అర్చన భారం అవుతున్నది. అందువలన, అలానే పిల్లలకు అభ్యాసంగా ఉంటుందని బాలాంబిక పూజకు పిల్లలను నియోగించి లలితాంబిక పూజను తానే చేస్తూ వచ్చారు. ఈ లోపాన్ని సరిదిద్ది తన బిడ్డను, తన ఉపాసకుని, తన దారిలో పెట్టాలనుకొన్నది బాలాత్రిపురసుందరి. అందుకు సాధనం మరొక స్వప్నం. ఒకనాటి రాత్రి గురువుగారి పిన్నిగారు పిల్లలతో ఆడుకొంటున్నది. గురువుగారు ఆమెను చూచి "పిన్నీ! ఏమిటి పిల్లలతో ఆటలు, కాలక్షేపాలు నీకు? పెద్దదానివి కదా! అని హెచ్చరింపుగా అన్నారు. ఆమె అన్నది "నువ్వేగదా నాయనా! నన్ను పిల్లలకు అప్పజెప్పావు". అంతే వెంటనే

మెళకువ వచ్చింది. అంతేకాదు తన పొరపాటు గమనిక లోకి వచ్చింది. పాఠకులకు గుర్తుండే ఉంటుంది. గురువుగారు బాలాదేవిని 'చిన్నమ్మ' గా చెప్తుండటం, అప్పుడప్పుడు ఆమె "పిన్ని" గా స్వప్నదర్శనం ఇవ్వటం అలవాటే నని. ఈ విధంగా ఆ దేవి తన 'శరణాగతుని' తక్షణమే, గమనించి తత్క్షణమే సవరించిందంటే నిజంగా అంతటి భాగ్యం ఎంతయోగ్యత వలన లభిస్తుందో గదా! అనిపిస్తుంది.

కష్టానుభవాలు:-

ఎంతటి భక్తులు అయినా జీవితం ఎవరికి పూలపాన్పు కాదు. నల్లేరు మీద బండి కాదు. అందున సాధకులకు అడుగడుగునా శోధన ఎదురుబడుతూ వుంటుంది.

1. విద్యాలయం మూలంగా అయిన ఋణ భారాలు తండ్రిగారి "శ్రీరామకథామృతం" అనే భారీ గ్రంథముద్రణం, కుటుంబ నిర్వహణం - ఇవన్నీ ఒక్కసారిగా మూగినవి. అయినా మొక్కవోని ధైర్యంతో ఎదుర్కొన్నారు. తండ్రిగారి గ్రంథాన్ని ప్రచురించి చందాదారులు అందఱికి సమర్పించిన తరువాత వారు పొందిన ఆనందానికి మేఱలేదు. కనుకనే వారి నోటినుంచి ప్రవహించిన పద్య స్రవంతి నుండి ఒక పద్యము

ధన్యుడ ధన్యుడన్ జనక! త్వాదృశ తాదృశ కావ్యమందు స
మ్మాన్య భవత్సమాధిగరిమంబున గాకిటు నన్నుబోటి, క
న్యాన్యత వేలు పెట్టుదగునా? తుది మెట్టిది తప్పొయొప్పొ, మేల్
ధన్యుడ ధన్యుడన్ మఱియు ధన్యుడ ధన్యుడ నేనె ధన్యుడన్॥

2. 15 ఏండ్లు పెరిగిన పుత్రుడు అకస్మాత్తుగా పోయినాడు. ఆ బాధతో వారి పెద్ద తమ్ముడు గూడా చనిపోయినాడు. ఇద్దఱు పిల్లల తల్లి అయిన కూతురు పోయింది. రెండవ మనుమడు స్తనంధయుడు - అతను తల్లి

వెంట కొంత కాలానికే పోయినారు. ఒక్క మనుమడు మాత్రమే మిగిలారు. తరువాత పెద్దవయసులో మఱొక తమ్ముడు పోయినారు. మలి మునలితనంలో తన సహధర్మచారిణి స్వర్గస్థురాలయినారు.

అయినా పరాశక్తి పై కోపం రాలేదు. పచ్చన్ని సంసారాన్ని పెరకు తగిలించి చివఱకు సంసారాన్నీ మిగల్చలేదు. ఎందుకీ "కంచిగరుడసేవ" అని కోపం రావచ్చును. కాని సంసారంలో సుఖదుఃఖాలు సహజం అని సమానంగా సహనంగా స్వీకరించాలని "యోగి" ప్రత్యేకంగా కనబడి చెప్పిన దందుకే గదా! ఆ గుర్తులతో దుఃఖాలను భరించడం పరమేశ్వరి పాదాలను వదలక పోవడం వారి యోగిత్వానికి నిదర్శనం. ఋషిత్వానికి దృష్టాంతం. రోజూ పూజ తర్వాత చదివే శ్లోకం ఏదో "చదవాలని చదివాము కాకా" ఆచరణలో అనుభవంలో చేసి చూపినారు. ఆ శ్లోకం

"పాతయ వా పాతాళే స్థాపయ వా సకలలోక సామ్రాజ్యే
మాతః తవ చరణయుగం నాహం ముంచామి నైవ ముంచామి॥"

అనగా, "అమ్మా! నీవు పాతాళంలో పడదోసినా, సకలలోక సామ్రాజ్యంలో స్థాపించినా నీ పాద ద్వంద్వము మాత్రము వదలను" అని. అదే జరిగింది.

అజ్ఞస్య దుఃఖౌఘమయం జ్ఞస్యానందమయం జగత్
అంధం భువన మంధస్య ప్రకాశం తు సుచక్షుషామ్॥

అని, వరాహోపనిషత్తులో చెప్పినట్లు జ్ఞానికి ప్రపంచమంతా ఆనందమయమే కాని దుఃఖం అంటూ కనబడదు. గురువుగారు రోజూ చేసే ప్రార్థనా శ్లోకం లోనే

ప్రకాశమానే పరమాత్మభానౌ నశ్యత్య విద్యాతిమిరే సమస్తే
అహో బుధాః నిర్మలదృష్టయోపి కించిన్న పశ్యంతి జగత్సమగ్రమ్॥

అని ఉన్నది. జ్ఞానులకు ప్రపంచం కనబడదు. అధిష్ఠానమయిన బ్రహ్మమే కనబడు తుంది. అది ఆనందస్వరూపమే. కనుక సుఖదుఃఖసమములై జీవితాన్ని తటస్థంగా స్వీకరించి తను జీవితాన్ని నిర్వహించారు. ఆ జీవితం అంతా బాలాంబికా సపర్యతోనే గడిపారు. చివఠి రోజులలో స్మృతి తగ్గుతూ వచ్చింది. ఆ సందర్భంలో మనస్సులో తట్టినవి తట్టినట్లుగా కొన్ని పద్యాలు శ్లోకాలు వచ్చినవి. అవి విరమించుకోబోతున్న మస్తిష్కశక్తిలో మిగిలి ఉన్న కవితా కణికలు. అందులో ఒకటి బాలాంబికకు తన జీవిత కావ్యాన్ని అంకితమిచ్చిన శ్లోకం.

జన్మాన్యతీతాని కియంతి మేహో
ఉచ్చావచత్వం యదభూత్సుఖదుఃఖ హేతో,
ఆ జీవదాసతమతాం అభిపద్య పుణ్యాత్
బాలే! త వానుగ్రహవశా న్మమ సుప్రభాతమ్॥

బాలాంబికా! ఎన్ని జన్మలు గడచినవో తెలియదు. సుఖదుఃఖాల మూలంగా ఎన్ని ఎత్తుపల్లాలు వచ్చినవో ఈ జన్మలలో. నా పుణ్యం వలన నేను నీకు ఆజీవ దాసుడనయినాను. నీ అనుగ్రహం వలన నాకు 'సుప్రభాతం' అయింది తల్లీ !

ఈ శ్లోకం 'బాలాంబిక గుడి' వారు తీసికొని తమ దేవాలయ ముఖద్వారమున పాలరాతి ఫలకంపై చెక్కించారు. ఈ గుడి తెనాలి గంగానమ్మపేటలో రామలింగేశ్వరాలయం వద్ద ఉన్నది. చిన్నగుడి అయితే ఏం? దీనికి గురువుగారి 'వరం' ఒకటి ఉన్నది. వీరి చివఠి రోజులలో బాలాంబిక మాటికి కనబడి 'ఏదయినా కోరిక కోరుకో! వరం ఇస్తాను' అని అడిగేదట! వారికా వయస్సులో ఏం కోరికలుంటాయి. అపుడు 'తెనాలి బాలాంబిక గుడిలో నన్ను తలచికొని మ్రొక్కిన వారికి న్యాయమైన కోర్కె ఒక్కటి తీర్చవలసినదని అడిగినారట. అందువలన ఆ గుడికి ఆ వర ప్రభావం ఉంది.

వారి మాటలలోనే "వార్ధక్యమును సహజముగా అనుభవముతో శరీరమును ఆగమికన్యాసానుభవముతోను అంతశ్శరీరము యోగిక చక్రన్యాసముతోను ఈ సర్వమును పరాపర బ్రహ్మానుభవ ప్రణవ పరినిష్ఠితాత్మానుభవముతోడను గడుపవలెనని కోరుదు"

అని తమ కాలక్షేప పద్ధతిని శ్రీరామకథామృత కవికుమార పీఠికలో స్వయంగా వ్రాశారు. ఇలా జీవితమంతా దేవహితంగా నడిపారు.

"వ్యశేమ దేవహితం యదాయుః"

ఈ కొడుకు గొప్పతనాన్ని గుర్తించిన తండ్రి వెంకటప్పయ్యశాస్త్రిగారు తన భార్యతో "నీవు రత్నగర్భ" వని పొగడినారు.

అష్టావధానాది కలాకలాప పీఠం సమీక్ష్యాస్య పితా ప హృష్ట
త్వం వీరమాతేతిచ రత్నగర్భే త్వంవాం శతంసైవ వయం కృతార్థః

శ్రీగురుచరితం

భారతప్రధాని శ్రీ పి.వి. నరసింహారావుగారు (అప్పటికి కేంద్రమంత్రిగా ఉన్నారు) ఒకసారి కంచిలో పరమాచార్య మీద కవిత్వం వ్రాసి చదివారు. పరమాచార్య ఆ కవిత్వంలో లోపాలను దిద్దారు. అప్పటనే ఉన్న గురువుగారు గూడా ఆశువుగా కంచివారిపై కవిత్వం చదివారు. ఈ కవిత్వంలో కొన్ని లోపాలున్నాయని శ్రీ పి.వి.నరసింహారావుగారు వ్యాఖ్యానించారట. అప్పుడు కంచిస్వామి అన్నమాటలు శ్రీగురుచరితంలో అక్షర నిబద్ధం అయినాయి.

జన్మ ప్రవృత్తి కవితా త్రితయే నిర్దోష ఏష లోకస్య
భూషణ మితి కాంచీయతి పతినా సంభావితో మహాచార్యః॥

జన్మలోగాని, ప్రవృత్తిలోగాని కవితలో కాని ఈయనకు దోషాలుండవు. ఈ మహాత్ముడు "లోకభూషణం" అని అర్థము. ఈ విషయం వివరంగా నీలంరాజు వెంకట శేషయ్యగారి "నడిచే దేవుడు" అనే గ్రంథంలో

చూడవచ్చును. ఈ మహామహుడు మా అందఱి దురదృష్ట వశమున ప్రమోద మార్గశిర బహుళ దశమీ సోమవారం రాత్రి 12-40 ని॥కి (10-12-1990) శ్రీచక్రేశ్వరి నవావరణములలో సభ్యత్వం పొందారు. వెళ్తూవెళ్తూ అవనమ్మకమయిన లోకానికి శాశ్వతమయిన నమ్మకం కలిగించే సంఘటనను ఇచ్చారు. చితిమంటల పొగలో వారి తలవైపున ఒక ధూమమూర్తి ఆకారము దర్శనమిచ్చింది. అది అదృష్టవశాత్తు ఒక ఫొటోలో గుర్తింపగలిగాము. ఈ చిత్రం ఆంధ్రభూమి పత్రికలో సెంటర్ స్ప్రెడ్‌లో వచ్చింది. ఆంధ్రదేశంలో అందరికి పరిచయమే. ఈ విషయాన్ని శ్రీగురుచరిత్ర కవి ఇలా వర్ణించారు.

జ్వాలా మాలినికేవ విశ్వజననీ
తీర్థస్య యత్సాక్షిణీ
యావజ్జీవ ముపస్థితా భారత
వాక్యం చాహ చిత్యాం స్థితా
తన్మే కావ్యకలాత్ర కావ్యసవనే
మన్యే స్వయం సాక్షిణీ
చక్రే సావబృథం స్వసూను
చరితం మాతా పరోక్షప్రియా

అట్లే ఈ వ్యాసం వ్రాసే అర్హత సంపాదించినది నా పుణ్యరాశి.

“ప్రణంతుం స్తోతుం వా కథమకృత పుణ్యః ప్రభవతి”. శక్తిని ప్రసాదించినది శ్రీగురుద్వంద్వము లేదా శ్రీగురుత్రయి. దానికి నమస్కృతులు.

స్ఫటికాక్షమాలికావర్తనంబుల చేత
నవదాతయై శుద్ధయైన దాని,
ఉపశతనవరాత్రు లుపచిత కుంకుమ
సిందూర శోణయై చెలగు దాని
వైశ్వదేవాంచిత బల్యన్న పీయూష
కణ సహస్రమ్ముతో కలియుదాని,

పాఠపురాణాది ప్రవచనవేళలో
మమ్ము చిన్నారులై “మంచు” దాని
భస్మకుంకుమ తీర్థముల్ భక్తపాళి
కిచ్చు వేళకు “త్రిపుటియై” వచ్చు దాని
అక్షతల నార్షకవితల నలరుదాని
శ్రీ మహాగురు నంగుళిశ్రీ నుతింతు. (భావన్యాందోళనం నుండి)

ఈ అంగుళిశ్రీ కై నా ‘అంగుళిత్రయి’ కృతజ్ఞతలు.

అవకాశం అనుగ్రహించినది అరుణానందస్వామివారు. “నియోగం” తెచ్చినది రావి మోహనరావుగారు. ప్రకాశం ఇచ్చినది “ఆత్మజ్యోతి”. వినియోగం చేసినవారు పాఠకులు. ప్రచురణ భాగ్యము అందించినవారు సాధన గ్రంథమండలివారు. అందరికి నా కృతజ్ఞతలు.

గురుదేవా!

జపియింపవలసిన స్ఫటికమ్ముతో గోలి
కాయలాడెడి చిన్నప్రాయమందు
ఏ పూర్వ పుణ్యమో ఏ ఋణశేషమో
తమ గూటిచిలకగా స్థానమిచ్చి
మీ కంటితుడుపుగా మీ కౌఁగిలింపగా
శ్రమపడినట్లుగా చదివికొంటి
ముద్దను పారేసి మోచేతి నాకిన
తీఱుగా మీ కథల్ తీర్చుచుంటి
ఋణము గుణమాయె గుణములు ఋణములాయె
మనకు మూఢవలక్షణ మాన్యమాయె
తెలిసి తెలియని తనమాయె తెంపులాయె
ఏదో వ్రాయుట ఆయె స్వామీ! ఇదాయె.
తమ చరణములకు సమర్పితము.

భవాని భుజంగ స్తవమ్

. శ్రీ శంకరాచార్య కృతమ్

శ్లో॥ షడాధార పంకేరుహాంతర్విరాజ
త్సుషుమ్నాంతరాళే ఽతితేజోలసంతీం ।
సుధామండలం ద్రావయంతీంపిబంతీం
సుధామూర్తి మీడే చిదానంద రూపం ॥ 1

శ్లో॥ జ్వలత్కోటి బాలార్క భాసా ఽరుణాంగీం
సులావణ్య శృంగార శోభాభిరామాం ।
మహాపద్మ కింజల్క మధ్యే విరాజత్
త్రికోణేనిషణ్ణాం భజే శ్రీ భవానీమ్ ॥ 2

శ్లో॥ క్వణత్కింకిణీ నూపురోద్భాసిరత్న
ప్రభాలీఢలాక్షార్ద్ర పాదాబ్జయుగ్మం ।
అజేశా ఽచ్యుతా ఽ ఽద్యైస్సురై స్సేవ్యమానాం
మహాదేవి ! మన్మూర్ధ్ని తేభావయామి ॥ 3

శ్లో॥ సుశోణాంబరాబద్ధనీవీవిరాజ
న్మహారత్నకాంచీకలాపం నితంబం ।
స్ఫురద్దక్షిణావర్తనాభిం చ తిస్రో
వలీరంబ ! తే రోమరాజిం భజే ఽహమ్ ॥ 4

శ్లో॥ లసద్వృత్త ముత్తుంగ మాణిక్యకుంభో
పమశ్రీస్తనద్వంద్వ మంబా ఽంబుజాక్షి ।
భజే దుగ్ధపూర్ణాభిరామాం తవేదం
మహాహారదీప్తం సదాప్రస్నుతాస్యం ॥ 5

శ్లో॥ శిరీషప్రసూనోల్లసద్బాహుదండై
ర్జ్వలద్బాణకోదండ పాశాంకుశైశ్చ ।
చలత్కంకణోదార కేయూరభూషో
జ్జ్వలద్భిర్లసంతం భజే శ్రీ భవానీమ్ ॥ 6

శ్లో॥ శరత్పూర్ణ చంద్రప్రభాపూర్ణ బింబా
ధరస్మేర వక్త్రారవిందాం సుశాంతాం ।
సురత్నా ఽ ఽవళీహార తాటంకశోభాం
సదాసుప్రసన్నాం భజే శ్రీ భవానీమ్ ॥ 7

శ్లో॥ సునాసాపుటం సుందరభ్రూలలాటం
తవౌష్ఠశ్రియం దానదక్షం కటాక్షం ।
లలాటోల్లస ద్గంధకస్తూరి భూషం
స్ఫురచ్ఛ్రీముఖాంభోజ మీడేహమంబ ॥ 8

శ్లో॥ చలత్కుంతలాంతర్భ్రమద్భృంగ బృందం
ఘనస్నిగ్ధ ధమ్మిల్ల భూషోజ్వలంతే ।
స్ఫురన్మౌళి మాణిక్యబద్ధేందు రేఖా
విలాసోల్లస ద్దివ్యమూర్ధానమీడే ॥ 9

శ్లో॥ ఇతి శ్రీ భవాని ! స్వరూపం తవేదం
ప్రపంచాత్పరం చాతి సూక్ష్మం ప్రసన్నం ।
స్ఫురత్వంబ డింభస్య మే హృత్సరోజే
సదావాఙ్మయం సర్వతేజోమయం చ ॥ 10

శ్లో॥ గణేశా ఽణిమాద్యా ఽఖిలై శ్శక్తి బృందై
ర్వృతాంవైస్ఫురచ్చక్రరాజోల్లసంతీం ।
పరాం రాజరాజేశ్వరి త్రైపురి ।
శివాంకోపరిస్థాం శివాం భావయామి ॥ 11

శ్లో॥ త్వ మర్క స్త్వమిందు స్త్వమగ్ని స్త్వమాప
స్త్వమాకాశ భూ వాయవ స్త్వం మహత్త్వం

త్వదన్యో నకశ్చితే ప్రపంచో ఒస్తి సర్వం
త్వమానంద సంవిత్స్వరూపాం భజేహం ॥ 12

శ్లో॥ శ్రుతీనా మగమ్యే ! సువేదాగమజ్ఞా
మహిమ్నో నజానంతి పారం తవాంబ ।
స్తుతిం కర్తు మిచ్ఛామి తే త్వం భవాని !
క్షమస్వేదమత్రప్రముగ్ధః కిలాహం ॥ 13

శ్లో॥ గురుస్త్వం శివస్త్వం శక్తి స్త్వమేవ
త్వమేవా ఒసిమాతా పితాచ త్వమేవ ।
త్వమేవా ఒసి విద్యా త్మవమేవా ఒసి బంధు !
ర్గతి ర్మే మతి ర్దేవి సర్వం త్వమేవ ॥ 14

శ్లో॥ శరణ్యే ! వరేణ్యే ! సుకారుణ్యమూర్తే
హిరణ్యాదరాద్యే రగణ్యే ! సుపుణ్యే !
భవారణ్య భీతే శ్చ మాం పాహి భద్రే !
నమస్తే నమస్తే నమస్తే భవాని ! ॥ 15

శ్లో॥ ఇతీమాం మహచ్ఛ్రీ భవానీభుజంగ
స్తుతిం యః పఠే ద్భక్తియుక్తశ్చ
తస్మై ! స్వకీయంపదం వేదసారం !
శ్రియం చేష్టసిద్ధిం భవానీ దదాతు ॥ 16

శ్లో॥ భవానీ భవానీ భవానీ త్రివార
ముదారం ముదా సర్వదా యే జపంతి ।
నశోకో నమోహో నపాపం నభీతిః
కదాచిత్ కథంచిత్ కుతశ్చి జ్జనానాం ॥ 17

ఇతి శ్రీ శంకరాచార్య రచిత
భవానీ భుజంగ ప్రయాత స్తవం సంపూర్ణమ్:.